

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-8-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 198 పేజీలు: 8+16 వెల: 6.50



తెరచుకున్న శబరిమలై.. ప్రత్యేక పూజలు నిర్వహణ

గాజా పౌరులకు వీసాలు నిలిపివేసిన అమెరికా

5


# ప్రతీ ఓటరుకు ఇసి దన్ను



ఆదివారం మీడియాతో సిఇసి జ్ఞానేశ్వర్

### రాజకీయ పార్టీలపై వివక్ష లేదు

### ఆ 65 లక్షల ఓటర్ల జాబితా వెల్లడించాం

### ఓటరు చోరీ ఆరోపణలకు భయపడం

### విపక్షాల ఆరోపణలకు సిఇసి కౌంటర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** రాజ్యాంగ బద్ధమైన ఎన్నికల సంఘాన్ని అవమానిస్తున్నారని, యావత్‌భారత ఎన్నికల ప్రక్రియనే రాజకీయ పార్టీలు విమర్శిస్తున్నట్లయిందని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అన్నారు. ఓట్లచోరీ అంటూ విపక్షాలు, ఎఐసిసి నాయకుడు రాహుల్‌గాంధీ చేస్తున్న ఆరోపణలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. అన్ని రాజకీయ

>>2

### ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా

# సిపి రాధాకృష్ణన్



**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** భారత ఉపరాష్ట్రపతి పదవికిఎన్డీయే పక్షాల తరపున మహారాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌ను ఎంపికచేసారు. ఆదివారం జరిగిన బిజెపి పార్లమెంటరీ బోర్డు సమావేశంలో సుదీర్ఘ చర్చల అనంతరం రాధాకృష్ణన్ పేరును ఖరారుచేసారు. బిజెపి అధ్యక్షుడు జెపినడ్డా రాధాకృష్ణన్ పేరును అధికారికంగా ప్రకటించారు. 1957 మే 4న జన్మించిన సిపి రాధాకృష్ణన్ తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానంనుంచి రెండుసార్లు బిజెపి తరపున ఎంపిగా ఎన్నికయ్యారు. తమిళనాడు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా కూడా పనిచేసారు. 2016 నుంచి

>>2

సుదీర్ఘ చర్చల అనంతరం ఖరారు చేసిన బిజెపి పార్లమెంటరీ బోర్డు

గతంలో కోయంబత్తూరు నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం..

ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా విధులు

### స్థానిక సంస్థల ఎన్నికలపై

# గడువు కోరదామా?

### 23న గాంధీ భవన్‌లో పిఎసి సమావేశం

### సిఎం రేవంత్‌తో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ చర్చలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు17:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ,బీసీ రిజర్వేషన్లపై కీలక నిర్ణయం తీసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ(పిఏసీ) సమావేశం ఈనెల 23న సాయంత్రం 5 గంటలకు గాంధీ భవన్‌లో నిర్వహించబోతున్నది. ఈ మేరకు పీఏసీ సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి... టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సూచించారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో రేవంత్‌రెడ్డితో మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశం అయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితర నాయకులు ఈ భేటీలో పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్లు,స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ సంస్థాగత నిర్మాణం తదితర అంశాలపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. కాగా, సరిగ్గా వారం రోజుల క్రితం సిఎంతో మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశమయ్యారు. ఈనెల 16 లేదా 17న పిఏసీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. కానీ అది జరగలేదు.తాజాగా ఈ ఇరువురు మరో సారి సమావేశం కావడం రాజకీయంగా ఆసక్తిగా మారింది. కాగా, తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ హైకోర్టు ఇచ్చిన(సెప్టెంబర్ నెలాఖరు) గడువులోగా పూర్తవుతుందా? లేదా అనే అంశంపై

>>2

21న ఒయులో జరిగే కార్యక్రమానికి సిఎంను ఆహ్వానించిన ప్రొఫెసర్లు 2



న్యూఢిల్లీలో 8 లేన్ల ఎక్స్‌ప్రెస్‌వే ప్రారంభించిన అనంతరం రోడ్డుపై నడుస్తున్న ప్రధాని మోడీ

# వికసిత్ భారత్‌కు ఢిల్లీ ఓ నమూనా

### ప్రజల ఆశీర్వాదం చూసి తట్టుకోలేకపోతున్నారు: ప్రధాని మోడీ

### దేశంలో మొట్టమొదటి 8 లేన్ల అర్బన్ ఎక్స్‌ప్రెస్‌వేలు జాతికి అంకితం చేసిన ప్రధాని

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** దేశరాజధాని ప్రాంతం, రాజధాని నగరం చుట్టూ బిజెపి పాలన కొనసాగుతోందని, దీన్ని చూసే కొందరు ఓర్వలేకపోతున్నారని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. బిజెపి భారీ ఎత్తున చేపట్టిన అభివృద్ధిని చూసి వారికి వణుకు ప్రారంభం అయిందన్నారు. మనకే ఢిల్లీ ప్రజల ఆశీర్వాదాలు ఉన్నాయని చూపిస్తుందని కొందరు దీన్ని తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. వారంతా ప్రజలకు దూరంగా ఉన్నారన్నారు. నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో దాదాపు రూ.11వేల కోట్ల విలువైన రెండు కీలకమైన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు. వీటిలో ఢిల్లీ సెక్షన్‌లోని ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్2 ఉన్నాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఢిల్లీ, హర్యానా ముఖ్యమంత్రులు రేఖ గుప్తా, నయాబ్ సింగ్ సైనీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని ముండ్కాలో రోడ్ షో నిర్వహించారు. ఢిల్లీకి ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ కనెక్టివిటీ లభించనున్నది. కొత్త ఎక్స్‌ప్రెస్‌వే నుంచి ప్రతి

>>2

### 21 నుంచి రాష్ట్రవ్యాప్తంగా

# బిజెపి టూర్

### 566 మండలాలలో బిజెపి చీఫ్ రాంచందర్‌రావు ర్యాలీలు

**హైదరాబాద్, ఆగస్టు 17 ప్రభాతవార్త:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని బిజెపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సంస్థల ఎన్నికల విషయంపై రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు అధ్యక్షతన పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. అనంతరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావే



ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో బిజెపి చీఫ్ రాంచందర్‌రావు

శంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలపై జిల్లా వర్క్‌షాప్‌లు, రాష్ట్ర వర్క్‌షాప్ పూర్తయిన వెంటనే 31 జిల్లాలకు సంబంధించిన స్థానిక సంస్థల ఎన్నికల తయారీకి సంబంధించిన వర్క్‌షాప్‌లు పూర్తయ్యాయని తెలిపారు. 566 మండలాలకు సంబంధించి జెడ్పిటిసి ఎన్నికలు ఎక్కడ జరుగుతున్నాయో, ఎంపిటిసి ఎన్నికలు ఎక్కడ జరుగుతున్నాయో వాటికి సంబంధించిన వర్క్‌షాప్‌లు పూర్తయ్యాయని తెలిపారు. మహాసంపర్క్ అభియాన్ పేరుతో, ఇంటింటికీ బిజెపి గడప గడపకు పోలింగ్ బూత్ అధ్యక్షుడు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఈ కార్యక్రమాలపై సమీక్ష జరిగిందన్నారు. ప్రజల దగ్గరకు మనం ఎంత వరకు చేరుకున్నామో విశ్లేషించినట్లు, తదుపరి కార్యాచరణ కూడా నిర్ణయించబడింది.ఈ నెల 21 నుంచి 25 వరకు

>>2



### 22న త్రైపాక్షిక

# సమావేశం!

### భేటీ కానున్న ట్రంప్, పుతిన్, జెలెన్‌స్కీ

**వాషింగ్టన్, ఆగస్టు 17:** ఉక్రెయిన్‌లో యుద్ధానికి ముగింపు పలికే అంశంపై చర్చించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల అలాస్కాలో భేటీ అయ్యారు. అనంతరం త్రైపాక్షిక సమావేశం గురించి ట్రంప్, జెలెన్స్కీ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలో ముగ్గురు అధ్యక్షుల మధ్య త్రైపాక్షిక సమావేశం ఆగస్టు 22న ఏర్పాటు చేయాలని ట్రంప్ యోచిస్తున్నట్లు ట్రూత్‌లో పోస్టు చేసారు. పుతిన్‌తో సమావేశం అనంతరం ఈ విషయాన్ని ట్రంప్ యూరోపియన్ యూనియన్ నాయకులతో చెప్పినట్లు సమాచారం. ఇదిలావుంటే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోమవారం ట్రంప్‌తో భేటీ కానున్నారు. ఈ సమావేశానికి యూరోపియన్ దేశాల నాయకులను కూడా ట్రంప్ ఆహ్వానించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. జర్మన్ ఛాన్సెలర్ ఫ్రెడరిక్ మెర్జ్ మాట్లాడుతూ.. ట్రంప్, జెలెన్‌స్కీల మధ్య సోమవారం సమావేశం జరుగుతుందని, ఆతర్వాత ముగ్గురు నేతల మధ్య త్రైపాక్షిక

>>2

### తెలంగాణను తెచ్చుకున్నదే

# నీళ్ల కోసం

### మా ప్రాజెక్టులు పూర్తయ్యాకే మిగులు జలాల వాటాలు

### బనకచర్ల ప్రాజెక్టుపై తేల్చాల్సింది కేంద్రమే!

### విశాఖలో డి. సిఎం భట్టి కీలక వ్యాఖ్యలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు17:** గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించాలనుకుంటున్న గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. మిగులు జలాల్లో తెలుగు రాష్ట్రాల వాటాలు తేలిన తర్వాతే గోదావరిపై ఎలాంటి కొత్త ప్రాజెక్టులు నిర్మించినా అది చట్టబద్ధంగా, న్యాయంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నీటి వాటాలను నిర్ధారించాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. ఆదివారం 'ఓట్ల చోరీ' నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖపట్నంకు వెళ్లిన భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందించారు. నదీ జలాల కోసమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. మా రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయి, నీటి కేటాయింపులు జరిగిన తర్వాతే మిగులు జలాల అంశంపై ఒక స్పష్టత వస్తుందని ఆయన వివరించారు. రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం, ఇందిరాసాగర్,రాజీవ్‌సాగర్,దేవాదుల వంటి గోదావరిపై మేం చేపట్టిన ప్రాజెక్టులు పూర్తి కాలేదు. మా ప్రాజెక్టుల నిర్మాణం తర్వాత వాటాలు తేల్చి మిగిలిన వాటిని సమృద్ధిగా వాడుకోవచ్చునని చెప్పారు. మా అవసరాలు తీరకుండా దిగువ ప్రాజెక్టులు నిర్మాణం జరిగితే ఆ తర్వాత కేటాయింపులు సమస్యలు ఎక్కువవుతాయి. సముద్రంలోకి వెళ్లే జలాల అని మాట్లాడటం అర్థం చేసుకోలేని అమాయకులు ఎవరు లేరు అని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పటిష్టంగా ఉంది. అసంతృప్తి అనేది కొందరు ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు,రేవంత్,రాహుల్ హాట్‌లైన్‌పై జగన్ వ్యాఖ్యలు వ్యక్తిగతమైన రాజకీయ ఆరోపణ, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి గా పార్టీ విధానాలు విశాలమైన ప్రయోజనాలతో ఉంటాయి తప్ప సంకుచితమైన మనస్తత్వంతో ఉండవు అని తెలిపారు. కాగా, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును గట్టిగా సమర్థించారు. పోలవరం నుంచి వృథాగా సముద్రంలోకి పోయే గోదావరి వరద నీటిని బనకచర్లకు తరలించి రాయలసీమను అభివృద్ధి చేయాలనేది తమ లక్ష్యమని చెప్పారు. దిగువ రాష్ట్రంగా వరదల వల్ల తాము నష్టపోతున్నామని, అలాంటి వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుతో ఏ రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం జరగదని భరోసా ఇచ్చారు. కాగా, ఆదివారం

>>2

### గాంధీ జయంతి నాటికి

# అందుబాటులోకి లైసెన్స్‌డ్ సర్వేయర్లు

### రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,ఆగస్టు,17 ప్రభాతవార్త:** రాష్ట్రంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి మొదటి విడత సర్వేయర్ల శిక్షణ పూర్తయిందని. రెండవ విడత శిక్షణ 23 జిల్లా కేంద్రాల్లో ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.అభ్యర్థులు ఆయా జిల్లాల్లో 18వ తేదీ ఉదయం 10 గంటల లోపు సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్‌కురిపోర్ట్ చేయాలని సూచించారు.లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం పై ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇందుకు అవసరమైన లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను గాంధీ జయంతి రోజునాటికి అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి మే 26 నుంచి జూలై 26 వరకు 50 పనిదినాల్లో ఆయా జిల్లా కేంద్రాల్లో ఏడు వేలమందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని ,గత నెల 28, 29 తేదీల్లో జెఎన్‌టియు ఆధ్వర్యంలో ల్యాబ్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించి

>>2

# నేడో, రేపో దోస్త్ స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్ జారీ!

### ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోనూ స్పాట్‌కి అవకాశం

### నో స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 17:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) పేరుతో అడ్మిషన్లను చేపడుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటి మూడు విడతల్లో సీట్ల కేటాయింపు చేయగా.. కొద్ది రోజుల క్రితం స్పెషల్ ఫేజ్‌ను నిర్వహించారు. ఈ నేపథ్యంలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించాలని దోస్త్ అధికారులు భావించారు. అయితే వాస్తవానికి స్పాట్ అడ్మిషన్లను ఈ నెల 13, 14 తేదిల్లో నిర్వహించాలని ముందుగా షెడ్యూల్ జారీ చేసినప్పటికీ.. రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ప్రభుత్వంతో చర్చించిన దోస్త్ అధికారులు.. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కూడా స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఇదే అంశాన్ని ఈ నెల 14న దోస్త్ -2025 కన్వీనరైన తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి త్వరలోనే స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలతోపాటు ఎయిడెడ్,

>>2



నాగార్జున సాగర్ గేట్లు తెరిచిన దృశ్యం

### రాష్ట్రంలో రెండు రోజులు

# భారీ వర్షాలు



కడెం ప్రాజెక్టు గేట్లు తెరిచిన దృశ్యం

### శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు భారీగా వరద

### శ్రీరాంసాగర్‌కు పోటెత్తిన వరద, నీట మునిగిన ఏడుపాయల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు17:** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వారం రోజులుగా రాష్ట్రంలో కుండపోతగా వర్షాలు కురిసాయి. ఈ వర్షాలు కొంత తగ్గుముఖం పట్టాయని రాష్ట్ర ప్రజలు ఊరిపి పీల్చుకునేలోపే వాతావరణ శాఖ మరోక అలర్ట్ ఇచ్చింది. సోమవారం బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని దీంతో రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ మేరకు సోమవారం రాష్ట్రంలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని రెడ్ అలర్ట్ ఇవ్వగా,జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.ఆదిలాబాద్, హన్మకొండ, కామారెడ్డి, ఖమ్మం, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, నిర్మల్, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. మంగళవారం కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు చాలా చోట్ల కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. కాగా, ఆదివారం మెదక్ జిల్లా, ఎల్దుర్తి మండలం, దామరంచ గ్రామంలో అత్యధికంగా 103.3 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసినట్లు, వాతావరణ శాఖ వెల్లడించింది.కృష్ణా ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. నదీ

>>2



వీధి కుక్కలపై సుప్రీం ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ఆదివారం న్యూఢిల్లీలో ఆందోళన నిర్వహించిన జంతు ప్రేమికులు

## గడువు కోరదామా?

>> సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అయితే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం ఎటా తేల్చకపోవడంతో ఎన్నికలపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోబోతున్నదనేది ఆసక్తి రేపుతున్నది. అయితే తాజాగా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారాయి. ఆయన ఓ న్యూస్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ కోర్టు చెప్పినట్లు సెప్టెంబర్ నెలాఖరుకు ఎన్నికలు పూర్తి చేయాలి కానీ ఆ పరిస్థితి లేనప్పుడు గడువు కోరతామన్నారు. రిజర్వేషన్లు తేలని కారణంగా ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉందని పరోక్షంగా చెప్పారు. పిఏసీ సమావేశంలో వచ్చే మెజారిటీ అభిప్రాయాల ప్రకారం ఎన్నికల నిర్వహణ విషయంలో నిర్ణయం తీసుకుంటామని మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు.

దీంతో పీఏసీ సమావేశంలో అధికార పక్షం ఎన్నికలకు సై అంటుందా లేక కోర్టును వాయిదా కోరుతుందా అనేది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠంగా మారింది. ఎన్నికల నిర్వహణ విషయంలో జాప్యం జరుగుతుండటంపై క్షేత్ర స్థాయిలో ఆశావాహుల్లో నిరాశ నెలకొంటున్నది. గ్రామ పంచాయతీల్లో పాలక వర్గాలు లేనందునా నిధులు విడుదల చేయలేమని కేంద్రం చెబుతోంది. దీంతో గ్రామాల్లో సమస్యలుకుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అందరి దృష్టి పీఏసి సమావేశంపై ఉంది.

## తెలంగాణను తెచ్చుకున్నదే నీళ్ల కోసం

>> విశాఖలో భట్టి విక్రమార్క ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఓట్ల చోరీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడం పౌర హక్కులను కాలరాయడమేనని ఆయన అన్నారు. అర్హులైన ఓటర్లను తొలగించి, బోగస్ ఓట్లను చేర్చడం ద్వారా బీజేపీ లబ్ధి పొందిందని ఆరోపించారు. ఈ విషయంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధారాలతో సహా మోదీ ప్రభుత్వాన్ని నిలదీశారని గుర్తుచేశారు. అయినప్పటికీ, ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన విమర్శించారు.

## అందుబాటులోకి లైసెన్స్‌డ్ సర్వేయర్లు

>> ఫలితాలు ప్రకటించామని తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు 40 రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణను కూడా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ శిక్షణ పూర్తయిన వెంటనే వీరికి లైసెన్స్ జారీ చేయనున్నట్లు వెల్లడించారు. వీరి సేవలను పారదర్శకంగా నిర్వహించడానికి వీలుగా సర్వే మాన్యువల్ ను రూపొందించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ, సర్వే విభాగానికి మధ్య అవినాభావ సంబంధం ఉందని సర్వే విభాగం బలోపేతం తోనే రెవెన్యూ వ్యవస్థలో మెరుగైన సేవలు అందించగలుగుతామని దీనిని దృష్టిలో పెట్టుకొని సర్వేవిభాగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గత పదేళ్ళలో సర్వే విభాగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు.

## దోస్త్ స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్ జారీ!

>> యూనివర్సిటీ కాలేజీల్లోనూ స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించనున్నారు. విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చడం కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, విశ్వవిద్యాలయ కాలేజీల్లోనూ స్పాట్ అడ్మిషన్లు అవకాశం కల్పిస్తున్నట్టు ప్రకటించారు. విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చడానికి, వారి ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడానికి, తెలంగాణ ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) పోర్టల్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, విశ్వవిద్యాలయ కళాశాలలలో అండర్ గ్రాడ్యుయేట్ (యుజి) కోర్సులకు స్పాట్ అడ్మిషన్లను అందిస్తోందన్నారు.

స్పాట్ అడ్మిషన్లు రోస్టర్, స్థానిక రిజర్వేషన్లు మొదలైన అన్ని ప్రభుత్వ రిజర్వేషన్లకు అనుగుణంగా చేపట్టబడతాయని, పారదర్శకతతో సీట్ల కేటాయింపు నిర్ధారించబడుతుందన్నారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు (ఆర్‌టిఎఫ్, ఎంటిఎఫ్) అర్హులు కారని ప్రకటించారు.

## 22న త్రైపాక్షిక సమావేశం!

>> సమావేశం జరిగే అవకాశం ఉందని అన్నారు. యుద్ధం ముగింపుపై సోమవారం కీలక ప్రకటన వెలువడుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. కాగా ఉక్రెయిన్‌తో యుద్ధం గురించి ఇటీవల అలాస్కా వేదికగా ట్రంప్, పుతిన్‌లు భేటీ అయ్యి రెండున్నర గంటలకుపైగా చర్చించారు. అయినప్పటికీ ఎలాంటి ఒప్పందానికి రాలేదు. అయితే చర్చలు సానుకూలంగా జరిగాయని సమావేశం అనంతరం ఇరువురు నేతలు ప్రకటించారు. ట్రంప్ మాట్లాడుతూ.. ఒప్పందంపై నిర్ణయం జెలెన్‌స్కీ చేతుల్లోనే ఉందన్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు తనతో ఫోన్‌లో మాట్లాడినట్లు ఉక్రెయిన్ అధినేత తెలిపారు. త్రైపాక్షిక సమావేశంపై ట్రంప్ చేసిన ప్రతిపాదనకు తాను మద్దతిస్తున్నట్లు జెలెన్‌స్కీ వెల్లడించారు. కీలక అంశాలపై చర్చించుకునేందుకు అది మంచి వేదిక అవుతుందన్నారు. పరిస్థితులను చక్కదిద్దే బలం అమెరికాకు ఉందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

శాంతి ఒప్పందంపై ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్న యూరోపియన్ నాయకులకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు. అయితే సోమవారం ట్రంప్, జెలెన్‌స్కీ సమావేశం నేపథ్యంలో ఐరోపా నేతలు అప్రమత్తమయ్యారు. గతంలో అమెరికా అధ్యక్షుడితో సమావేశమైన జెలెన్‌స్కీకి చేదు అనుభవం ఎదురైన విషయం తెలిసిందే. అలాంటి ఘటన పునరావృతం కాకుండా ఉండేందుకు ట్రంప్‌తో స్నేహపూర్వకంగా మెలిగే ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌ను, ఇతరులను ఉక్రెయిన్ అధ్యక్షుడికి సాయంగా వాషింగ్టన్‌కు పంపనున్నట్లు యూరప్ దౌత్యవేత్తలు తెలిపారు.

ఇరువురి మధ్య ఘర్షణ పునరావృతం కాకుండా చర్చలు సజావుగా జరిగేలా వారు చూసుకోనున్నట్లు సమాచారం. నాటో సెక్రెటరీ జనరల్ కూడా ఈ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉందని ఉక్రెయిన్ వర్గాలు చెపుతున్నాయి.

## 21న ఒయులో జరిగే కార్యక్రమానికి సిఎంను ఆహ్వానించిన ప్రొఫెసర్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు17:** ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి కాశీం ఆదివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఆగస్ట్ 21న ఓయూ లో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాలని ఆహ్వానం పలికారు. ఓయూలో రూ.80 కోట్ల వ్యయంతో నిర్మాణమై 1200 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు హాస్టల్స్‌ను ప్రారంభించి, గిరిజన సంక్షేమం శాఖ ఆర్థిక సహాయంతో మరో 300 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు కొత్త హాస్టల్స్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సీఎం చేతులమీదుగా జరుగనున్నది. ఇప్పటికే ఓయూలో ఉన్న 25 హాస్టళ్లలో 7,223 మంది విద్యార్థులకు వసతి ఉండగా సీఎం చేతుల మీదుగా ప్రారంభించే



ఆదివారం హైదరాబాద్‌లో సిఎంను కలిసిన ఒయు ప్రొఫెసర్లు

హాస్టల్స్ అదనపు వసతిని సమకూర్చనున్నాయి. ఇదే కార్యక్రమంలో దాదాపు రూ.10 కోట్ల నిధులతో డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూం పనులకు కూడా సీఎం ప్రారంభించనున్నారు. అదే రోజు ఓయూలో ఉన్న టాగూర్ ఆడిటోరియంలో వెయ్యి మంది ప్రొఫెసర్లను, విద్యార్థులను ఉద్దేశించి తెలంగాణ విద్యా రంగంలో రావాల్సిన మార్పులు ప్రభుత్వ ప్రణాళిక అనే విషయం మీద సీఎం ప్రసంగించనున్నారు. ఓయు వీసి సిఎంను కలిసిన సందర్భంగా తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు, ఇరవై ఏళ్ల కాలంలో ఓయూలోకి ముఖ్యమంత్రి హోదాలో వచ్చి ప్రసంగించనున్న తొలి సీఎం రేవంత్ రెడ్డి గారేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం రీసెర్చ్ ఫెలో షిప్ తో పాటు విదేశీ పర్యటనకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించే పథకాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నామని వీసీ తెలిపారు.

## వారం - వర్జ్యం

18-08-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
దశమి సా.5.24
మృగశిర రా.2.06
వర్జ్యం : ఉ.10.10-11.42
దు.మ.12.38-1.29, 2) మ.3.10-సా.4.01
శుభసమయం: ఉ.9.20-9.50,సా.6.30-7.15
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** బాధ్యతలు సమర్థవంతంగా నెరవేరుస్తారు. నూతన పరిచయాలు పెరుగుతాయి.

**వృషభం :** కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం. ఆస్తి తగాదాలు తీరి లబ్ధిపొందుతారు.

**మిథునం:** రాజకీయ, పారిశ్రామిక రంగాలవారికి విదేశీపర్యటనలు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**కర్కాటకం :** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. వాహనాలు కొనుగోలుచేస్తారు.

**సింహం:** ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. ఇళ్లకు సంబంధించిన నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**కన్య :** కొత్త కార్యక్రమాలు చేపట్టి సన్నిహితుల సాయంతో పూర్తిచేస్తారు.

**తుల :** ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం. ఉద్యోగ, వ్యాపారాలలో పట్టుదలతో ముందుకు సాగుతారు.

**వృశ్చికం:** నూతన కార్యక్రమాలు చేపట్టినా సంతృప్తికరంగా సాగవు. వస్తు లాభం.

**ధనుస్సు:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మకరం:** ఆస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. భాగస్వామ్య వ్యాపారులలో స్వల్ప లాభాలు పొందుతారు.

**కుంభం:** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో ప్రోత్సాహకరంగా ఉంటాయి. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**మీనం :** కొత్త పెట్టుబడులకు తగిన సహాయం లభిస్తుంది. ఇంటాబయటా మీదే పైచేయిగా ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 21 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బిజెపి టూర్

>> స్థానిక సమస్యలను ప్రజలకు తెలియజేయడం కోసం, కాంగ్రెస్ ప్రభుత్వం, బిఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలను ఎలా నిర్వీర్యం చేశాయో వివరిస్తూ, మొత్తం 566 మండలాలలో ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మండల ఎంఆర్‌ఓలకు వినతిపత్రాలు అందజేస్తారని, ఇది ఆందోళన కార్యక్రమం. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, నిధుల లేమితో కాంగ్రెస్ ప్రభుత్వం, బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామపంచాయతీలను ఎలా ఇబ్బందిపెట్టాయో ఈ ఉద్యమం ద్వారా ప్రజలకు తెలియజేయనున్నట్లు తెలిపారు. మండల ర్యాలీలు పూర్తయిన తరువాత ఈ నెల 26 నుంచి వచ్చే నెల 2 వరకు అన్ని జిల్లా కేంద్రాలలో ర్యాలీలు నిర్వహిస్తారన్నారు. ఆ సందర్భంగా జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తారు. జిల్లాల్లో ఉన్న ప్రధాన సమస్యలను ఈ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక సమస్యలపై ప్రభుత్వాన్ని మేల్కొల్పడం, ప్రజలకు ఈ ప్రభుత్వాలు ఎలా మోసం చేశాయో వివరించడం లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ నెల 21, 22 తేదీలలో 24 గంటల టూర్ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు రంగారెడ్డి జిల్లాలో ఒక మండలంలో 24 గంటలు బస చేస్తారని తెలిపారు. ఆ మండలంలోని ప్రతి గ్రామంలో యువ సమ్మేళనం, మహిళా సమ్మేళనం, పూర్వ అధ్యక్షుల సమ్మేళనం, రచ్చబండ వంటి ఐదు నుంచి ఆరు కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంతో రాష్ట్ర అధ్యక్షుల టూర్ ప్రారంభమవుతుందని, అనంతరం 566 మండలాలకు (ఒక మండలాన్ని మినహాయిస్తే 565 మండలాలకు) రాష్ట్ర, జాతీయ, జిల్లా నాయకులు అందరూ 24 గంటలు బస చేస్తారని తెలిపారు. అక్కడి సమస్యలను తెలుసుకుంటారన్నారు. అక్కడి కార్యకర్తల పరిస్థితి, రేపు పోటీ చేసే వారి వివరాలు, సంఘాల నాయకులను కలవడం, యువకులతో సమావేశం, లబ్ధిదారుల సమావేశం మొత్తం జెడ్పిటిసి స్థాయిలో ఒక నాయకుడు 24 గంటలు అక్కడే బస చేస్తూ కార్యక్రమం నిర్వహిస్తారు. మండల, జిల్లా ర్యాలీలు పూర్తయ్యాక ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. దీనికి ముందుగా మోడల్‌గా ఎన్.రాంచందర్ రావుటూర్‌ను ఈ నెల 21, 22 తేదీలలో రంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తారన్నారు. సోషల్ మీడియా, మెయిన్‌స్ట్రీమ్ మీడియా ప్రాముఖ్యత పెరుగుతున్నందున, ఆగస్టు 24న హైదరాబాద్‌లో సంబంధిత కమిటీల కోసం వర్క్‌షాప్ నిర్వహిస్తారు. మహిళా మోర్చా, యువమోర్చా ఆధ్వర్యంలో ప్రతి మండలంలో ఎంపిటిసి స్థాయిలో మహిళా సమావేశాలు, యువ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబిసివర్గాలకు చెందిన స్థానిక కార్యకర్తలతో పార్టీ సమావేశాలు నిర్వహించాలని కూడా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, సంఘటనా మంత్రి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర కార్యదర్శి మధవి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సుభాష్, వెంకటరెడ్డి పాల్గొన్నారు. లీగల్ అంశాలపై కూడా చర్చ జరిగిందని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఓట్లను ఎలా చేర్చుతుంది, దొంగ ఓట్లను ఎలా తొలగించాలి అనే విషయాలపై సమగ్రంగా చర్చించారు. అన్ని అంశాలకు రోడ్‌మ్యాప్ ఖరారు చేసి, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం అయ్యేలా ఈ సమావేశం జరిగిందన్నారు. కొన్ని చిన్న మార్పులు ఉన్నాయి. హై లెవెల్ కమిటీ కూడా ఉందన్నారు. పార్లమెంట్ సమావేశాలు పూర్తయ్యాక ప్రత్యేకంగా సమావేశం పెట్టి రాజకీయ పరంగా వ్యూహరచన చేస్తారన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికలకు ప్రత్యేక ప్రిపరేటరీ జరుగుతుందన్నారు. ఎంపిలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర నాయకులు 24 గంటలు ఒక మండలంలో బస చేసేలా షెడ్యూల్ ఉండనుందని తెలిపారు.

## రెండు రోజులు భారీ వర్షాలు

>> పరీవాహక ప్రాంతాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో వరద పోటెత్తుతున్నది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వస్తుండడంతో అధికారులు మూడు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి ప్రస్తుతం 79,269 క్యూసెక్కుల వరద సాగర్ వైపు వెళ్తున్నది. జూరాల, సుంకేశుల నుంచి ప్రాజెక్టుకు 1,18,410 క్యూసెక్కుల వరద వస్తుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 881.4 అడుగుల మేర నీరు ఉంది. పూరిస్థాయినీటి నిల్వ సామర్థం 215.8 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 195.6 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. శ్రీశైలం, కుడి, ఎడమ గట్టుల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. రెండు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 65,807 క్యూసెక్కుల వరద కిందకు వెళ్తోంది. ఇదిలా ఉండగా.. నల్గొండ జిల్లాలోని నాగార్జున సాగర్‌కు సైతం వరద వచ్చి చేరుతున్నది. దాంతో అధికారులు 22 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌కు ఇన్‌ఫ్లో 1,71,683 క్యూసెక్కులు కాగా.. అవుట్ ఫ్లో 2,12,753 క్యూసెక్కులుగా ఉన్నది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, సాగర్ ప్రస్తుత నీటిమట్టం 587 అడుగులు. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 312.04 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 305.50 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గోదావరి ఎగువ మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండటంతో శ్రీరాం సాగర్ ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మహారాష్ట్ర బాబ్లీ, విష్ణుపురి, మాలేగావ్ ప్రాజెక్టుల నుంచి ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి లక్ష క్యూసెక్కుల మేరకు వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు, 80.501 టీఎంసీలు ఉండగా, శనివారం మధ్యాహ్నం వరకు 1082.30 అడుగులు, 62 టీఎంసీలుగా ఉందని తెలిపారు. ప్రధాన కాల్వ కాకతీయ ద్వారా 4625 వేల క్యూసెకులు, మంచినీటి అవసరాలకు మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 180 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 541 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు. గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్టు నీటిమట్టం 1081.10 అడుగులు, 40.071 టీఎంసీలు ఉందని 1 జూన్ నుంచి ఇప్పటివరకు 46.930 టీఎంసీల నీరు వచ్చి చేరింది. 1 జూన్ నుంచి ఇప్పటివరకు 8.937 టీఎంసీల నీరు విడుదల చేశామని అధికారులు తెలిపారు. ఇంకా గోదావరి నదిలో భారీగా వరద నీరు పెరిగే అవకాశం ఉన్నందున గోదావరి నదీ పరిసర ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే పశువుల కాపర్లు, గొర్ల కాపరులు, చేపలు పట్టే వారు, రైతులు, సామాన్య జనం గోదావరి నదిని దాటే ప్రయత్నాలు చేయవద్దని అధికారులు కోరుతున్నారు. సింగూరు గేట్లు ఎత్తడంతో నిజాంసాగర్‌కు జలకళ వచ్చింది. ఉమ్మడి జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు ఈ సీజన్‌లో చుక్క నీరు రాక వెల వెల బోయింది. కాగా ఎగువ మెదక్ జిల్లాలో ఉన్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సింగూరు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో నిజాంసాగర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.

రెండు రోజుల్లో పూర్తి స్థాయి నీటిమట్టం చేరువయ్యేలా ఉంది. ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా సింగూరు ప్రాజెక్టు నుంచి 5 గేట్లు ఎత్తి 50వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో మెదక్ జిల్లా నాగ్సాన్‌పల్లి గ్రామ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల శ్రీ వనదుర్గా భవాని మాత ఆలయం గత నాలుగు రోజులుగా పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆదివారం నాటికి నదిలో నీటి ప్రవాహం మరింత పెరిగి, ఏడుపాయల గుండా పొంగిపొర్లడంతో ఆలయం పూర్తిగా నీట మునిగింది. ప్రధాన ఆలయం లోపలికి వరద నీరు చేరింది. భక్తులు దర్శనం చేసుకోవడానికి వీలు లేకపోవడంతో అధికారులు తాత్కాలికంగా ఆలయాన్ని మూసివేశారు. ప్రస్తుతం భక్తులు ఆలయ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకున్నారు.

ప్రధాన ఆలయం ముందు ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరా నది దృశ్యాలను భక్తులు చూసి ఆశ్చర్యపోతున్నారు. భద్రత చర్యల్లో భాగంగా ఏడుపాయల పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. నది పరిసరాలకు ప్రజలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.



న్యూఢిల్లీలోని రోహిణిలో ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ఢిల్లీ విభాగం, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

## వికసిత్ భారత్‌కు ఢిల్లీ ఓ నమూనా

>> ఒక్కరూ ప్రయోజనం పొందనున్నది. ఈ సందర్భంగా బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ ఈ రోడ్లు ప్రయాణాన్ని సులభతరం చేయడంతో పాటు ఎన్‌సీఆర్ అభివృద్ధికి కొత్త ఊపునిస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ చుట్టూబిజెపి ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. ఎక్స్‌ప్రెస్‌వే పేరు ద్వారక అని ఈ కార్యక్రమం జరుగుతున్న ప్రదేశం రోహిణి అని, జన్మాష్టమి ఆనందం అని, యాదృచ్ఛికంగా ద్వారకాధీశ భూమి నుంచి వచ్చానని మోదీ పేర్కొన్నారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు దేశ రాజధాని ఢిల్లీ దేశంలో జరుగుతున్న అభివృద్ధి విప్లవాన్ని చూస్తోంది. కొద్దిసేపటి క్రితం ఢిల్లీ ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్‌తో అనుసంధానంతో ఢిల్లీ, గురుగ్రామ్, ఎన్‌సీఆర్ ప్రజల సౌకర్యాన్ని పెంచుతుందని.. ప్రతి ఒక్కరి సమయం ఆదా అవుతుందన్నారు. మన వ్యాపారులు, వ్యాపారవేత్తలు, రైతులు ప్రత్యేక ప్రయోజనాలను పొందబోతుందన్నారు. ప్రపంచం భారతదేశాన్ని చూసినప్పుడు.. మూల్యాంకనం చేసిన సమయంలో మొదటి దృష్టి మన రాజధాని ఢిల్లీపై పడుతుందన్నారు. మనం ఢిల్లీని అభివృద్ధి నమూనాగా మార్చాలని పిలుపునిచ్చారు. ఢిల్లీని గొప్ప నగరంగా మార్చడానికి మనం చేపట్టిన పని నిరంతరం కొనసాగుతోందన్నారు. నేటికీ మనమందరం దీనికి సాక్షులమని.. అది ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ అయినా ఈ రెండు రోడ్లు అద్భుతంగా నిర్మించినట్లు పేర్కొన్నారు. పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే తర్వాత ఇప్పుడు అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ ఢిల్లీకి చాలా సహాయపడుతుందన్నారు. అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్‌కు మరో ప్రత్యేకత ఉందని ఇది ఢిల్లీని చెత్త నుంచి విముక్తి చేయడంలో సహాయపడుతుందన్నారు. అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్‌ను తయారు చేయడంలో లక్షల టన్నుల చెత్తను ఉపయోగించారని వ్యర్థ పదార్థాలను రోడ్డు తయారీలో ఉపయోగించారన్నారు. రేఖ గుప్తా నాయకత్వంలోని ఢిల్లీ బిజెపి ప్రభుత్వం యమునను శుభ్రపరిచే పనిలో నిరంతరం నిమగ్నమై ఉండడంపై సంతోషంగా ఉన్నానని ప్రధాని మోదీ అన్నారు. ఈ సమయంలో యమునా నది నుంచి 16 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించారని ఢిల్లీలో చాలా తక్కువ సమయంలో 650 దేవి ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభమయ్యాయన్నారు. భవిష్యత్తులో ఈ ఎలక్ట్రిక్ బస్సులు సుమారు 2వేల సంఖ్యను దాటుతాయని,. గ్రీన్ ఢిల్లీ - క్లీన్ ఢిల్లీ మంత్రాన్ని మరింత బలపరుస్తుందన్నారు. దేశంలోనే మొదటి ఎనిమిది లైన్ల అర్బన్ ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్‌వే అయిన ఈ ప్రాజెక్టు ఢిల్లీ గురుగ్రామ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది. 10.1 కిలోమీటర్ల మార్గాన్ని రూ.5,360 కోట్లతో నిర్మించారు. ఈ మార్గం యశోభూమి, ఢిల్లీ మెట్రో బ్లూ, ఆరెంజ్ లైన్లకు, రాబోయే బిజ్వాసన్ రైల్వే స్టేషన్‌కు అనుసంధాస్తింది. గతేడాది మార్చిలో ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేలోని 19 కిలోమీటర్ల హర్యానా విభాగాన్ని ప్రధాని ప్రారంభించారు. తాజాగా ఢిల్లీ విభాగం సైతం అందుబాటులోకి వచ్చింది. దాంతో గురుగ్రామ్ నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు కేవలం 20 నిమిషాల్లో చేసే అవకాశం ఉంటుంది. ఇక రూ.5,580 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ఢిల్లీకి మూడో రింగ్ రోడ్‌గా పని చేయనున్నది. ఢిల్లీ, సోనిపట్, బహదూర్‌గఢ్ వంటి నగరాలను కలుపుతోంది. అలీపూర్ నుంచి డిచాన్ కలాన్ వరకు నిర్మించారు. నిర్మాణానికి ఘాజీపూర్ ల్యాండ్‌ఫిల్ నుండి సేకరించిన రెండు మిలియన్ టన్నుల వ్యర్థాలను ఉపయోగించడం విశేషం.

## ప్రతీ ఓటరుకు ఇసి దన్ను

>> పార్టీలు మాకు సమానమేనని ఎవ్వరిపైనా వివక్ష ఉండబోదన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి భారత పౌరుడు ఓటరుగా మారాలని ఓటు వేయాలన్నారు. బీహార్‌లో ఆగస్టు ఒకటి నుంచి సెప్టెంబర్ ఒకటి వరకు సమయం ఇచ్చామన్నారు. ఇంకా 15 రోజుల సమయం ఉందన్నారు. దరఖాస్తు చేసుకోకుండా ఎలా ఓటు హక్కు వస్తుందని ఆయన ప్రశ్నించారు. చట్టం ప్రకారం ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల సంఘం ద్వారా నమోదవుతుందని అందరికీ తెలుసునన్నారు. అప్పుడు ఎన్నికల సంఘం రాజకీయ పార్టీల మధ్య వివక్షతను ఎలా చూపుతుందని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్‌కు అన్ని పార్టీలు సమానమేనని ఎవరైనా ఏ రాజకీయ పార్టీకి చెందినవారైనా ఎన్నికల సంఘం తన రాజ్యాంగ విధి నుంచి తప్పించుకోలేదన్నారు. గత రెండు దశాబ్దాలుగా దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దాలని డిమాండ్ చేస్తున్నాయన్నారు. అందు కోసమే ఎన్నికల సంఘం బీహార్ నుంచి ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను ప్రారంభించిందన్నారు. సర్ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు, అన్ని రాజకీయ పార్టీలు నామినేట్ చేసిన 1.6 లక్షల మంది బీఎల్ఏలు కలిసి ముసాయిదా జాబితాను సిద్ధం చేశారన్నారు. బీహార్ సర్ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న తొలి మీడియా సమావేశం ఇదేనన్నారు. ఎన్నికల కమిషన్ చరిత్రలో ఎన్నికలకు సంబంధించి అంశం గురించి కాకుండా ఏర్పాటు చేసిన తొలి విలేకరుల సమావేశం ఇదే కావొచ్చన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలన్నీ నిరాధారమైనవన్నారు. ఓటరు జాబితాను ప్రతి పార్టీ బూత్ లెవల్‌లో చూసుకుంటుందని.. సంస్కరణల్లో భాగంగానే బిహార్‌లో ఓటరు జాబితాను సవరిస్తున్నట్లు సీఈసీ తెలిపారు. ఈ సంస్కరణలో అన్ని పార్టీలు పాల్గొంటున్నాయని చెప్పారు. ఓటరు జాబితా తయారీలో స్పష్టమైన వైఖరిని అవలంబిస్తున్నామని, బీహార్‌లో ఏడుకోట్ల మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. అయితే, రాజ్యాంగ సంస్థలను అవమానించడం ఏమాత్రం సరికాదన్నారు. మిషన్ రీడబుల్ లిస్ట్‌తో ఓటర్ల గోప్యతకు భంగం వాటిల్లుతుందని.. 2019లో సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. బీహార్‌లో కొందరి ఫొటోలు మీడియాలో వచ్చాయని, ఓటర్ల వ్యక్తిగత గోప్యత కల్పించాల్సిన బాధ్యత మాదేనన్నారు. ఓట్ల చోరీ అంటూ ప్రచారం చేయడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని, దుష్ప్రచారాల పట్ల మేం ఏమాత్రం భయపడమని ఎన్ని ఆరోపణలు వచ్చినా తాము పని చేసుకుంటూ వెళ్తామన్నారు. ఈసీ పారదర్శకంగా వ్యవహరిస్తోందన్నారు. ఓటర్ల జాబితాపై 28,370 మంది అభ్యంతరాలు వ్యక్తం చేశారన్నారు. ఓటరు జాబితాను బూత్ లెవల్ అధికారులు, పార్టీలు, ఏజెంట్లు కలిసి పరిశీలిస్తారన్నారు. అసత్య ప్రచారాలపట్ల ఏమాత్రం భయపడమని ఎంతగా దుష్ప్రచారం చేసినా తమ పని తాము చేసుకుంటూ ముందుకెళ్తామని ఈసీ తలుపులు అందరికీ తెలిచే ఉంటాయన్నారు. పార్టీలు, నేతల పట్ల మాకు భేదభావాలు పక్షపాతాలు ఉండవని సీఈసీ స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసమే ఓటర్లను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. బీహార్‌లో ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందిస్తున్నామన్న ఆయన ఓటరు జాబితాలో అన్నీ జాగ్రత్తలు తీసుకుంటే ఓట్ల చోరీ సాధ్యమా అని ప్రశ్నించారు

## ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సిపి రాధాకృష్ణన్

>> 2019వరకూ ఆల్ ఇండియా కాయిర్‌బోర్డు ఛైర్మన్‌గా సేవలందించారు. తమిళనాడు బిజెపి సీనియర్ నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి జార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలుచేపట్టారు. గతంలో తెలంగాణతోపాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా కొనసాగుతున్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపికచేసే అధికారాన్ని ఎన్డీయే పక్షాలు ప్రధాని నరేంద్రమోడీ, బిజెపి అధ్యక్షుడు జెపినడ్డాకు అప్పగించిన సంగతి తెలిసిందే. ఈనెల 21వ తేదీ నామినేషన్ల దాఖలుకు చివరితేదీ. ఎన్డీయే పదవికిఎవరెవరు వస్తారా అన్న ఉత్కంఠలో ఇంతకాల నడిచిన అధికార కూటమి సభ్యుల ఉత్కంఠకు తెరపడింది. రేసులో జమ్ముకాశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా వంటి ప్రముఖులపేర్లు తెరపైకి వచ్చాయి. తెలంగాణ గవర్నర్‌గాపనిచేసిన తమిళిసై సౌందరరాజన్ 2024 మార్చి 18న రాజీనామాచేయడంతో తెలంగాణ గవర్నర్‌గా సిపిరాధాకృష్ణన్ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆసమయంలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న సిపిరాధాకృష్ణన్ తెలంగాణ గవర్నర్‌గా కూడాపనిచేసారు. 2024 జూలై 31వరకూ తెలంగాణ గవర్నర్‌గా పనిచేసారు. 2024 ఆగస్టు 6వ రకూ పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గాపనిచేసినతర్వాత మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. ఉపరాష్ట్రపతి ఎంపికలో బిజెపి ఎన్డీయే కూటమి సమతుల్యతనున పాటించింది. రాష్ట్రపతి ముర్ము ఒడిశా వాసి కాగా రాధాకృష్ణన్ దక్షిణాది వాసి. కాగా ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక సెప్టెంబరు 9న జరగనున్నది. ఆగస్టు 22వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు కూడా ముగుస్తుంది. ఇపుడు ఇండియా కూటమి అభ్యర్థి ఎవరన్నది ఆపార్టీ సమిష్టినిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

# వేరే రాష్ట్రాల్లో ప్రకటనలకు ప్రభుత్వ సొమ్ము వ్యయం

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే సబిత ధ్వజం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 17:** సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో బీహార్‌లో కోట్ల రూపాయలతో కాంగ్రెస్ ప్రకటనలు ఇస్తుంది. తెలంగాణ రైతులకు, ప్రజలకు, ఉద్యోగులకు, విద్యార్థులకు సంక్షేమ పథకాలు అందించేందుకు మాత్రం డబ్బులు లేవు. కానీ వేరే రాష్ట్రాల్లో కోట్ల రూపాయలతో ప్రకటనలకు సర్కార్ సొమ్ము ఖర్చు చేస్తున్నారని సబితా ఇంద్రారెడ్డి మండిపడారు. నాడు పాఠశాలలు మొదలైన నాడే పాఠ్యపుస్తకాలు ఇచ్చిన ఘనత నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ది. కాంగ్రెస్ పాలనలో పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా పాఠ్యపుస్తకాల జాడలేదన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భోజనానికి పైసలు లేవు. కేజీబీవీలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలకు నిధులు లేవు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం ఎక్స్‌రే మిషిన్లు రిపేర్ చేయించడానికి డబ్బులు లేవు. ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడానికి రూపాయలు లేవు. తెలంగాణ రాష్ట్రంలోని పత్రికలకు, జర్నలిస్టుల సంక్షేమానికి నిధులు లేవు. కానీ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా కోట్ల రూపాయల తెలంగాణ ప్రజల సొమ్మును బీహార్ ఎన్నికల ప్రకటనల కోసం రేవంత్ సర్కార్ ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే సబిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నేడు తిరుపతికి ప్రత్యేక రైలు

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** సికిందరాబాద్ నుంచి తిరుపతికి సోమవారం ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నగరాల మధ్య రైలు నడపనున్నట్లు వెల్లడించింది. నేడు సికిందరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే రైలు (070 98) అందుబాటులో ఉంటుందని వివరించారు. రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుంతకల్, ఆదోని, మంత్రాలయం రోడ్, రాయ చూర్, కృష్ణ, యాద్గిర్, తాండూర్, వికారాబాద్, లింగం పల్లి, బేగం పేట్ స్టేషన్లలో ఆగుతాయని అధికారులు వివరించారు. ఈ మార్గంలో ప్రయాణించేవారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని రైల్వే శాఖ సూచించింది.

# స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ భారత టీం కోచ్‌గా మహ్మద్ అబ్దుల్ ఖదీర్ ఎంపిక

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ఆసియా ఓపెన్ షార్ట్‌ట్రాక్ స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే బారత జట్టు ప్రధాన కోచ్‌గా తెలంగాణకు చెందిన మహ్మద్ అబ్దుల్ ఖదీర్ ఎంపికయ్యారు. ఆయన శాట్స్‌లో కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. డెహ్రాడూన్ వేదికగా ఆగస్టు 20 నుంచి ఆసియా స్పీడ్ స్కేటింగ్ పోటీలు జరగనున్నాయి. ఇందులో భారత్‌తో పాటు ఆసియాలోని వివిధ దేశాలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే భారత జట్టుకు ఖదీర్‌ను కోచ్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఖదీర్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు సర్వం ఒడ్డుతానని తెలిపారు. జట్టును విజేతగా నిలిపేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తానని ఆయన పేర్కొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై బిఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్ మాట్లాడటం విడ్డూరం

## మాజీ ఎంపి వెంకటేశ్ నేత

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్ట్ మేడిగడ్డకు సంబంధించిన అంశంపై మాజీ ఐపిఎస్, బిఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అర్థం లేకుండా మాట్లాడుతున్నారని మాజీ ఎంపి వెంకటేశ్ నేత అన్నారు. ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి అసలు ఏం మాట్లాడుతున్నాడో అర్థం లేకుండా మాట్లాడారని, బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఓ మీడియాలో మేడిగడ్డను బాంబులతో పేల్చారు, మేడిగడ్డను బాంబులతో పేల్చారు అని రాశారు. నిజంగా ఒక మాజీ ఐపిఎస్ అధికారి ఇలా మాట్లాడటం చూస్తుంటే నాకు జాలేస్తుంది. మరి అనుకున్నది జరగకపోవడం వల్ల ఫ్రస్ట్రేషన్‌లోకి వెళ్ళిపోయినాడా? లేక దొరల గడిల్లో రాసిచ్చిన స్క్రిప్ట్‌ని ఐదో తరగతి పిల్లాడిలా చదివాడా? అర్థం కావడం లేదన్నారు. మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి, నాణ్యత లోపాలను మొదటి నుండి భారతీయ జనతా పార్టీ విమర్శిస్తుందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి, తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, హాలీవుడ్ స్టైల్ కట్టుకథను ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అల్లడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ నాయకులు, బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి, నువ్వు చేసిన అవినీతి బయటపడుతుందని ఊహించి, డిఫెన్స్ మెకానిజంగా అజ్ఞానిగా మాట్లాడుతున్నాడన్నారు.

# 20 నుంచి సిపిఐ రాష్ట్ర మహాసభలు

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** సమసమాజమే లక్ష్యంగా ఆవిర్భవించి అనేక త్యాగాల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 20 నుంచి 22 వరకు మూడు రోజులు పాటు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే పార్టీ ప్రారంభించి కొనసాగిస్తోంది. మహాసభలను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె రాజా ప్రారంభించనున్నారు. మహాసభలు జరిగే ప్రాంతానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, దివంగత నేత ఎన్.బాలమల్లేష్ నగర్‌గా నామకరణం చేశారు. వందేళ్ల ప్రస్థానంతో ముందుకు సాగుతున్న సిపిఐని ప్రజలతో మరింత మమేకం కావడమే లక్ష్యంగా రాష్ట్ర మహాసభలు కొనసాగుతాయని నాయకులు ప్రకటించారు. మహాసభల ఏర్పాట్లను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ఆదివారం పరిశీలించారు.

# కుత్బుల్లాపూర్‌లో గంజాయి బ్యాచ్ అర్థరాత్రి దాడి

## యువకుడికి బ్లేడు గాయాలు

**హైదరాబాద్ (కుత్బుల్లాపూర్), ఆగస్టు 17, ప్రభాతవార్త:** గంజాయి విక్రయిస్తున్నాడన్న అనుమానంతో ఓ ఒక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు యత్నించడం వివాదంగా మారింది. జీడిమెట్ల అయోధ్యనగర్‌లో శనివారం అర్థరాత్రి దాటిన తరువాత జరిగిన ఈఘటన పలు అనుమానాలను రేకెత్తించింది. తాము నాంపల్లి ఎక్సైజ్‌పోలీసులమని చెప్పి స్థానికంగా దారినపోయే ఓ యువకుడిపై విచక్షణారహితంగా బ్లేడ్లతో దాడీచేసిన సంఘటన తీవ్ర ఆందోళనకు, అనుమానాలకు దారితీసింది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్‌లో జులాయిలు విచ్చలవిడిగా రోడ్లపై తరుగుతూ గంజాయి సేవిస్తున్నారంటూ నాంపల్లి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఫోన్‌వచ్చిందంటూ ఆ విభాగం అధికారులమని చెప్పి కొంతమంది వ్యక్తులు కుత్బుల్లాపూర్ అయోధ్యనగర్‌లో అర్థరాత్రి హడావిడిచేశారు. దీనితో స్థానికులు బెంబేలెత్తి తాము అయోధ్యనగర్‌కు చెందిన వారమని తమపై అకారణంగా ఎందుకు దాడీకి పాల్పడుతున్నారని ఆందోళనకు దిగారు. దీనితో విషయాన్ని గమనిస్తున్న స్థానికులు ఒక్కసారిగా ఎక్సైజ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులుగా చెబుతున్న అధికారులను నిలదీశారు. స్థానికులు, ఎక్సైజ్ అధికారుల మధ్య జరుగుతున్న ఘర్షనను నిలిపేందుకు యత్నిస్తున్న సమయంలో వెంకటేశ్వరనగర్‌కు చెందిన యువకుడు చంటియాదవ్ పైగుర్తుతెలియని వ్యక్తులు విచక్షణారహితంగా బ్లేడ్లతోదాడికి పాల్పడి ముఖం, చెవి, తలపై విచక్షణారహితంగా దాడీకి యత్నించడంతో అతడికి వెంటనేస్థానికంగాగల ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అతడికి మొత్తం 22 కుట్లుపడ్డాయి. అనంతరం స్థానికులు పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా వీరికి ధీటుగా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు కూడా స్థానికులపై ఫిర్యాదుచేశారు. దీనితో జీడిమెట్ల పోలీసులు ఇరు వర్గాల ఫిర్యాదులను తీసుకుని విచారణ చేపట్టారు.

# మధ్యవర్తిత్వమే వివాదాలకు పరిష్కారం

## హైకోర్టు న్యాయమూర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సామ్‌కోషి

**హన్మకొండ బ్యూరో, ఆగస్టు 17, ప్రభాతవార్త:** మధ్యవర్తిత్వం అనేది కక్షి దారులు ఐచ్ఛికంగా సహకరించుకొని వివాదాలను పరిష్కరించుకొనే ఒక ప్రక్రియ హైకోర్టు న్యాయమూర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి. సామ్‌కోషి అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కోర్టులలోని కేసులను గణనీయంగా తగ్గియాలని హైకోర్టు న్యాయమూర్తి పి.సామ్ కోషి పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా, జయ శంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, మహబూబాబాద్ జిల్లాలకు సంబంధించి ఆయా జిల్లాల న్యాయ సేవా సంస్థలు గుర్తించిన మధ్యవర్తిత్వం భావన, సాంకేతికతలపై సాధికారత పొందిన న్యాయవాదులకు '40' గంటల శిక్షణా కార్యక్రమం వివరణ కార్యక్రమంలో హైకోర్టు జస్టిస్ పాల్గొన్నారు. ఆదివారం హన్మకొండ సుబేదారిలోని డి.సి.సి. బ్యాంక్‌లో జస్టిస్ పి. సామ్‌కోషి, హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, హైదరాబాద్ కార్యనిర్వాహక చైర్మన్ మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వం ప్రపంచీకరించబడిందని, మధ్యవర్తిత్వం కోర్టుల భారాన్ని చాలావరకు తగ్గిస్తుందని వ్యక్తం చేశారు. శిక్షణ పొందిన మధ్యవర్తులు వారి అపారమైన అనుభవంతో న్యాయవాదులను మధ్యవర్తిగా మెలకువలు నేర్పుతారని సూచించారు. మధ్యవర్తిత్వం మొత్తం చట్టపరమైన ప్రక్రియ ద్వారా వెళ్ళకుండానే పార్టీల వివాదాలను పరిష్కరించడానికి అవకాశాలను అందిస్తుంది. కార్పొరేట్లు, వ్యాపారాలు, కంపెనీలు మొదలైనవన్నీ వారి వివాదాల పరిష్కారం కోసం మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయిస్తున్నారు అని తెలిపారు. మధ్యవర్తిత్వం మరియు రాజీ అనేది రెండు పార్టీల మధ్య వివాదాన్ని పరిష్కరించడానికి సమర్థవంతమైన సాధనం, ఇరువైపుల నుండి ఎటువంటి బాహ్య ఒత్తిళ్లు లేకుండా వారి వివాదాలను పరిష్కరించుకోవడానికి వారికి ఒక వేదికను అందిస్తుంది అని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుంది మరియు వారి మధ్య శాంతి మరియు సామరస్యాన్ని తెస్తుంది. ఇది కక్షి దారులకు చాలా ప్రయోజనం చేకూరుస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో మధ్యవర్తిత్వం వేగంగా అభివృద్ధి చెందడానికి ప్యానల్ న్యాయవాదులు మరియు పారా లీగల్ వాలంటీర్లు సేవలను అందించాలని సూచించారు. ఈ 40 గంటల శిక్షణ కార్యక్రమాన్ని న్యాయవాదులు సద్వినియోగపరచుకొని, మెళకువలు నేర్చుకొని కోర్టులలోని కేసుల కక్షిదారులను మధ్యవర్తిత్వం ద్వారా రాజీ కుదుర్చుకునే విధంగా ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జే శ్రీనివాసరావు మాట్లాడుతూ " కక్షి దారులు తమంతట తామే వాళ్ల కోపతాపాలను వదిలిపెట్టుకొని, సమస్యలను పరిష్కరించే విధంగా మధ్యవర్తిత్వం పనిచేస్తుందని తెలిపారు. మధ్యవర్తిత్వం అత్యధిక వివాదాలను పరిష్కరించుకోవడానికి సహాయపడుతుంది అని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా వాణిజ్య సంబంధాలు, వ్యక్తిగత సంబంధాలు చెడిపోకుండా ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వి.బి. నిర్మలా గీతాంబ, డాక్టర్ బి పట్టాభిరామా రావు ఇతర జిల్లా న్యాయమూర్తులు నారాయణ బాబు, మనీషా శ్రావణ్ ఉన్నమ్, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయి కుమార్, క్షమా దేశ్ పాండే, బార్ కౌన్సిల్ మెంబర్లు దుస్స.జనార్ధన్, బైరపాక జయాకర్,, వరంగల్ హనుమకొండ జిల్లాల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వలుస సుధీర్, పులి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం హన్మకొండ సుబేదారిలోని డి.సి.సి. బ్యాంక్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయ మూర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి. సామ్‌కోషి

# విదేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్న భారత్

## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి శ్రేయస్కరం

### ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం ఎంతో ప్రయోజనం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



క్రిస్టల్ విత్తనోత్పత్తి సంస్థలో పలు విభాగాలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**వర్గల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** వ్యవసాయ రంగంలో దేశం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టగా, వ్యవసాయ ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్ చేరుకున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సింగాయ పల్లిలో క్రిస్టల్ విత్తనోత్పత్తి సంస్థను పరిశీలించి వివిధ విభాగాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి శ్రేయస్కరం కాగా, క్రిమిసం హారక మందుల వినియో గాన్ని తగ్గించి కంపోస్టు ఎరువుల వాడకంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ విధానంతో విత్తన ఎంపిక నుండి పంట కోత వరకు ప్రయోజనం, అలాగే నీరు, ఎరువుల వినియోగం సరైన మోతాదులో ఉంటుందన్నారు. ముఖ్యం గా క్రిమిసంహారక మందులు అధిక ఎరువుల వినియోగంతో సాగు నేల ఆరోగ్యం దెబ్బ తింటుం దని, దీనిని దృష్టిలో పెట్టుకొని సహజ పద్ధ తుల్లో పండించే సాగులో కంపోస్ట్ ఎరువులు వినియోగించి పర్యావరణానికి హాని కలగకుండా ఆరోగ్యకర పంట ఉత్పత్తులు చేసుకోవచ్చని చెప్పారు. అంతేకాకుండా వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించే నూతన వంగడాలను ప్రోత్సహించి వాతావరణ మార్పులు, తెగుళ్ళ నుండి పంటలు కాపాడుకోవాలని కోరారు. కేంద్ర వ్యవసాయ, డైరీ రంగాన్ని ప్రోత్సహిస్తూ అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు ఎంఎస్పీ పెంచుతూ పంటల బీమా పథకం వర్తింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఎదుర్కొనే క్రమంలో నీరు వృథా చేయకుండా భూమిలో చేర్చేందుకు దృష్టి పెట్టాలని, తద్వారా ప్రతి ఒక్కరికి ఎంతో ప్రయోజనం ఉంటుందని అన్నారు.

ప్రధాని నరేంద్రమోడిపై ఎంత వత్తిడి వస్తున్నప్పటికీ ఇతర దేశాల పంట ఉత్పత్తుల దిగుబడుల జోలికి వెళ్లకుండా, దేశీయ వ్యవసాయం, రైతులను ప్రోత్సహిస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా ప్రపంచ దేశాలకు ధీటుగా భారత్‌ను గొప్ప ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతూ అమెరికా వంటి దేశాలకు ధీటైన సమాధానం చెబుతున్నట్లు వివరించారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ శాఖ కొత్త యాప్

## ప్రభుత్వ భూముల చుట్టూ రెడ్‌మార్క్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** హైదరాబాద్ జిల్లాలో ప్రభుత్వ భూముల రక్షణ కోసం రెవెన్యూ శాఖ సరికొత్త డిజిటల్ యాప్‌ను అభివృద్ధి చేస్తోంది. బైజాక్యుటీ సొల్యూషన్స్ రూపొందిస్తున్న ఈ యాప్ ద్వారా ప్రభుత్వ భూముల వివరాలను డిజిటల్‌గా నమోదు చేసి, జియోట్యాగ్ చేయనున్నారు. త్వరలో అందుబాటులోకి రానున్న ఈ యాప్, భూముల నిర్వహణలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతుంది. హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడటానికి రెవెన్యూ శాఖ ఒక సరికొత్త డిజిటల్ యాప్‌ను రూపొందిస్తోంది. బైజాక్యుటీ సొల్యూషన్స్ అనే ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ దీనిని అభివృద్ధి చేస్తోంది. ఈ యాప్ ద్వారా జిల్లాలోని అన్ని ప్రభుత్వ భూముల వివరాలను డిజిటల్‌గా నమోదు చేసి పారదర్శకంగా వాటిని పర్యవేక్షించవచ్చని అధికారులు తెలిపారు. ఈ యాప్‌లో ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు, ఇతర ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూములు, అలాగే కోర్టు కేసులలో ఉన్న భూముల వివరాలను కూడా నమోదు చేస్తున్నారు.ప్రభుత్వ భూముల చుట్టూ రెడ్ మార్క్ ఏర్పాటు చేసి, వాటిని జియోట్యాగ్ చేయనున్నారు.

దీంతో క్షేత్ర స్థాయిలో, డిజిటల్ మ్యాప్‌లో భూముల కొలతల్లో ఏ మాత్రం తేడా ఉండదు. ఈ యాప్‌లోని జియోట్యాగ్ చేసిన చిత్రాలు, వివరాలు భూ కబ్జా ప్రయత్నాలను గుర్తించడంలో సహాయపడతాయి. అవసరమైతే, ఈ చిత్రాలను కోర్టులో చట్టపరమైన సాక్షాలుగా ఉపయోగించవచ్చు. భవిష్యత్తులో ఈ యాప్‌తో ఒకే క్లిక్‌తో మొత్తం జిల్లాలోని ప్రభుత్వ భూముల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. దీనివల్ల అధికారులకు, ప్రజలకు సమయం ఆదా అవుతుంది.ప్రస్తుతం ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా ఒకటి, రెండు జిల్లాల్లో అమలు చేస్తున్నారు.

అయితే హైదరాబాద్ జిల్లా యాప్‌లో మరిన్ని అదనపు ఫీచర్లను చేర్చనున్నారు. జిల్లాలోని 16 మండలాల్లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను సందర్శించి, కబ్జాకు గురయ్యాయా లేదా కోర్టు కేసులు ఉన్నాయా వంటి వివరాలను కూడా ప్రత్యేకంగా యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ యాప్ రానున్న ఒకటి, రెండు నెలల్లో అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు. ఇది ప్రభుత్వ భూముల నిర్వహణలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలకనుంది.

# నాగులవంచ రైల్వేస్టేషన్ పునఃప్రారంభం

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** తెలంగాణలో నాగులవంచ రైల్వేస్టేషన్ తిరిగి ప్రారంభమైంది. అయితే ప్రయాణీకులు లేని కారణంగా ఇటీవల దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్వర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో స్థానికులు, చుట్టుపక్కల గ్రామాలు ఆందోళనకు దిగడంతో రైల్వే అధికారులు స్పందించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని స్టేషన్‌ను తిరిగి పునఃప్రారంభిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం రైల్వే స్టేషన్ చీఫ్ బుకింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ నాగులవంచ స్టేషన్‌టికెట్ కౌంటర్‌ను ఆదివారం తిరిగి ప్రారంభించారు. విద్యార్థులు, కార్మికులు రైల్వేప్రయాణం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, ప్రయాణికులు లేరని మూసివేయడం భావ్యం కాదన్నారు. అంతకు ముందు ప్రకటన ఉత్వర్వులను వెనక్కి తీసుకోవాలని ఇటీవల అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. సుమారు 70 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ స్టేషన్ భవితవ్యంపై స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు, వ్యాపారులకు ఈ రైల్వే స్టేషన్ రవాణాకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని అధికా రులకు వివరించారు. గత కొన్ని రోజుల నుంచి ఈ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనుల పేరిట టికెట్ కౌంటర్‌ను మూసివేశారు. కానీ వారం రోజుల కిందట ప్రయా ణికుల రద్దీలేని కారణంగా స్టేషన్ మూసివేస్తున్నట్లు ఉత్తర్వులు రావడంతో స్థాని కుల ఆగ్రహానికి గురయ్యారు. నాగులవంచ స్టేషన్ పునఃప్రారంభంతో భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజలకు రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందని ఆశిస్తున్నారు. ఇక నుంచి ప్రయాణికులు విజయవాడకు, ఖమ్మం, వరంగల్, సికింద్రాబాద్ వరకు ప్రయాణం చేయవచ్చు.

# నిబంధనలకు విరుద్ధంగా స్పా నిర్వహణ

## ఎనిమిది స్పా సెంటర్లపై పోలీసుల దాడి

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), ఆగస్టు 17, ప్రభాతవార్త:** నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్పా సెంటర్‌లపై పోలీసులు దాడి నిర్వహించారు. 8 స్పా సెంటర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తుండడంతో పోలీసులు దాడులు చేసి నిర్వాహకులను కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైజులు తెలిపిన వివరాల ప్రకారం.. వాసవికాలనీ అష్టలక్ష్మి దేవాలయం సమీపంలో మోజో వెల్నెస్ స్పా, కొత్తపేట విక్టోరియా మెట్రో రైల్వే స్టేషన్ సమీపంలోని స్కై బ్యూటీ అండ్ స్పా, నాగోల్ లోని ఏపీ స్కూల్ ఫ్యామిలీ సెలూన్ అండ్ స్పా, చైతన్యపురి సాయి నగర్ కాలనీలోని శివాజీ బొమ్మ వద్ద ఉన్న బ్రైట్నెస్ డ్యూటీస్ స్పా, లవి బ్యూటీ స్పా, అల్కాపురి కాలనీలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు పైన ఉన్న శ్రీ ఎల్ఐటి స్పా అండ్ సలూన్, నాగోల్ చౌరస్తా లోని విజెరిజన్ స్పా సెంటర్లు నిబంధనలకు విరుద్ధంగా నడిపి స్తున్నారని విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ దాడులలో స్పా నిర్వహించే యజ మానులను, సిబ్బందిని, కస్టమర్లను అదుపు లోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించామన్నారు. స్పా సెంటర్ల ముసుగులో ఏమైనా అసాంఘిక కార్య కలాపాలు సాగుతున్నాయా అనే కోణంలో దర్యా ప్తు జరుపుతు న్నామని తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.



పోలీసుల అదుపులో నిర్వాహకులు, కస్టమర్లు

# కొందరు పార్టీ రాష్ట్ర నేతలకు బిజెపి అధికారంలోకి రావడం ఇష్టం లేదు: రాజాసింగ్

**హైదరాబాద్ (గోషామహల్), ఆగస్టు 17, ప్రభాతవార్త:** తెలంగాణ బిజెపి అధ్యక్ష పదవిని మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావుకు అప్పగించడాన్ని నిరసిస్తూ నిరసనగా రాజాసింగ్ బిజెపి గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. వెంటనే శాసనసభ్యుడు రాజాసింగ్ రాజీనామాను అధిష్ఠానం కూడా ఆమోదించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బిజెపి పార్టీపై గోషామహల్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.రాజాసింగ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు.ఆయన ఓ మీడియా చానల్ ప్రతినిధితో మాట్లాడుతూ తెలంగాణలో బిజెపి ప్రభుత్వం రాదు అని మరోసారి సంచలమైన వ్యాఖ్యలు చేశారు.ప్రతి జిల్లాలో నా మనిషే అంటే ఎన్నో ఏళ్ల నుండి ప్రాణంపెట్టి పని చేసిన పాత కార్యకర్తలు ఎక్కడికి పోవాలి అన్నారు.బిజెపి అధిష్టానం కూడా తెలంగాణ రాష్ట్రంపై దృష్టి సారించడం లేదని,ఇతర రాష్ట్రాల మీద ఉన్న శ్రద్ధ తెలంగాణ రాష్ట్రంపై లేదన్నారు.బిజెపి అధిష్టానానికి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని ఇష్టం లేదని మరోసారి సంచలమైన వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలోని పెద్ద బాబులు చెప్పిందే అధిష్టానం వింటుందన్నారు.వాళ్ల పేర్లు చెప్పలేను అన్నారు. వాళ్ల వల్ల తెలంగాణ బిజెపికి చాలా నష్టం జరుగుతుందని శాసన సభ్యులు రాజాసింగ్ తీవ్రఆరోపణలు చేశారు. బిజెపి గతంలో రాజా సింగ్ రాజీనామాను అమోదించినప్పటికి మరోసారి తాజాగా చేసిన వ్యాఖ్య లపై అధిష్టానం ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

# నేడు, రేపు ఎప్‌సెట్‌లో ఇంటర్నల్ స్లైడింగ్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా ఇప్పటికే సీట్ల కేటాయింపు..కాలేజీల్లో చేరడం పూర్తయిన నేపథ్యంలో కాలేజీల్లో చేరిన విద్యార్థులకు ఇంటర్నల్ స్లైడింగ్‌కి అవకాశం కల్పించారు. నేడు(సోమవారం), రేపు(మంగళవారం) విద్యార్థులు వితిన్ ది కాలేజీల్లో బ్రాంచ్‌లు మారడానికి ఇంటర్నల్ స్లైడింగ్‌కి అవకాశం కల్పించినట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన ఆదివారం ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకి బ్రాంచ్‌ల మార్పుకి 18, 19 తేదిల్లో అవకాశం కల్పించారు. ఇంటర్నల్ స్లైడింగ్ ఇచ్చిన వారికి ఈ నెల 22 లోపుగా సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీట్లు పొందిన వారు అదే కాలేజీలో కొత్త బ్రాంచ్‌లో చేరడానికి ఈ నెల 22, 23 తేదిల్లో అవకాశమిచ్చారు. ఇంటర్నల్ స్లైడింగ్‌లో బ్రాంచ్‌లు మారిన విద్యార్థులు ఫీజురీయింబర్స్‌మెంట్‌కి అర్హులేనని కమిషనర్ ప్రకటనలో స్పష్టం చేశారు.

# అద్దెకు దిగుతామంటూ ఇళ్ల యజమానుల బ్యాంకు ఖాతాలు వివరాల సేకరణ

## కొత్తపద్ధతిలో మోసానికి సైబర్ నేరగాళ్లు

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** సైబర్ నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఎప్పుడు ఎలా జరుగుతుందో తెలియకుండా వుండడంతో ఏ పాపం తెలియని అమాయకులు కేసుల్లో ఇరుక్కొని ఇక్కట్లు పడుతుండగా సైబర్ నేరగాళ్లు మాత్రం దర్జాగా అందినంత దోచుకుంటూ జల్సాగా జీవిస్తున్నారు. కొత్త తరహాలో వెలుగు చేసిన సైబర్ నేరాల్లో ముఖ్యమైనది అద్దె ఇంట్లో దిగుగూ ఇళ్ల యజమానుల ఆధార్ కార్డులు, బ్యాంకుల ఖాతాల వివరాలు తీసుకుని, వాటిని సైబర్ నేరాలకు సంబంధించిన లావాదేవాలకు వాడడం. ఈ తరహా నేరాల్లో సైబర్ నేరగాళ్లు మొదట అద్దె ఇంట్లోకి దిగుతారు. ఇంటి యజమాని ఆధార్ కార్డును తీసుకుంటారు. ఇంటి యజమాని ఆధార్ కార్డు వుంటేనే తాము పలానా వ్యక్తి ఇంట్లో అద్దెకు వుంటునా న్నమని, తమ కంపెనీ నమ్ముతుందని, ఇంటి అద్దె ఇస్తుందని నమ్మబలుకుతారు. దీని తరువాత ఇంటి యజమాని బ్యాంకు ఖాతాను, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డులు తీసుకుంటారు. వీటి ఆధారంగా లాగిన్ ఐడి, పాస్‌వర్డ్‌లు తీసుకుంటారు. వీటి ఆధారంగా సైబర్ నేరగాళ్లు నేరాలకు శ్రీకాకం చుడ తారు. ఇంటి యజమాని బ్యాంకు ఖాతాల ద్వారా సైబర్ నేకాలకు సంబంధించిన లావాదేవీలు నిర్వహిస్తారు. ఈ విషయం ఎప్పుడో కానీ ఇంటి యజమానులకు తెలియదు. తీరా తెలిసే సమయానికి పోలీసులు కేసు నమోదు చేసి వారిని నిందితులుగా చూపుతారు. అవసరం అయితే అరెస్టు చేసి వారిని జైళ్లకు కూడా పంపుతున్నారు. నగరంలోని సనత్‌నగర్‌కు చెందిన ఓ ఆటో డ్రైవర్ తన సొంత బావమరిదికి అడగగా ఆధార్ కార్డు, బ్యా ంకు ఖాతా వివరాలు, డెబిట్ కార్డు ఇచ్చాడు. మూడు నెలల తరువాత సదరు ఆటో డ్రైవర్ బ్యాంకు ఖాతాలో సైబర్ నేరాలకు సంబంధించి లక్షలాది రూపాయల లావాదేవీలు జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి విచారణకు పిలిచారు. తనకు ఇదంతా ఏమీ తెలియదని, తన బావమరిది అడిగితే ఇచ్చానని చెప్పగా అదంతా నీవు...నీ బావమరిది తేల్చుకోవాలి...అంటూ ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు పోలీసులు. ఇటువంటిదే శివార్లలో వెలుగు చూసింది. 20 వేల రూపాయలకు పెద్ద ఇంటిని తీసుకున్న సైబర్ నేరగాళ్లు ఈ క్రమంలో ఇంటి యజమానిని దోస్తీ చేసుకుని అతని బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని వీటి ద్వారా సైబర్ నేరాలకు దిగారు. ఈ కేసులో ఇంటి యజమాని బ్యాంకు ఖాతాలో 25 లక్షల రూపాయల సైబర్ నేరాల లావాదేవీలు జరిగినట్లు తేలింది.

ఈ నేరం వెలుగుచూసే సమయానికి సైబర్ నేర గాళ్లు ఉడాయించగా ఇంటి యజమాని పోలీసు కేసులో ఇరుక్కొని ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చింది. ఈ తరహా మోసాలు దేశ వ్యాప్తంగా అనేకచోట్ల వెలుగు చూడడం ఆయా ప్రాంతాలలో సంచలనం రేపింది. బడా సైబర్ నేరగాళ్లు విదేశాల్లో వుంటుండగా వారికి అనుచరులుగా వుంటున్న వారు భారత్‌లోని ఉత్తర, తూర్పు రాష్ట్రాలలో వుంటున్నారు. వీరికి ఏజెంట్లుగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వారుంటున్నారు. ఈ ఏజెంట్లు కొందరు సబ్ ఏజెంట్లను నియమించుకుని తెలివిగా ఆయా బస్తీలలో వుండే ఆటో డ్రైవర్లు, సామాన్య కూలీల చేత బ్యాంకు ఖాతాలు తెరిపించి, వారికి కొంత క మీషన్ ఇస్తున్నారు. ఇలాంటి కేసుల్లో కూలీలు, ఆటో డ్రైవర్లు పోలీసు కేసుల్లో ఇరుక్కోగా తాజాగా ఇళ్ల యజమానుల వంతు వచ్చింది. ముందుగా ఆయా ప్రాంతాలలో అద్దెకు వుండే ఇళ్లను కనుగొని సైబర్ నేరగాళ్లు అక్కడ దిగుతున్నారు. ఇంటి యజమాని అడిగినంత అద్దె ఇచ్చేందుకు సిద్ధమవడంతో పాటు ఐదారు నెలల అడ్వాన్స్ కూడా ముందుగానే ఇచ్చేస్తున్నారు. అనంతరం వారి నమ్మకాన్ని చూరగొని ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాలను, డెబిట్ కార్డులను తీసుకుని వీటి ఆధారంగా సైబర్ నేరాలకు సంబంధించిన లావాదేవీలు నడుపుతున్నారు. ఇక పోలీసులు కేసు నమోదు చేసి బ్యాంకు ఖాతాదారులను అరెస్టు చేసే సమయానికి నేరాలకు పాల్పడిన వారు ఉడాయిస్తున్నారు. ఎవరికి పడితే వారికి బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డులు, డెబిట్ కార్డులు ఇవ్వకూడదని వారు హెచ్చరిస్తున్నారు.

వార్త

జీవితాన్ని ఇచ్చిన తల్లిదండ్రులకు, జ్ఞానవంతునిగా చేసిన ఉపాధ్యాయులకు మించిన గౌరవించతగినవారు లేరని తెలుసుకో.

-తిరుక్కురళ్

# కాలుష్య కౌగిలిలో నగరాలు!

ఒర్లి ఒర్లి వారుపోతారు, వండుక తిని మనం పోదాం అన్నట్లుగా ఉంది కాలుష్య నియంత్రణ విషయంలో కొందరు అధికారులు, మరికొందరు పారిశ్రామికవేత్తలు వ్యవహరిస్తున్న తీరు. కాలకూట విషంగా మారుతున్న కాలుష్య విషవాయువుల నుంచి ప్రజలను కాపాడేందుకు పాలకులు చట్టాల మీద చట్టాలు చేస్తున్నా, ఎందరిపైనో చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పుకుంటున్నా కాలుష్యకాటుకు బలయ్యేవారి సంఖ్య అంతకంతకు పెరుగుతుండడంఆందోళన కలిగించే అంశం. ఈ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కబెడుతూ జాప్యం చేస్తే కాలుష్య రక్కసి కాటుకు దేశవ్యాప్తంగా కోట్లాది మంది బలికాక తప్పదని పర్యావరణ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. జీవించే హక్కు కల్పించమని కోరుతూ కొందరు ఈ కలుష్యకాసారంలో చిక్కుకున్న నిర్భాగ్యుల వేదన అరణ్యరోదనగా మిగిలిపోతున్నది. కాలుష్య నియంత్రణ మండలిని ఏర్పాటు చేశారు. అనేక చట్టాలు తెచ్చారు. చర్యలు తీసుకుంటున్నారు. అయినా అవేమీ ఈ కాలుష్యం నుండి ప్రజలను కాపాడలేకపోతున్నాయి. ముఖ్యంగా నగరాల్లో కాలుష్యం అంతకంతకు పెరిగి ఇప్పుడు అది నగరాల పరిసర ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నది. ఈ కారణంగానే దేశరాజధాని ఢిల్లీలో పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. అక్కడ వాయు కాలుష్యం కారణంగా గాలి పీల్చితే పొగ అలవాటులేకపోయినా కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందనే సంకేతాలు వెల్లడవుతున్నాయి. మరికొందరు ఢిల్లీ నివాసులు వర్ష, చలికాలాల్లో నగరాన్ని వదిలి రెండు,మూడు నెలల పాటు దూరంగా వెళ్లిపోతున్నారు. ఢిల్లీయే కాదు దేశంలో అనేక నగరాల్లో అదే పరిస్థితి. ప్రపంచ జనాభాలో ప్రస్తుతం సగం నగరాల్లోనే నివసిస్తున్నది. మరో మూడు దశాబ్దాల నాటికి నగర జనాభా అదనంగా మూడువందల కోట్లకు పెరుగుతుందని అధికారుల అంచనా. భూభాగంపై నగరాల వైశాల్యం రెండు, మూడు శాతానికి మించకపోయినా కాలుష్యంలో మాత్రం అది ప్రపంచ జనాభా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే స్థాయిలోవిస్తరిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా స్థూల దేశీయోత్పత్తిలో అరవై శాతం ఆరువందల పట్టణాల్లో కేంద్రీకృతమై ఉందంటే నగరాల ప్రాధాన్యత ఏమేరకు ఉందో చెప్పనవసరం లేదు. ప్రధానంగా వ్యవసాయరంగంలో ఏర్పడిన సంక్షోభం గ్రామీణ ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తుండడంతో వలసలు పెరిగిపోయాయి. అందుకే గ్రామీణ జనాభా తగ్గుతుండగా పట్టణాల్లో, నగరాల్లో జనాభా యేడాది యేడాదికి ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. భారత దేశంలో అయితే పట్టణీకరణ అందుకోలేనంతగా పెరుగుతున్నది. 2001లో పట్టణ ప్రాంతాల్లో జనాభా ఇరవైఎనిమిదన్నర కోట్లకు ఉంటే ఇప్పుడది నలభై కోట్లకుపైగా పెరిగిపోయిందని చెబుతున్నారు. ఈ నగరాల్లో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నిర్దిష్టమైన ప్రణాళిక ప్రకారం కనీస వసతులు కూడా కల్పించలేకపోతున్నారు. ఎన్నో పథకాలు చేపడుతున్నా అవి అవసరాలను తీర్చలేకపోతున్నాయి. 2005లో ప్రారంభించిన జవహర్‌లాల్‌నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ కార్యక్రమం (జెఎన్ఎన్‌యుఆర్ఎం) కింద పట్టణ ప్రాంతాల్లో మరికొన్ని సౌకర్యాలు కల్పించి జీవనం కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నా పెరుగుతున్న అవసరాలను అవి అందుకోలేకపోతున్నాయి. భారత్‌లో గతంలో ఆరు మెట్రోనగరాలు చెన్నై, ఢిల్లీ, బెంగలూరు, కోల్‌కతా, హైదరాబాద్, ముంబయిలలో ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహించిన సర్వేలో విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. విస్తరణ, తదితర అంశాల్లో ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా చేపట్టడం వల్ల తీవ్రమైన దుష్ప్రభావం ప్రజారోగ్యంపై చూపుతున్నదనేది ఆ నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా నగరాల్లో వాయు, నీటికాలుష్యంవల్ల పౌరుల ఊపిరితిత్తులకు తూట్లు పొడుస్తుందని హెచ్చరించారు. చెన్నై, కోల్‌కతా, ముంబాయిలలో వాహన కాలుష్యం తీవ్రంగా ఉంది. తర్వాత స్థానం పారిశ్రామిక కాలుష్యం. బెంగళూరులో పరిస్థితి మరోరకంగా ఉంది. పరిశ్రమల కారణంగా అక్కడ వాయుకాలుష్యం తీవ్ర స్థాయికి చేరినట్లు ఆ సర్వేలో బయటపడింది. ఇక వాహనాలు, నీటి కాలుష్యంలో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంది. నిర్మాణరంగం వల్ల గాలిలో దుమ్ము, ధూళి చేరుతుండడంతో ప్రజారోగ్యం రానురాను ప్రశ్నార్థకంగా మారింది. హైదరాబాద్ మహానగరంలో ఈవాయు కాలుష్యానికి నీటి కాలుష్యం కూడా తోడుకావడంతో పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. నగర శివార్లలోని పరిశ్రమల నుండి గాలిలోకి వదులుతున్న కాలుష్యాలకు అడ్డూఅదుపు లేకుండాపోతున్నది. ఇక నీటి కాలుష్యం పరిస్థితి ఆందోళనకరంగా మారుతున్నది. నగరశివార్లలోని పరిశ్రమల నుండి విషపూరితమైన రసాయనిక కలుషిత జలాలు శుద్ధి చేయకుండా మూసీలో కలిసిపోతున్నాయి. వాస్తవానికి ఈ సమస్య ఇప్పటికిప్పుడు కొత్తగా పుట్టుకొచ్చిందికాదు. ప్రభుత్వ విధానాలు, కొందరు అధికారుల అవినీతి, అసమర్థత, అంతులేని నిర్లక్ష్యం కారణంగా రోజురోజుకు పెరిగిపోతున్నది. ఫలితంగా మూసీతోపాటు ఎన్నో చెరువులు, కుంటలు, కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. కొన్ని చెరువులు అయితే చేపలు, ఇతర జలచరాలు ఏవీ జీవించలేని పరిస్థితి ఏర్పడింది. పశుపక్ష్యాదులతోపాటు మానవ జీవనం కూడా ప్రశ్నార్థకంగా మారే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా ఈ కాలుష్య నియంత్రణ విషయంలో పాలకులు చట్టాలు చేసి చేతులు దులుపుకుంటే సరిపోదు. అవి త్రికరణశుద్ధిగా అమలుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

నీది కాదని తెలిసిన దాన్ని కూడా నీదనుకోవడం నిజంగా నేరం.



రాగూర్

ఒక పనిని బాగా చేయడం మాత్రమే కాకుండా మరింత బాగా చేయాలన్న అదనపు కోరికను సామర్థ్యం అంటారు.



హెచ్. గిల్బర్ట్

## ప్రజావాక్కు



### కఠిన శిక్షలు వేగవంతం చేయాలి

ఈమధ్య ఇళ్ళల్లోకి దొంగలు యధేచ్ఛగా ప్రవేశించి ఇంట్లోని వారిని హింసించి బీరువాలను పగలగొట్టి దొరికినంత దోచుకుని పారిపోతున్నారు. ఇళ్లకు తాళాలు వేసి గుడికి వెళ్ళినా ఏదైనా ఊరికి వెళ్ళినా రెక్కీలు నిర్వహించి చటుక్కున వచ్చి ఏదోవిధంగా వారొచ్చిన పనిని నిర్విఘ్నంగా చేసుకుపోతున్నారు. ఆడవారి మెడలో చైన్ స్నాచింగ్‌లు నిత్యకృత్యం అయిపోతున్నాయి.బ్యాంకు ఎ.టి.ఎమ్. మిషన్లను చాకచక్యంగా ఓపెన్ చేసి అందులోని కాష్ మొత్తాన్ని దోచుకువెడుతున్నారు.నిన్నగాక మొన్న హైద్రాబాద్ చాందానగర్‌లోనున్న ఖజానా నగల దుకాణంలో పట్టపగలు పిస్టళ్లతో మొహాలకు గుడ్డలు కట్టుకుని నగలను దోచుకెళ్లారు.సిసికెమెరాల్లో కనిపించిన వారి ఆచూకి ఇంతవరకు తెలియరాలేదు. ఇందుకు కారణాలు ఈజీగా డబ్బు సంపాదించవచ్చనే దురాలోచన. చట్టాలను కొత్తగా మారిస్తే సరిపోదు. కఠిన శిక్షలు వేగవంతం చేయాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ప్రాజెక్టులు నిర్మించాలి

తెలంగాణ సాధారణ వర్షాపాతం ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు ఎక్సెస్ రైన్ ఫాల్ వచ్చి ఉంటుంది అలా వచ్చిన నీటిని ఎంత వరకు స్టోర్ చేస్తున్నాం అనే దాని మీద తెలంగాణ భవిత ఆధారపడి ఉంటుంది అని గుర్తు పెట్టుకోవాలి. ఎందుకంటే తెలంగాణకు సముద్ర మార్గం కానీ అంతర్జాతీయ నీటి ప్రవాహం మార్గం కానీ లేదు. భూమి లోపలికి నీటినిఇంకేటట్టు చేయడం,చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలి. తెలంగాణ ఉద్యమంలో నీళ్ల అనేదిఒక మేజర్ ఆబ్‌జెక్టివ్‌గా ఉన్నప్పుడు గత ప్రభుత్వం కోట్ల రూపాయలతో చెక్ డ్యామ్‌లు నిర్మించినప్పుడు ఈ ప్రభుత్వం ఎందుకు ఆ పని చేయకూడదు.

- భారత అవినాష్, జనగామ

### మద్యం కేంద్రాలను నిషేధించాలి

ఇటీవల ఏపిలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం విక్రయ కేంద్రాలు కొన్ని నగరాలలో జనవాడల మధ్య ఉంటున్నాయి.మద్యసేవకులు మోతాదు ఎక్కువై అక్కడ ఇతరులతో ఘర్షణలు శృతి మించి కొట్టుకుంటూ ఆ దృశ్యం భయం కలుగుతున్నది. కొత్త షాప్‌లకు ప్రదేశం కాస్త దూరంగా ఉంటే ఈ సమస్య కొంత తగ్గుతుంది.

- కె.రామారావు, విశాఖపట్నం

### పరిష్కారం చూపాలి

ఇటీవల జాతీయ స్థాయిలోనడుస్తున్న కేంద్ర ఉద్యోగుల ఆరోగ్య పథకం మొత్తం ఆన్లైన్ సదుపాయాన్ని వేరే కొత్త సి డాక్ అనే సాఫ్ట్వేర్‌కి మార్చారు. మార్పు ఏదైనా మెరుగైన సదుపాయం, సులువు ఉంటే లబ్ధిదార్ల సేవలకు ఇబ్బంది ఉండదు. ఇది ఉచిత పథకం కాదు. ఒక వ్యక్తి సుమారు 35000 చొప్పున్న కట్టిన తర్వాత గుర్తింపు కార్డులు జారీచేశారు. సుమారు ఐదు సంవత్సరాలు సేవలు జరిగిన పథకంలో ఇప్పుడు కొత్త విధానంవారి అర్హత,వాలిడిటీలు తప్పుగా చూపిస్తూ తప్పుడు సమాచారంతో లబ్ధిదారులకు వైద్యం కోసం సేవలు నిరాకరించడం జరిగింది. స్థానిక కేంద్ర అధికార్లు సదరు ఫిర్యాదుని ముఖ్యంగా భావించి , డేటా మార్పిడి కోసం వారి పరిశీలనతో త్వరగా ఎగువ స్థాయి కేంద్రానికి నివేదికతో పాటు ,ఆన్లైన్ వ్యవస్థను వాడుకోవాలి. ఇది చాలా మందికి ఇదే సమస్య వచ్చిందనడం, తాము సరిచేయలేమని చెప్పడం కన్నా పరిష్కారం చూపాలి.

- బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

### ఉచిత బస్సు అందరికి ఇవ్వకూడదు

ఆడ, మగ సమానం అని చెప్పడానికి ఎంత ప్రయత్నిస్తున్నప్పటికీ ఒకటిమాత్రం కాదు.ఆడవారి దుస్తులు వేరు మగ వారు దుస్తులువేరు. ఆడవారి అవసరాలు వేరు మగవారి అవసరాలు వేరు.ఆడవారు చేయగలిగిన పనులకు మగవారు చేయగలిగిన పనులకు వ్యత్యాసం ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ప్రియాతి ప్రియమైన శిష్యుడైనటువంటి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన స్త్రీలకు ఉచిత బస్సు పథకం ఆర్థిక కష్టాలకు కారణమై అభాసుపాలయ్యింది. హైదరాబాదులో ఆటో డ్రైవర్ల ఆగ్రహానికి హేతువయ్యింది. ఉచిత బస్సు ప్రయాణం ఆర్థికంగా వెనకబడిన వారికి అనుమతించాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### రైళ్ల హాల్ట్ పునరుద్ధరణ మాట గాలికేనా?

వ్యాపార, వ్యవసాయ విద్యారంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిన పశ్చిమ గోదావరి జిల్లాఅత్తిలిలో టిక్కెట్లు విక్రయాలు తక్కువగా ఉన్నాయన్న సాకుతో 2021 సంవత్సరం కరోనా సమయంలో అత్తిలి రైల్వే స్టేషన్లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ రద్దు చేశారు. కరోనా భయం పూర్తిగా తొలగి ప్రయాణికుల సంఖ్య పెరిగినా, హాల్ట్‌ల పునరుద్ధరణ విషయం మాత్రం గాలికి వదిలివేసినట్లుగా కనిపిస్తుంది.

-డి. వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం ప.గో.జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తిని కాపాడాలి!

ఎలక్షన్ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అయినప్పటికీ ఎన్నికల కమిషన్ నిర్వహణకు, కమిషన్ సభ్యుల వ్యక్తిగత అవసరాలకు అవసరమైన నిధులన్నీ ప్రభుత్వమే మంజూరు చేయాల్సి రావడం వల్ల వారు కఠినంగా వ్యవహారించలేకపోతున్నారు. అందువల్ల ఎన్నికల సంఘానికి, సంఘం సభ్యులకు అవసరమైన నిధులు అధికారంలో వున్న ప్రభుత్వంపై ఆధారపడకుండా బడ్జెట్టులోనే ప్రత్యేకంగా కేటాయించే విధంగా చట్టంలో ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా ఎన్నికల కమిషన్ సభ్యులుగా పదవీ విరమణ చేసినఅనంతరం ప్రభుత్వ పరమైన పదవులు ఆశించడంవల్ల కూడా నిస్పాక్షికంగా వ్యవహారించ లేకపోతున్నారు. ఇదేసమయంలో పదవీ విరమణఅనంతరం ఎన్నికల కమిషన్ సభ్యులు ఎటువంటి ప్రభుత్వ పదవులు స్వీకరించడానికి అవకాశం లేకుండా చట్టాన్ని సవరించాలి. అంతేకాకుండా ఎలక్షన్ కమిషన్ సభ్యుల నియామక కమిటీలో ప్రతిపక్ష నాయకునితోపాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా చేర్చాల్సిన అవసరం వుంది.



అన్నవరపు బ్రహ్మయ్య

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ పాల్పడిన అక్రమాలపై దేశవ్యాప్తంగా అలజడి చేస్తున్నప్పటికీ అమెరికా అధ్యక్షుడు భారతదేశంపై విధించిన పన్నుల అంశం బిజెపి ప్రభుత్వాన్ని కాపాడుతోంది. ప్రతిపక్షనేత, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బీహార్ ఓటర్ల జాబితాలో జరిగిన అక్రమాలేకాకుండా కర్ణాటక రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో ఒక లోక్‌సభ నియోజకవర్గంలో లక్షకు పైగా దొంగ ఓటర్లను చేర్పించడం, ఒకే ఇంటి నెంబరులో వందల సంఖ్యలో ఓటర్లను నమోదు చేయడం వంటి అంశాలను వెలుగులోకి తీసుకువచ్చినప్పటికీ ఈ అంశాలు పూర్తిస్థాయిలో ప్రజల దృష్టికి వెళ్లడం లేదు.అధికారం దుర్వినియోగం చేసి, ఎన్నికల కమిషన్‌ను తమ చెప్పుచేతలలో పెట్టుకోవడం అధికారంలో వున్న రాజకీయ పార్టీలకుకొత్తమే కాదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఉదాహరణకి 1971లో సార్వత్రిక ఎన్నికల్లో రాయబరేలి నియోజకవర్గం నుంచి ఇందిరాగాంధీ గెలిచారు. ఆమెపై పోటీచేసి ఓడిపోయిన రాజ్ నారాయణ్ ఎన్నికలలో అక్రమాలు జరిగాయని, ఇందిర ఎన్నికను సవాల్ చేస్తూ అలహాబాద్ హై కోర్టులో కేసు వేశాడు. అలహాబాద్ హైకోర్టు జూన్ 12, 1976న తీర్పు చెబుతూ ఎన్నికలలో అక్రమాలు జరిగాయని నిర్ధారిస్తూ ఇందిరా గాంధీని దోషిగా భావించి ఆరు సంవత్సరాల పాటు ఎన్నికలలో పాల్గొన రాదని కూడా తీర్పు చెప్పింది. జూన్ 24న సుప్రీం కోర్టు ఈ తీర్పు అమలు కాకుండా స్టే విధించడం, ఆ తర్వాత పరిణామాలలో 1975లో ఎమర్జెన్సీ విధించడం అందరికీ విదితమే. ఈ కారణంగానే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటుఇండియా కూటమి నేతలు చేస్తున్న ఆందోళనకు ప్రాధాన్యత లేకుండా పోతుందని కొంతమంది మేధావులు అభిప్రాయపడుతున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ఈ వ్యవస్థ నియంత్రణ లేకుండా స్వతంత్రంగా వ్యవహారించే వ్యవస్థలలో భారత ఎన్నికల కమిషన్ ఒకటి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1950వ సంవత్సరంలో భారత ఎన్నికల సంఘం ఏర్పడింది. ఈ చట్టం ప్రకారం ఒకే వ్యక్తి ఎన్నికల కమిషన్‌గా వ్యవహారించేవారు. అయితే 1989, అక్టోబరులో భారత ఎన్నికల సంఘం చట్టంలో మార్పులు తీసుకువచ్చారు. ఈ మార్పు ప్రకారం ఎన్నికల సంఘంలో ఒకరే కాకుండా మొత్తం ముగ్గరు సభ్యులతో కూడిన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ముగ్గరిలో ఒకరు ప్రధాన ఎన్నికల అధికారిగా, మిగిలిన ఇరువురు సభ్యులుగా వుంటారు. ముగ్గరిలో ఒకరు ప్రధాన అధికారి అయినప్పటికీ ఇతర సభ్యులపై పెత్తనం చేయకూడదు. ఏ నిర్ణయమైనా ముగ్గరు కలిసి తీసుకోవాలి. నిజానికి శేషన్ బాధ్యతులు స్వీకరించడానికి ముందే ముగ్గరు సభ్యులను నియమించాలని నిర్ణయించినప్పటికీ అది ఆచరణలోకి రాలేదు. ఈలోగా 1990లో శేషన్ ఎన్నికల అధికారిగా అధికారంలోనికి వచ్చాడు. 'నీతివంతు




లు సింహం వలే జీవింతురు' అనే సూక్తికి నిదర్శనం మాజీ ఎన్నికల కమీషనర్ టి.ఎన్.శేషన్ అని చెప్పవచ్చు. ఇప్పటి వరకు 31 ఎన్నికల సంఘాలు పనిచేయగా వీరిలో శేషన్‌కు ముందు లేదా తర్వాత పనిచేసిన ఏ ప్రధాన ఎన్నికల అధికారి శేషన్ మాదిరిగా పేరు తెచుకోలేకపోయారు. 1990 నుంచి 1996 డిసెంబరు వరకు భారత ప్రభుత్వ ఎన్నికల కమీషనర్‌గా పనిచేసిన శేషన్ తీసుకు వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు, పనిచేసిన విధానం దేశం ఎప్పటికీ మర్చిపోలేదు. ఆయన పనిచేసినంతకాలం రాజకీయ పార్టీల నాయకుల గుండెల్లో దడ పుట్టించాడు. ఎన్నికల అధికారిగా శేషన్ తీసుకు వచ్చిన విప్లవాత్మక మార్పులు, కచ్చితంగా వ్యవహారించిన తీరుతో భీతిల్లిన రాజకీయవేత్తలు 1993లో అక్టోబర్ 1, నుంచి దాన్ని ముగ్గరు సభ్యులు ఉన్న కమిషన్‌గా మార్పుచేశారు. ఎన్నికల సంఘం సభ్యులను ఎంపిక చేయడానికి ప్రధాన మంత్రితోపాటు ప్రతిపక్ష నాయకుడు, ప్రధాన మంత్రి సూచించిన కేంద్రమంత్రి వర్గంలోని ఒక సభ్యునితో ఒక కమిటీ ఏర్పడాలని భారత రాష్ట్రపతి నిర్దేశించారు. దేశానికి ఒక్కరే ప్రధాని ఒక్కరే రాష్ట్రపతి ఒక్కరే ముఖ్యమంత్రి ఉన్నట్లుగా ఒక్కరే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఉండాలని ఆ సమయంలో కొంతమంది మేధావులు అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై సుప్రీమ్ కోర్టులో కేసుదాఖలైంది. ఎన్నికల సంఘం సభ్యుల ఎంపికపై నిర్దిష్టమైన చట్టం చేసే వరకు ప్రధాన మంత్రితోపాటు ప్రతిపక్ష నాయకుడు, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ఎన్నికల సంఘం సభ్యులను సూచించాలని సుప్రీం కోర్టు ప్రకటించింది. ఎన్నికల సంఘం సభ్యుల నియామకం విషయంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యునిగా వుండటం ఇష్టంలేని కేంద్రప్రభుత్వం పార్లమెంటు ఎన్నికల సంఘం సభ్యుల నియామక చట్టానికి సంబంధించిన సెక్షన్ 7ను సవరిస్తూ 2023లో చట్టం చేసింది. ఈ సవరణ చట్టం ప్రకారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రస్తావన లేకుండా ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడితోపాటుప్రధాన మంత్రి సూచించిన కేంద్రమంత్రి వర్గంలోని ఒక సభ్యునితో ఒక కమిటీ ఏర్పడాలని భారత రాష్ట్రపతి నిర్దేశించారు. సవరించిన చట్టం ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘం ముగ్గరు సభ్యులను ఎంపికచేసే ముగ్గరు సభ్యుల కమిటీలో ఇరువురు (ప్రధానమంత్రి, ఆయన సూచించే మరో కేంద్రమంత్రి అధికార పార్టీకి చెందినవారే కావడం, ప్రతిపక్ష నాయకుడు ఒక్కరే సభ్యునిగా వుండటం వల్ల ఆయన మాటకు విలువ లేకుండా పోతోంది. ఎలక్షన్ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అయినప్పటికీ ఎన్నికల కమిషన్ నిర్వహణకు, కమిషన్ సభ్యుల వ్యక్తిగత అవసరాలకు అవసరమైన నిధులన్నీ ప్రభుత్వమే మంజూరు చేయాల్సి రావడం వల్ల వారు కఠినంగా వ్యవహారించలేకపోతున్నారు. అందువల్ల ఎన్నికల సంఘానికి, సంఘం సభ్యులకు అవసరమైన నిధులు అధికారంలో వున్న ప్రభుత్వంపై ఆధారపడకుండా బడ్జెట్టులోనే ప్రత్యేకంగా కేటాయించే విధంగా చట్టంలో ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా ఎన్నికల కమిషన్ సభ్యులుగా పదవీ విరమణ చేసినఅనంతరం ప్రభుత్వ పరమైన పదవులు ఆశించడంవల్ల కూడా నిస్పాక్షికంగా వ్యవహారించ లేకపోతున్నారు. ఇదేసమయంలో పదవీ విరమణఅనంతరం ఎన్నికల కమిషన్ సభ్యులు ఎటువంటి ప్రభుత్వ పదవులు స్వీకరించడానికి అవకాశం లేకుండా చట్టాన్ని సవరించాలి. అంతేకాకుండా ఎలక్షన్ కమిషన్ సభ్యుల నియామక కమిటీలో ప్రతిపక్ష నాయకునితోపాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా చేర్చాల్సిన అవసరం వుంది. •

# మహిళా రక్షణ మాటల్లోనేనా?

ఎస్.సీతారామయ్య

అర్ధరాత్రి వేళ మహిళ వీధిలో ఒంటరిగా తిరగ్గలిగినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు అన్న మహాత్మా గాంధీ మాటకు ఇంకెప్పుడు సార్థకత? కొంత కాలంగా విద్యార్థినులపై జరుగుతున్న దారుణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సామాజికంగా, శాంతి భద్రతలపరంగా మన వెనుకబాటుతనాన్ని, పాలకుల నిర్లక్ష్య ధోరణులను ఎత్తి చూపుతున్నాయి. విద్యా నైపుణ్యాలను అందించి, వికాసానికి తోడ్పాడాల్సిన విద్యాలయ ప్రాంగణాలు కూడా అమ్మాయిల పట్ల అభద్రతా వలయాలుగా మారటం విచారకరం, జాతీయ నేర నివారణ విభాగం గణాంకాల ప్రకారం దేశంలో రోజుకు 86 అత్యాచారాలు నమోదవుతున్నాయి. ఇందులో 90 శాతం దారుణాలు తెలిసిన వ్యక్తుల ద్వారానే జరుగుతుండడం గమనార్హం. బాధితుల్లో 10 శాతం మంది 18 ఏళ్లలోపు వారు కాగా, 66శాతం మంది 18-30 ఏళ్ల లోపువారు ఉంటున్నారు. చదువుకున్న చోట, శిక్షణ పొందుతున్న చోట విద్యార్థినులకు రక్షణ లేకపోవటం అత్యంత విచారకరం. ఉపాధ్యాయ విద్యార్థిని పట్ల ఓ అధ్యాపకుడి వేధింపులకు పాల్పడితే కళాశాలకు వెళ్లిన విద్యార్థిని విగత జీవిగా తుప్పల్లో పడి ఉంటే మహిళలకు ఇంకేం భద్రత? తమ మాట వినకుంటే భవిష్యత్తుకు నష్టం కలిగిస్తామన్న బెదిరింపులతో కొంతమంది శిక్షకులు, అధ్యాపకులు,సిబ్బంది వికృత చేష్టలకు పాల్పడడం నిత్యకృత్యంగా మారుతోంది. ఎటుపోతున్నది మన సంప్రదాయం? మన ఆచార వ్యవహారాలతో వచ్చిన సంస్కారం, మన కట్టుబాట్లు ఏమైపోతున్నాయి? మన యువత, అసలు మనమంతా ఎటుపోతున్నాం? ఏది పరిష్కార మార్గం? మన దేశ సంపదగా భావించిన మన జీవన విధానాన్ని గురించి, మన విద్యా వ్యవస్థలతో పాటు మన ప్రభుత్వాల నిర్వాకం గురించి మాట్లాడాల్సిన అవసరం ఆసన్నమయింది. క్షణం ఆలస్యం చేస్తే ప్రతిక్షణం ఇక బాధపడక తప్పదు. స్కూళ్ళల్లో,కాలేజీలల్లో, పని ప్రాంతాల్లో మహిళలపై ఈమధ్య జరుగుతున్న దాష్టీకాలు లెక్కకు మిక్కిలి అవుతున్నాయి. నిజానికి విద్యాలయాలల్లో ఇంతకు మునుపు సేఫ్ అనుకున్న ప్రదేశాలల్లో ఇలాంటి ఘోరాలు జరుగుతుండటంతో సభ్య సమాజం తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈసంవత్సరం జులై 14న, బాలాసోర్ లోని ఫకీర్ మోహన్ అటానమస్ కాలేజీలో బి.ఈడీ చదివే 20 సంవత్సరాల విద్యార్థిని సెల్ఫ్ ఇమ్మొలేషన్‌కు పాల్పడి 80శాతం కాలిన గాయాలతో మరణించింది. ఆమెకు జరిగిన అవమానం హృదయ విదారకం. ఆ కాలేజీలో ఒక సీనియర్ అధ్యాపకుడు తనను లైంగికంగా అనేక సార్లు వేధించటానికి పాల్పడటం, ఆ విషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి అనేకసార్లు తీసుకోచ్చినా ఫలితం లేకపోవటంతో ప్రిన్సిపాల్ ఆఫీసు ముందే ఆమె బలవన్మరణానికి పాల్పడింది. ఆ తర్వాత వేధింపులకు పాల్పడిన వారిని అరెస్టు చేశారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవటంఅంటే ఇదే! ఆ చర్యే ఆ అమ్మాయి చనిపోకమునుపు, ఫిర్యాదు చేసిన వెంటనే తీసుకున్నట్లయితే ఒక విలువైన ప్రాణం దక్కేది. కోల్‌కతా లా కాలేజీ విద్యార్థినిపై సహ విద్యార్థుల అత్యాచారం, ఐఐఎం విద్యార్థినిపై కళాశాల హాస్టల్లోనే అఘాయిత్యం జరిగాయి. బెంగాల్లో అధికార పార్టీకి చెందిన విద్యార్థి సంఘం నాయకులు ఈ దుర్మార్గం వెనుక ఉన్నారని వార్తలు వచ్చాయి.గతేడాది కోల్‌కతాలోని ఆర్జికర్ హాస్పిటల్లో జూనియర్ డాక్టర్ అత్యాచారానికి, హత్యకు గురి కావడం దేశవ్యాప్త ఆందోళనలకు దారి తీసింది. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన ఇంటర్ విద్యార్థిని కళాశాలకు వెళ్లి, గండికోటలో అనుమానాస్పద స్థితిలో విగతజీవిగా కనిపించింది. ఏం జరిగిందో పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది. కొద్ది రోజుల క్రితం ఒక వైద్య కళాశాలలో పారా మెడికల్ విద్యార్థినులు తమను ల్యాబ్ అసిస్టెంటు, మరో ముగ్గురు సిబ్బంది లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్టు ఫిర్యాదు చేశారు. ఏలూరులోని స్పోర్ట్స్ ఆధారిటీ ఆఫ్ ఇండియా కేంద్రంలో క్రీడాకారిణుల పట్ల కోచ్లు లైంగిక వేధింపులకు పాల్పడినట్టు గతనెలలో వచ్చినవార్తలు సంచలనం కలిగించాయి. అధ్యాపకులు విద్యార్థినులను మానసికంగా, శారీరకంగా అవమానిస్తున్న తీరు బాధాకరం. చదువు చెప్పటంఅటుంచి, ఇలాంటి అమానుషాలకు తలపడే పంతుళ్లు ఇంకేం విద్యాబుద్ధులు నేర్పుతారు? అసలు ఎందుకు విద్యా సంస్థలలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి? ఇలాంటి వాటిపై కొద్దిపాటి సమాచారం తమ దృష్టికి వచ్చినా యాజమాన్యాలూ, అధికారులూ తక్షణ చర్యలు తీసుకోవాలి. ఏ పేరుతో ఆలస్యంచేసినా అది దుర్మార్గుల దుశ్చేష్టలకు ఊతమిచ్చినట్టే అవుతుంది. అలాగే, నేర నిరూపణ చేయటంలోనూ పోలీసు యంత్రాంగం తరచూ విఫలమవుతుంది.సంచలనం కలిగించిన అయేషామీరా, రిపితేశ్వరి ఉదంతాలు రెంటిలోనూ నిందితులకు ఇప్పటికీ శిక్ష పడలేదు. దర్యాప్తులో చోటు చేసుకునే వైఫల్యాలు కూడా నేర ప్రవర్తకులకు పరోక్ష ధైర్యాన్నిస్తాయి. దీనికితోడు సినిమాల్లో, వెబ్‌సిరీస్లో, సోషల్ మీడియాలో అడ్డూ అదుపూలేని విషసంస్కృతి ప్రవహిస్తోంది. దీనిని నియంత్రించడంతో పాటు పనిప్రాంతాల్లో, విద్యా వైద్యకేంద్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలి. స్త్రీ పురుష సమానత్వ భావనను ఇంటా బయటా పెంపొందించాలి. అప్పుడే ఆడపిల్లలపై అకృత్యాలకు అడ్డుకట్ట పడుతుంది. •

# ట్రంప్ టారిఫ్ తుఫాన్‌తో మత్స్య రైతులు విలవిల

అప్పన్న గొనప

డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని అమెరికా ప్రభుత్వం భారత సముద్ర ఆహార ఎగుమతులపై విధించిన 50 శాతం అధిక సుంకం నిర్ణయం, భారత్‌అమెరికా వాణిజ్య సంబంధాల్లో ఇప్పటివరకు సంభవించిన అత్యంత తీవ్రమైన పరిణామంగా నిలిచింది. ఈ చర్యతో భారతదేశం నుంచి అమెరికాకు జరిగే సముద్ర ఆహార ఎగుమతులపై తీవ్రమైన ఆర్థిక భారంపడనుంది. సుమారుగా 60,000 కోట్ల రూపాయల విలువైన భారత సముద్ర ఆహార ఎగుమతుల్లో దాదాపు 40 శాతం అమెరికా మార్కెట్‌కి చెందుతున్నదిగా పరిశ్రమ వర్గాల అంచనా.తాజా సుంకాల ప్రభావంతో రూ. 24,000 కోట్ల మేర నష్టంవాటిల్లే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ప్రభావం కేవలం దిగుమతిదారులకే పరిమితం కాకుండా, భారతదేశంలోని లక్షలాది మంది మత్స్యకారులు, రైతులు, ప్రాసెసింగ్ కార్మికులు, రవాణాదారులు, ష్రింక్ రైతుల జీవనాధారాలపై నేరుగా ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారతదేశం ప్రపంచంలో సముద్ర ఆహార ఎగుమతుల ప్రధాన కేంద్రంగా ఉన్నప్పటికీ, అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్య సమతుల్యతకు విఘాతం కలిగించేదిగా మారింది. భారత్‌కు పోటీగా ఉన్న ఎక్వెడార్‌కు 10శాతం, ఇండోనేషియాకు 19శాతం, వియత్నాం దేశానికి 20 శాతం మాత్రమే దిగుమతి సుంకాలు ఉండగా, భారతదేశంపై 50శాతం సుంకం విధించడం భారత ఉత్పత్తులను అమెరికన్ మార్కెట్ నుంచి తప్పించివేసే విధంగా ఉంది. ఇది మన రైతులు తమ ఉత్పత్తులకు సరైన ధరలు పొందలేని పరిస్థితిని కలిగిస్తుంది. పెట్టుబడులకు భద్రత లేకపోవడం వల్ల రైతుల ఉత్సాహం క్షీణిస్తోంది. వ్యవసాయ రంగంపై పెట్టుబడి పెట్టాలన్న సంకల్పాన్ని కూడా ఇది ప్రభావితం చేస్తోంది. ప్రస్తుత తరుణంలో రైతుల్లో తీవ్రమైన సందిగ్ధత నెలకొంది. మార్కెట్‌పై స్పష్టత లేకపోవడం, తక్కువ ధరల భయం, పెట్టుబడి తిరిగి వచ్చే నమ్మకం లేకపోవడం వలన కొందరు రైతులు సాగును పూర్తిగా నిలిపివేశారు. ఇది కేవలం వ్యక్తిగత ఆదాయ నష్టమే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకూ ఆర్థిక సంక్షోభాన్ని తలపెట్టే ప్రమాదం. భారత ప్రభుత్వం ఈచర్యను తీవ్రంగా ఖండించింది. ఇది కేవలం వాణిజ్య చర్య మాత్రమే కాకుండా, దేశ వ్యవసాయ స్వావలంబనకు నేరుగా దెబ్బ తీసే చర్యగా భావించింది. ప్రధాని చేసిన వ్యాఖ్యలు 'రైతుల సంక్షేమం కోసం ఏదైనా త్యాగానికి సిద్ధంగా ఉన్నాను' అన్నవి రైతులకు ధైర్యాన్ని ఇచ్చేలా ఉన్నాయి. వ్యవసాయ రంగం, మత్స్యకారుల హక్కులు, గ్రామీణ జీవన విధానం ఇవన్నింటిపై ప్రభుత్వం అమరంగా నిలవబోతున్నదన్న సంకేతం ఇచ్చింది. అమెరికాతో వాణిజ్య చర్చలు విఫలమైన నేపథ్యంలో, భారత్ తన ప్రాథమిక నిబంధనలను తాము రాజీపడబోమన్న స్పష్టతతో ముందుకు సాగుతోంది. దేశ




ప్రయోజనాల పరిరక్షణకు ఇది తప్పనిసరి. ఈ పరిణామాలు భారత్ విదేశీ మార్కెట్లపై అధికంగా ఆధారపడే విధానాన్ని పునఃపరిశీలించే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే కొత్త మార్కెట్లను అన్వేషించే దిశగా అడుగులు వేసింది. యూరోప్, జపాన్, కొరియా, రష్యా వంటి దేశాల్లో భారత సముద్ర ఆహార ఉత్పత్తులకు అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఆయా దేశాల నిబంధనలకు అనుగుణంగా ప్రాసెసింగ్, క్వాలిటీ, ట్రేసబిలిటీ వంటి అంశాల్లో మెరుగుదల చేయాల్సిన అవసరం ఉంది. దేశీయంగా కూడా వినియోగాన్ని పెంపొందించేందుకు ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాలన్న దిశగా ప్రభుత్వ ఆలోచనలు సాగుతున్నాయి. ఈ రంగంలో ముఖ్యంగా చిన్న రైతులు, మహిళా కార్మికులు పెద్ద ఎత్తున ఆధారపడుతున్నారు. ఈ ఆదాయ ప్రవాహం ఆగిపోవడం గ్రామీణ జీవనరీతిని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టే ప్రమాదాన్ని కలిగిస్తోంది. పరిశ్రమల్లో సగటున 15 శాతం నిల్వగా ఉన్న ఉత్పత్తులు తక్కువ ధరలకు అమ్మకానికి దారి తీయడం, ప్రాసెసింగ్ యూనిట్ల మూతలు పడే ప్రమాదం, ఈ వ్యవస్థలో పనిచేస్తున్నవేలాది మందికి ఉద్యోగ నష్టం కలిగే ప్రమాదం కూడా గమనించదగినది. ప్రస్తుతం ఈ సమస్యకు తక్షణ పరిష్కారం అవసరం. ప్రభుత్వం ఇప్పటికే కొన్ని చర్యలు చేపట్టినప్పటికీ, రుణ మాఫీలు, ఉత్పత్తి సబ్సిడీలు, స్థిరమైన మార్కెట్ లింకేజీలు, ఎగుమతులకు ప్రమాణపత్రాలు, సాంకేతిక మద్దతు వంటి అంశాల్లో మరింత ప్రభావవంతమైన చర్యలు అవసరం. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సమన్వయంతో వ్యవహరించి రైతులకు ప్రత్యక్ష సహాయాన్ని అందించాల్సిన బాధ్యతను మరిచిపోవద్దు. ఈ సంక్షోభం మానవీయ ప్రభావంతో పాటు వ్యవసాయ విధానాలలో ఉన్న లోపాలను బయటపెడుతోంది. పరిమిత మార్కెట్లపై ఆధారపడటం ఎంత ప్రమాదకరమో ఇది బలంగా చాటింది. వ్యవసాయ రంగాన్ని విస్తృతంగా అభివృద్ధి చేయాలంటే మార్కెట్ విస్తరణ, నిల్వ సదుపాయాల పెంపు, విలువ ఆధారిత ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి వ్యూహాలు వెంటనే అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు తాత్కాలికంగా కనిపించినా, దీర్ఘకాలికంగా పరిశ్రమపై తీవ్ర ప్రభావాన్ని చూపవచ్చు. మత్స్య పరిశ్రమ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన భాగంగా ఉంది. ఈ రంగానికి తగిన ప్రోత్సాహం లభించకపోతే గ్రామీణ ఆదాయ భద్రత ప్రమాదంలో పడుతుంది. ప్రభుత్వం, పరిశ్రమలు, రైతులు అందరూ కలిసికట్టుగా ముందుకు సాగినప్పుడే ఈ సంక్షోభానికి స్థిర పరిష్కారం దొరుకుతుంది. ఈ సమస్యను అవకాశంగా మలచుకోవడం మన చేతుల్లోనే ఉంది. ధైర్యవంతమైన నిర్ణయాలు, వ్యూహాత్మక ఆలోచనలు, సమర్థవంతమైన కార్యాచరణ ద్వారా రైతుల జీవనోపాధిని కాపాడుకోవడమే కాకుండా, దేశ ఆర్థిక భద్రతను నిలబెట్టుకోవచ్చు. ఇప్పుడు తీసుకునే చర్యలు, రైతుల పట్ల మన గౌరవాన్ని సూచించేవే కావాలి. మన భవిష్యత్తు వ్యవసాయ రంగాన్ని పునర్నిర్మించేందుకు ఇదే సరైన సమయం. •

# ఓట్ల చోరీకి మరోసారి బిజెపి కుట్ర

## బీహార్ ఓట్ అధికార యాత్రలో రాహుల్ గాంధీ



**పాట్నా, ఆగస్ట్ 17:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం కొత్త కుట్ర జరుగుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆదివారం బీహార్‌లోని సాసారాం లో ఓట్‌అధికార్ యాత్రను ఆయన ప్రారంభించారు. అంతకు ముందు రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఎన్నికల సంఘంపై ఆయన తీవ్ర ఆరోపణలు సంధించారు. బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ద్వారా ఓట్లను తొలగించడం, జోడించడం ద్వారా ఎన్నికల్లో ఓట్లను దొంగిలించడానికి కొత్త కుట్ర జరుగుతోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని రక్షించేందుకే తాను ఈ యాత్ర చేపట్టినట్లు ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా జరిగిన అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఇలాగే ఓట్లు చోరీకి గురయ్యాయని ఆందోళన చెందారు. బీహార్‌లో ఎస్‌ఐఆర్ ద్వారా ఓట్ల దొంగిలించేం దుకు కుట్ర జరుగుతుందని మండిపడ్డారు. దీని ద్వారా దేశ ప్రజలకు ఎన్నికల సంఘం ఎలా ఓట్లను చోరీ చేస్తుందో అర్థమవుతుందని చెప్పారు. అయితే ఓటుచోరీపై తాను ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించిన తర్వాత అఫిడవిట్ సమర్పించాలని తనను ఎన్నికల సంఘం కోరిందన్నారు. కానీ బీజేపీ నేతలు చేసిన ఆరోపణలపై మాత్రం ఎన్నికల సంఘం స్పందించ లేదన్నారు. బీహార్‌లో ఓట్లు చోరీని తాము అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. పేదవారికి ఓటు ఒకటే అధికారమని తెలిపారు. వారి ఓటును లాక్కొనే అధికారం ఎవరికి లేదన్నారు. ఇక ప్రతి ఎన్నికల్లో బిజెపినే ఘన విజయం సాధిస్తుందని తెలిపారు. మహారాష్ట్రతోపాటు పలు ఎన్నికల్లో ఇండియా కూటమి ఘన విజయం సాధిస్తుందని పలు ఒపినియన్ పోల్స్ స్పష్టం చేశాయని గుర్తు చేశారు. 2024, సార్వత్రిక ఎన్నికల్లోనే కాదు.. అంతకు ముందు జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఇండియా కూటమిదే అధికారమని తేల్చి చెప్పాయని పేర్కొన్నారు. కానీ ఆ ఎన్నికలన్నింటిలో బిజెపి భాగస్వామ్య పక్షాలే గెలిచాయని వివరించారు. దాదాపు కోటి ఓట్లను కొత్తగా ఓటర్ల జాబితాలో చేర్చడం ద్వారా ఈ గెలుపు సాధ్యమైందని ఎంపీ రాహుల్ గాంధీ వివరించారు. అయితే బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు ఆందోళన చేస్తాయని తెలిపారు. మరికొన్ని నెలల్లో జరగనున్న బీహార్ అసెంబ్లీఎన్నికలు జరగనున్నాయని పేర్కొన్నారు. వాటి లక్ష్యంగా ఓటు హక్కు తొలగించేందుకు ఎన్నికల సంఘం తన వంతు ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ అధికార్ యాత్ర ప్రారంభ కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాష్ట్రీయ జనతాదళ్ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్, ఆ పార్టీ నేత తేజస్వీ యాదవ్‌తోపాటు ఇండియా కూటమికి చెందిన నేతలు పలువురు పాల్గొన్నారు. ఆగస్ట్ 17వ తేదీన సాసారాంలో ప్రారంభమైన ఈ యాత్ర సెప్టెంబర్ 1వ తేదీతో పట్నాలో ముగియనుంది.

## భారత్ గడ్డపైకి అడుగుపెట్టిన శుభాంశు శుక్లా

### ఢిల్లీ సీఎం, కేంద్ర మంత్రులు ఘనస్వాగతం

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** యాక్సియం-4 మిషన్‌తో భారత రోదసి చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యోమగామి శుభాంశు శుక్లా భారత్‌కు చేరుకున్నారు. అంతరిక్ష యాత్ర విజయవంతమయ్యాక అమెరికాలో ఉన్న ఆయన, ఆదివారం తెల్లవారుజామున స్వదేశానికి విచ్చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు భార్య కామ్నా శుక్లా, కుమారుడు సమక్షంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా శుభాంశుకు ఘన స్వాగతం పలికారు. శుభాంశుశుక్లా స్వదేశానికి చేరుకోవడం భారత్‌కు గర్వకారణమైన క్షణంగా కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ అభివర్ణించారు. భారతదేశానికి గర్వకారణమైన క్షణం అని ఇస్రోకు కీర్తినిచ్చే క్షణం అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఇందుకు దోహదపడిన వ్యవస్థకు కృతజ్ఞత తెలుపుతూ, దేశ అంతరిక్ష పరిశోధనలు భారత్‌ సైతం చేయగలిగిందన్నారు. భారతమాత దిగ్గజ పుత్రుడు శుభాంశు శుక్లా ఈరోజు తెల్లవారు జామున ఢిల్లీలో అడుగుపెట్టారు. ఆయనతో పాటు మిషన్ గగన్‌యాన్‌కు ఎంపికైన వ్యోమగాముల్లో ఒకరైన గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కూడా ఉన్నారని మంత్రి తెలిపారు. యాక్సియం4 మిషన్ విజయవంతం తర్వాత తొలిసారి భారత్‌కు వస్తున్నానంటూ శుక్లా శనివారం పోస్టు ద్వారా తెలిపారు. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు విమానంలో కూర్చున్నప్పుడు భావోద్వేగానికి గురైనట్లు చెప్పారు. మిషన్ కోసం గతేడాది నుంచి తన స్నేహితులు, కుటుంబసభ్యులకు దూరంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇది తనను ఎంతో బాధించిందని పేర్కొన్నారు. వారిని కలిసి తన అనుభవాలను పంచుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని అన్నారు. అయితే భారత్‌కు వచ్చిన శుక్లా, సోమవారం మోదీతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈనెల 23న జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవంలో కూడా శుక్లా పాల్గొంటారని వెల్లడించాయి. ఇటీవల నిర్వహించిన యాక్సియం4 మిషన్ ప్రయోగం విజయవంతమైంది. రోదసిలో 18 రోజులు గడిపి మన వారికి ప్రయోజనం కలిగించే పలు ప్రయోగాలను నిర్వహించిన శుభాంశు శుక్లా బృందం జులై 15న భూమికి తిరిగి వచ్చింది. ఆ వెంటనే వ్యోమగాములను క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కి (పోలండ్), టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు.

## కతువా జిల్లాలో భారీ వరదలకు నలుగురి మృతి

**శ్రీనగర్, ఆగస్టు 17:** జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గత రాత్రి కురిసిన భారీ వర్షాలు నలుగురి ప్రాణాలను బలితీసుకున్నాయి. మరికొందరు గాయపడ్డారు. వరద ప్రవాహం కారణంగా ఒక గ్రామానికి బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా జిల్లాలో తీవ్ర నష్టం వాటిల్లింది. రైల్వే ట్రాక్‌తో పాటు జాతీయ రహదారి కూడా దెబ్బతిన్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌పైనా వరద ప్రభావం పడిందని ఆయన 'ఎక్స్'లో వెల్లడించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, పోలీస్, సైనిక, పారామిలిటరీ బలగాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ దుర్ఘటనపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని, బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో కథువా జిల్లా యంత్రాంగం ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. నదులు, వాగులు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించింది. ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉన్నందున అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు మానుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# హిమాలయ రాష్ట్రాల్లో క్లౌడ్‌బరస్ట్‌లతో అతలాకుతలం



**శ్రీనగర్, ఆగస్టు 17:** జమ్మూకాశ్మీర్‌లో గత కొన్ని రోజుల నుంచి క్లౌడ్ బరస్ట్‌లు వరుస విషాదాలకు దారి తీస్తున్నాయి. గత గురువారం కిష్త్వార్‌లోని పషోటి గ్రామంలో క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. దీంతో 60 మంది చనిపోయారు. శనివారం కథువా జిల్లాలో క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో నలుగురు చనిపోయారు. ఇలా జమ్మూకాశ్మీర్‌లో విలయం సృష్టిస్తున్న క్లౌడ్ బరస్ట్‌తో అపారనష్టం జరిగింది. అతి తక్కువ సమయంలో,అతి తక్కువ భౌగోళిక ప్రాంతంలో, అతి ఎక్కువ వర్షపాతం పడటాన్ని క్లౌడ్ బరస్ట్‌గా అంటారు. 20 నుంచి 30 చదరపు కిలోమీటర్ల పరిధిలో గంటలకు 10 సెంటీ మీటర్ల వర్షపాతం పడితే దాన్ని క్లౌడ్ బరస్ట్ అంటారు. ఒక్కోసారి ఉరుములు, పిడుగులతో భారీ స్థాయిలో కురిసే వర్షాల కారణంగా వరదలు సైతం వస్తుంటాయి. స్వల్ప పరిధిలో రెండు గంటల వ్యవధిలో 5 సెంటీమీటర్ల లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం పడితే మినీ క్లౌడ్ బరస్ట్ అంటారు. అయితే, తక్కువ సమయంలో కురిసే అన్ని భారీ వర్షాలను క్లౌడ్ బరస్ట్‌లు అనలేము. కొన్ని వాతావరణ పరిస్థితులు ఉంటేనే క్లౌడ్ బరస్ట్ అంటాము. ఋతు పవనాలు దేశంలోకి ప్రవేశం చినపుడు అరేబియా సముద్రంలోనుంచి తేమతో కూడిన గాలులు వీస్తాయి. ఇవి అధిక తేమ కలిగిన మేఘాలుగా మారతాయి. వాతావరణం లో వేడి వల్ల ఈ మేఘాలు కరుగుతూ ఉం టాయి. అలా కరిగి, కరిగి మేఘాలు బరువెక్కుతాయి. ఏదో ఒక చోట పేలిపోతాయి. అలా తక్కువ ప్రాంతంలో, తక్కువ సమయంలో భారీ వర్షం పడి వినాశనం జరుగుతుంది. 1970లో ఉత్తరాఖండ్‌లోని అలకనందా లోయలో క్లౌడ్ బరస్ట్ కారణంగా భారీ విధ్వంసం జరిగింది. అలకనందా నదికి వరద నీరు పోటెత్తటంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. 1993లో ఉత్తరాఖండ్‌లోని పితోరాఘర్ జిల్లా, మల్ప గ్రామంలో క్లౌడ్ బరస్ట్ కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో కైలాష్ మానస సరోవర్ యాత్రకు వెళుతున్న భక్తులు చాలా మంది చనిపోయారు. 2003 నుంచి 2004 మధ్య కాలంలో ఉత్తరాఖండ్‌లోని కులు, చమలీ ఏరియాలో మినీ క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. దీంతో కొండ ప్రాంతంలో ఆస్తి నష్టం సంభవించింది. 2010లో లడఖ్‌లోని లేహ్‌లో క్లౌడ్ బరస్ట్ కారణంగా పెను విషాదం చోటుచేసుకుంది. దాదాపు 200 మంది చనిపోయారు. వందల మంది గాయపడ్డారు. 2022 జమ్మూకాశ్మీర్‌లో అమర్‌నాథ్ గుహ దగ్గర క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలువురు చనిపోయారు.

## బిగ్‌బాస్ విజేత ఎల్విస్ యాదవ్ ఇంటివద్ద కాల్పులు



**గురుగ్రామ్, ఆగస్టు 17:** ప్రముఖ యూట్యూబర్, బిగ్ బాస్ ఓటీటీ 2 విజేత ఎల్విష్ యాదవ్ నివాసం వద్ద కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. హర్యానాలోని గురుగ్రామ్‌లో ఉన్న ఆయన ఇంటిపై ఈ తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఉదయం 5 నుంచి 6 గంటల మధ్య బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు ఎల్విష్ యాదవ్ ఇంటిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. దాదాపు 25 నుంచి 30 రౌండ్ల వరకు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని వారు తెలిపారు. కాల్పులు జరిగిన సమయంలో ఎల్విష్ యాదవ్ (27) పని నిమిత్తం హర్యానా బయట ఉన్నట్లు తెలిసింది. అయితే, ఆయన కుటుంబ సభ్యులు, ఇంటి కేర్‌టేకర్ మాత్రం ఇంట్లోనే ఉన్నారు. ఈ భవనంలోని రెండు, మూడు అంతస్తుల్లో ఎల్విష్ కుటుంబం నివాసం ఉంటోంది. ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే గురుగ్రామ్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. సెక్టార్56 పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై ఉన్నతాధికారులు దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ ఘటనా స్థలం నుంచి ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించింది. దుండగులను గుర్తించేందుకు సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కాగా, ఈ ఘటనపై ఎల్విష్ యాదవ్ కుటుంబ సభ్యులు ఇంకాఅధికారికంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది. దుండగులు ఎందుకు కాల్పులకు తెగబడ్డారనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

## తెరుచుకున్న శబరిమలై: ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రధానాచార్యులు




**పతనంతిట్ట, ఆగస్టు 17:** కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్పస్వామి ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. వార్షిక చింగం మాస పూజల కోసం శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఆలయ పూజారులు తలుపులు తెరిచారు. ప్రధాన పూజారి అరుణ్ కుమార్ నంబూద్రి తంత్రి కందరరు మహేష్ మోహనరు సమక్షంలో ఆలయ దీపాలను, ఆళి (పవిత్ర అగ్నిగుండం)ను వెలిగించారు. వేలాది మంది అయ్యప్ప భక్తులు భారీ వర్షాన్ని లెక్కచేయకుండా వేడుకను తిలకించారు. చింగం మాస పూజలను పూర్తి అయ్యే వరకు పడిపూజ కార్యక్రమం ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటలకు జరుగుతుంది. అదే సమయంలో సెప్టెంబర్ 20న పంబా నది ఒడ్డున గ్లోబల్ అయ్యప్ప సమావేశం జరుగుతుందని దేవాదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ ప్రకటించారు. ఇంత పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి కాబట్టి, ఒక చారిత్రాత్మక కార్యక్రమంగా నిలవనుందని తెలిపారు. వివిధ దేశాల నుంచి 3,000 మంది ప్రతినిధులు హాజరవుతారని భావిస్తున్నట్లు తెలిపారు. రూ.1,300 కోట్ల విలువైన మాస్టర్ ప్లాన్ సిద్ధంచేసామన్నారు. శబరిమల ప్రపంచ ఖ్యాతిని పెంచే లక్ష్యంతో జరిగే ఆ సమావేశంలో కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొంటారు. శబరిమల సంప్రదాయాలను కాపాడుతూ, భక్తుల ప్రయోజనాలను గౌరవిస్తూ, శబరిమలని ప్రపంచ తీర్థయాత్ర కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి వాసవన్ పేర్కొన్నారు. ప్రభుత్వం రూ.1,300 కోట్ల విలువైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించిందని తెలిపారు. అందులో శబరిమల విమానాశ్రయం, కొత్త రైల్వే లైన్ సహా వివిధ ప్రణాళికలు ఉన్నాయి. విమానాశ్రయం 2028 నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో పథనంతిట్టలో ప్రధాన నిర్వాహక కమిటీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. పంబా, పెరునాడ్, సీతాథోడ్‌లలో అదనపు కార్యాలయాలు ఉంటాయి. ప్రతినిధులకు బస్సుల ద్వారా రవాణా, వసతి ఏర్పాట్లు చేయనున్నారు. పంబాతో సహా ఆ ప్రాంతంలోని ఆసుపత్రులలో ఆధునిక వైద్య సౌకర్యాలు కల్పించనున్నారు. వాహనాల పార్కింగ్ కొండపై ఉండనుంది. స్వచ్ఛంద సంస్థలు పారిశుధ్యం, శుభ్రపరిచే విషయంలో సహాయం చేస్తాయి.



## పాకిస్థాన్‌లో పట్టాలు తప్పిన ప్యాసింజర్‌రైలు

**కరాచి, ఆగస్టు 17:** పొరుగుదేశంలో ప్యాసింజర్‌రైలు పట్టాలు తప్పింది. ఆదివారం పెషావర్ నుంచి కరాచీకి వచ్చే ప్యాసింజర్‌రైలులోని నాలుగు బోగీలు ఆకస్మికంగా పట్టాలు తప్పాయి. లోద్రాన్ రైల్వేస్టేషన్ సమీపంలో ప్రయాణీకులతో బయలుదేరిన ప్యాసింజర్‌రైలు ఆకస్మికంగా పట్టాలు తప్పింది. ఈరైలు కరాచీకి చేరుకునేలోపే ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్నవెంటనే రైల్వే అధికారులు సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. పట్టాలు తప్పిన బోగీల్లో ఉన్న ప్రయాణీకులను బయటకు తీసారు. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించారు. లోద్రాన్ డిప్యూటి కమయిషనర్ డాక్టర్ లుబ్నా నజీర్‌ప్రకారం మరో ఇద్దరు వ్యక్తులపరిస్థితి విషమంగా ఉంది. వీరంతా ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. ప్రమాదానికి గల కారణం ఇంకా నిర్ధారణ కాలేదు. ప్రమాదం తర్వాత ఈమార్గంలో కొన్ని గంటలపాటు రాకపోకలు నిలిపివేసారు. ట్రాక్ పునరుద్ధరించి తర్వాతనే రైళ్ల రాకపోకలు ప్రారంభం అయ్యాయి.

## ప్రియురాలికోసం కట్టుకున్న భార్యనే కడతేర్చిన బిజెపినేత

**అజ్మీర్, ఆగస్టు 17:** ప్రియురాలితో కలిసి జీవించేందుకు కట్టుకున్న భార్యనే అత్యంత దారుణంగా హత్య చేశాడో భర్త. ఈ ఘోరాన్ని కప్పిపుచ్చేందుకు దోపిడీ నాటకం ఆడినా, పోలీసుల విచారణలో అసలు నిజం బయటపడింది. రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. బిజెపినేత అయిన భర్తే ఈ దారుణానికి పాల్పడటం గమనార్హం. అజ్మీర్‌కు చెందిన బిజెపి నాయకుడు రోహిత్ సైనీకి సంజు అనే మహిళతో వివాహమైంది. అయితే, అదే ప్రాంతానికి చెందిన రీతూ సైనీ అనే మరో మహిళతో రోహిత్‌కు కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో తమ బంధానికి భార్య సంజు అడ్డుగా ఉందని భావించారు. ఈ నెల 10న సంజు అనుమానాస్పద స్థితిలో ఇంట్లో మరణించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టగా రోహిత్ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. ఇంట్లోకి చొరబడిన దొంగలు, తన భార్యను హత్య చేసి విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే, అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో నేరాన్ని అంగీకరించాడు. ఈ కేసు వివరాలను అడిషనల్ ఎస్పీ (రూరల్) దీపక్ కుమార్ మీడియాకు వెల్లడించారు. "ప్రియురాలు రీతూ ప్రోద్బలంతోనే రోహిత్ తన భార్యను హత్య చేసినట్లు అంగీకరించాడు. తమ మధ్య నుంచి సంజును తొలగించుకోవాలని రీతూ ఒత్తిడి చేయడంతో ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిపాడు.

ఘటన జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించామని ఆయన వివరించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రోహిత్ సైనీతో పాటు, హత్యకు ప్రేరేపించిన అతని ప్రియురాలు రీతూ సైనీని కూడా అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని మరింత లోతుగా విచారిస్తున్నారు.



## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు దక్షిణ కొరియా మద్దతు

### జైశంకర్ ధన్యవాదాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** పహల్గామ్ ఉగ్రదాడి, ఉగ్రవాదంపై పోరాటంలో దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి చో హ్యున్ భారత్‌కు సంఘీభావం ప్రకటించారు. భారత ప్రభుత్వం, ప్రజలతో తమ దేశం నిలుస్తుందని పేర్కొన్నారు. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చో హ్యున్ దక్షిణ కొరియా ఉగ్రవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ విషయంలో తాము చాలా కఠినంగా, దృఢంగా ఉన్నామన్నారు. ఏదైనా ఉగ్రవాద దాడిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. భారత ప్రభుత్వం, భారత ప్రజలతో ఉంటామన్నారు.

## న్యూయార్క్‌లో కాల్పుల కలకలం.. ముగ్గురి మృతి

**వాషింగ్టన్, ఆగస్టు 17:** అమెరికాలో కాల్పుల ఘటన కలకలం రేపింది. న్యూయార్క్ సిటీలోని రద్దీగా ఉన్న ఓ క్లబ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. న్యూయార్క్ సిటీలో తుపాకీ హింస రికార్డు స్థాయిలో తగ్గిపోయిన వేళ ఈ కాల్పులు చోటుచేసుకున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో క్లబ్‌లో ఓ వివాదం చెలరేగిన తర్వాత పలు ఆయుధాలతో ఈ కాల్పులు జరిగినట్లు అనుమానిస్తున్నామని న్యూయార్క్ పోలీసు కమిషనర్ జెస్సికా టిష్ వెల్లడించారు.

ఘటనాస్థలం నుంచి 36 షెల్ కేసింగ్‌లను, సమీపంలోని వీధిలో ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతుల వయసు 27 నుంచి 61 యేళ్ల మధ్యలో ఉంటుందని చెప్పారు. గాయపడిన వారిలో ముగ్గురు మహిళలు ఉన్నారని, వారంతా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.



## పదవీ కాంక్షలేదు: ఆసిఫ్ మునీర్

**ఇస్లామాబాద్, ఆగస్టు 17:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ తనను తాను రక్షకుడిగా చెప్పుకునేందుకు తాపత్రయపడుతున్నారు. రాజకీయాలు, అత్యున్నత స్థానాలపై పదవీ కాంక్ష లేదని ప్రకటించడం గమనార్హం. దేశ సేవ కోసమే భగవంతుడు తనను పుట్టించాడని.. ప్రజలను కాపాడటం తప్ప తనకు మరో ఆలోచన ఉండదని అన్నారు. పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీని బలవంతంగా గద్దెదించి దేశ సైనిక దళాల ప్రధానాధికారి ఆసీం మునీర్ ఆ స్థానాన్ని ఆక్రమించనున్నారంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలపై ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో రాజకీయగా ఉద్రిక్తతలను సృష్టించడానికి కొందరు ఇటువంటి వార్తలను ప్రచారం చేస్తున్నారన్నారు.

## గాజా పౌరులకు వీసాలు నిలిపివేసిన యుఎస్

**వాషింగ్టన్, ఆగస్టు 17:** ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గాజా ప్రజలపై మరో పిడుగు పడింది. ఇకపై గాజా ప్రజలకు వీసాలు నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన అనేకమంది ప్రజలు చికిత్స కోసం యుఎస్‌కు వస్తున్నారని ట్రంప్ యంత్రాంగానికి ఫిర్యాదు అందడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తాత్కాలిక వైద్య-మానవతా వీసాలను జారీ చేయడానికి ఉపయోగించే ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా గాజా ప్రజలకు అన్నిరకాల వీసాలు నిలిపివేస్తున్నామని అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది.



# సంక్షిప్తంగా..


## 4 కిలోమీటర్ల టార్గెట్‌ను ఛేదించిన ఉక్రెయిన్ సైనికుడు

### రష్యా సైనికుడిని హతమార్చి రికార్డు



**హైదరాబాద్, ఆగస్టు 17:** రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు చెందిన ఓ స్నైపర్ అసాధారణ ప్రతిభతో ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసు కున్నాడు. ఏకంగా 13,000 అడుగుల (దాదాపు 4 కిలోమీటర్లు) దూరం నుంచి రష్యా సైనికుడిని గురితప్పకుండా కాల్చిచంపి చరిత్ర సృష్టించాడు. ఈ విషయాన్ని కీవ్‌పోస్ట్ పత్రిక అధికారికంగా ప్రకటించింది. పొక్రొవ్స్క్ ప్రాంతంలో ఆగస్టు 14న ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సైనిక వర్గాలు తెలిపాయి. స్థానికంగా తయారు చేసిన శక్తివంతమైన ఎలిగేటర్ 14.5 ఎంఎం రైఫిల్‌తో ఈ స్నైపర్ ఇద్దరురష్యాసైనికులను మట్టుబెట్టినట్లు సమాచారం. ఈ క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతం చేయడానికి ఆర్టిఫి షియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డ్రోన్ టెక్నాలజీనిఉపయోగించుకున్నట్లు మిలిటరీ జర్నలిస్ట్ యూరి బుట్సోవ్ ధ్రువీకరించారు.

## ఒడిశాలో 20 మెట్రిక్ టన్నుల బంగారం నిక్షేపాలు



**భువనేశ్వర్, ఆగస్టు 17:** ఒడిశాలో భారీ స్థాయిలో బంగారు ఖనిజ నిక్షేపాలు బయటపడినట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ప్రకటించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సుమారు 10 నుంచి 20 మెట్రిక్ టన్నుల నిక్షేపాలను గుర్తించినట్లు తెలిపింది. సుందర్‌గఢ్, నవరంగ్ పూర్, కియోంజర్, దేవగఢ్ జిల్లాల్లో ఇప్పటికే బంగారు నిక్షేపాల వెలికితీత పెద్ద ఎత్తున కొనసాగుతోంది. ఈ క్రమంలో మైనింగ్ కార్పొరేషన్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ పరిశోధనలు చేపట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ధర చుక్కలను అంటుతున్న వేళ ఒడిశాలో బంగారు నిక్షేపాల సంగతి బయటపడడంతో అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భారతీయ తాలిబన్ 'ఆర్‌ఎస్‌ఎస్'

### కాంగ్రెస్ సీనియర్‌నేత బికె హరిప్రసాద్



**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)ను 'ఇండియన్ తాలిబన్లు'గా అభివర్ణిస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత బీకే హరిప్రసాద్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆరెస్సెస్‌పై ప్రశంసలు కురిపించిన నేపథ్యంలో హరిప్రసాద్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై అధికార బిజెపి తీవ్రంగా స్పందించింది. జాతీయవాద సంస్థలను అవమానించడం, నిషేధిత సంస్థలను ప్రేమించడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని ఘాటుగా బదులిచ్చింది. కర్ణాటక ఎమ్మెల్సీ అయిన బీకే హరిప్రసాద్ మాట్లాడుతూ "దేశంలో శాంతికి భంగం కలిగించేందుకు వారు (ఆరెస్సెస్) ప్రయత్నిస్తున్నారు. నేను ఆరెస్సెస్ ను తాలిబన్లతో మాత్రమే పోలుస్తాను. వాళ్లు భారతీయ్కతాలిబన్లు. అలాంటి వారిని ప్రధాన మంత్రి ఎర్రకోటనుంచి ప్రశంసిస్తున్నారని విమర్శించారు.

## 13 మంది చనిపోయారు: అంగీకరించిన పాకిస్థాన్

**కరాచి, ఆగస్టు 17:** భారత వాయుసేన జరిపిన ఆపరేషన్ సిందూర్ మెరుపు దాడుల్లో తమకు భారీ నష్టం వాటిల్లిన విషయాన్ని పాకిస్థాన్ ఎట్టకేలకు పరోక్షంగా అంగీకరించింది. ఈ సైనిక చర్యలో 13 మంది సైనిక సిబ్బంది సహా 50 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్టు ఘటన జరిగిన మూడు నెలల తర్వాత అంగీకరించింది. తమ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మరణించిన సైనికులకు మరణానంతరం శౌర్య పతకాలను ప్రదానంచేసి, ఈ నిజాన్ని ప్రపంచం ముందుఒప్పుకుంది. అధ్యక్ష భవనంలో జరిగిన ఓకార్యక్రమంలో ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆపరేషన్ సిందూర్ సమయంలో మరణించిన సైనిక సిబ్బందికి మరణానంతరం పురస్కారాలు అందజేశారు. ఈదాడుల్లో భోలారీ ఎయిర్‌బేస్‌పై జరిగిన దాడిలో మరణించిన స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసఫ్‌కు 'తమ్ఘా ఇబసాలత్' పురస్కారాన్ని ప్రకటించారు. ఆయనతో పాటు హవల్దార్ ముహమ్మద్ నవీద్,నాయక్ వకార్ ఖాలిద్, లాన్స్‌నాయక్ దిలావర్ ఖాన్‌లకుమరణానంతరం ఈ పురస్కారాన్ని ఇచ్చారు. భారత దాడులు జరిగిన నూర్‌ఖాన్, సర్గోధా, జాకోబాబాద్, భోలారి,షోర్‌కోట్ వైమానిక స్థావరాల్లో పలువురు గాయపడినట్లు కూడా సమాచారం.

# ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్ లేదు

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 17:** పదేపదే చెప్పిన ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదని, కేవలం తన కుటుంబ సభ్యుల ప్రయోజనాల కోసం హైదరాబాద్ ఫార్మాసిటీ భూములలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న రేవంత్ రెడ్డి ఆకాంక్ష నెరవేరదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఫార్మా సిటీ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ లేని నాయకుడని, ఆయన తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రజాధనం వృధా అవుతుందని ఆయన ఆరోపించారు. ఫార్మా సిటీ కోసం భూములిచ్చిన రైతులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని స్థానంలో ఫ్యూచర్ సిటీ అనే అవాస్తవ, ఊహాజనిత ప్రాజెక్టును ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు. ఇది నిర్లక్ష్య నాయకుడు రాష్ట్రాన్ని పాలిస్తే ఏమవుతుందో దానికి ఫ్యూచర్ సిటీ ప్రచారం ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం, ఒక నిర్దిష్ట ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనం కోసం రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ చట్టాన్ని ఉటంకిస్తూ, తాను రెండేళ్ల క్రితమే అసెంబ్లీలో ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించానని గుర్తుచేశారు. అయినా, రేవంత్ ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు పీఆర్ కోసం ఖర్చు చేసి, ఇప్పుడు తీవ్రమైన న్యాయపరమైన అడ్డంకులను ఎదుర్కొంటోందని, చివరికి అధికారులు కూడా దీనిని అంగీకరిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 56 గ్రామాల పరిధిలో హైదరాబాద్ ఫార్మసిటీ కోసం 20,000 ఎకరాలతో ప్రతిపాదనలను తయారుచేసింది, స్థానిక రైతులు రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి వచ్చి తమ భూములను హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమంది తమ భూములు ఇవ్వడం పైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తే కాంగ్రెస్ పార్టీ మాత్రం అధికారంలోకి రాగానే హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం సేకరించిన ప్రతి ఎకరాన్ని తిరిగి రైతన్నలకు ఇస్తామని హామీలు ఇచ్చి, ఇప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు స్నేహితుల కోసం అవే భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ వారిని నిండా మోసం చేసిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నలు ఫార్మా కంపెనీల కోసం కేటాయించిన భూముల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్మా సిటీ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనంతో మౌలిక వసతుల కల్పనను ప్రారంభించినా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం దానిని పక్కనపెట్టి, ఇప్పుడు ఫ్యూచర్ సిటీ పేరుతో భూములను అక్రమంగా రియల్ ఎస్టేట్ కు మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ చర్యలు ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని, దీని వల్ల ప్రజలు, ముఖ్యంగా రైతులు నష్టపోతారని కేటీఆర్ హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు, రైతులకు స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.

# యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

## ప్రభుత్వానికి తెలంగాణ రైతు సంఘం డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని.. తెలంగాణ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రైతులకు యూరియా కొరత లేకుండా, అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అద్యక్షులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ డిమాండ్ చేశారు. వర్షాలు సకాలంలో రావడంతో జలాశయాలు, చెరువులు, కుంటల్లో నీళ్లు ఉండడంతో వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని.. ఈ నేపథ్యంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండాలన్నారు. కానీ రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో యూరియా కోసం సహకార సంఘాలు, డీలర్ షాపుల దగ్గర రైతులు బారులు తీరి నిలబడి ఉంటున్నారని అన్నారు.

సకాలంలో ఎరువులు అందుబాటులో లేకపోతే పంటలు దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందన్నారు. యూరియా కొరతను అదునుగా చూపించి అనేకమంది డీలర్లు 40 కిలోల యూరియా బస్తాకు రూ. 267 వసూలు చేయాల్సి ఉండగా .. అదనంగా వసూలు చేస్తున్నట్లు రైతాంగం చెబుతున్నారని తెలిపారు.

కృత్రిమ కొరత సృష్టించి కూడా డీలర్లు రైతులను ఇబ్బంది పెడుతున్నారని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 2025 ఏప్రిల్–జూన్ నెలలకు 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించిందని.. కానీ వాస్తవంగా కేవలం 3.06 లక్షల టన్నులు మాత్రమే అందించిందన్నారు. దీంతో 1.94 లక్షల టన్నుల లోటు ఏర్పడిందన్నారు. .ప్రస్తుతం ఈ లోటు 2.24 లక్షల టన్నులకు పెరిగిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన కోటా ప్రకారం యూరియాను, ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు రైతాంగం పూనుకుంటుందన్నారు.

# వరంగల్ పంచాయతీపై నలుగురు సభ్యుల కమిటీ

## పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

# సమస్య పునరావృతమైతే రాజగోపాల్‌రెడ్డి చర్యలు తప్పవు

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డికి పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం మల్లు రవి మీడియాతో మాట్లాడారు. రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తనతో మాట్లాడారని చెప్పారు. చాలా సేపు చర్చించినట్లు తెలిపారు. సమస్య రిపీట్ కాకుండా ఒకసారి చెప్పి చూస్తాం, మళ్లీ రిపీట్ అయితే తప్పకుండా రాజగోపాల్ రెడ్డిపై చర్యలు తీసుకుంటామని మల్లు రవి తెలిపారు. అనంతరం వరంగల్ పంచాయితీపై మల్లు రవి వివరణ ఇచ్చారు. వరంగల్‌కి నలుగురిని పంపించబోతున్నట్లు తెలిపారు. ఎవరెవరు వెళ్లాలి అనేది పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని అన్నారు. వరంగల్ జరుగుతున్న అంశాలపై సీనియర్ కాంగ్రెస్ నాయకులతో కమిటీ వేయమని టిపిసిసి చీఫ్‌కు లేఖ రాశానని తెలిపారు. తాను పార్టీలో మంటలు పెట్టడానికి లేను, నా పని ఫైరింజన్ అని చెప్పారు. మంత్రి పదవి విషయంలో పదే పదే రాజ్ గోపాల్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. ముఖ్యంగా సిఎం రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యల్ని కమిటీ సీరియస్‌గా తీసుకుందన్నారు. ఇక మరోవైపు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా మురళి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆయన వైఖరిపై క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు. దీనిపైనా క్రమశిక్షణ కమిటీ సమావేశంలో చర్చించారు. గజ్వేల్ దగ్గర డిసిసి నర్సా రెడ్డిదాడి చేశాడని మా దృష్టికి వచ్చింది దానిపై వివరాలు సేకరించామన్నారు. నలుగురు సభ్యులతో కూడిన కమిటీశ్యాం మోహన్ కమిటీ కన్వీనర్‌గా ఉంటారు. వచ్చే మంగళవారం సమావేశమై రాజగోపాల్ రెడ్డి అంశంపై చర్చిస్తామని మల్లు రవి స్పష్టం చేశారు.

# రాష్ట్రానికి యూరియా అందజేతపై కేంద్రం తీరు బాగా లేదు

## ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** రాష్ట్రానికి యూరియా ఇచ్చే విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరు బాగాలేదని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వైఖరి కారణంగానే తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరత ఉందన్నారు. కేంద్రమంత్రి నడ్డాకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తాను ఐదారు సార్లు లేఖలు కూడా రాశానని తెలిపారు. యూరియా కొరత లేకుండా సరఫరా చేయాలని కేంద్రమంత్రి అధికారులను ఇచ్చారని, అయినప్పటికీ ఇంతవరకు మంత్రి చెప్పినట్లు ఎరువులు రాష్ట్రానికి సరఫరా కాలేదన్నారు. రాష్ట్రానికి ఖరీఫ్ సీజన్‌కు 9.80లక్షల మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉందన్నారు. జులై వరకు 6.60లక్షల మెట్రిక్ టన్నులు యూరియా రాష్ట్రానికి ఇవ్వాల్సి ఉంది, కానీ ఇప్పటి వరకు ఇచ్చిన యూరియా కేవలం 4.36 లక్షల మెట్రక్ టన్నులు మాత్రమే అన్నారు. మకర్ ద్వారా ప్రొటెస్ట్ కూడా చేస్తాం....కచ్చితంగా రైతుల పక్షాన పోరాటం చేస్తాం...కేంద్రంపై ఒత్తిడి పెంచుతామని అన్నారు.

# కట్టిన ఇల్లులా.. పెట్టిన పొయ్యిలా కాళేశ్వరం!



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

## కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యం: మాజీమంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** కట్టిన ఇల్లులా పెట్టిన పొయ్యిలా కాళేశ్వరం ఉంటే ఈ ప్రభుత్వం నీళ్లను సముద్రంలోకి వదిలి పడావు పెట్టిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన రాజకీయాల కోసం రైతులపై పగ,ప్రతీకారం తీర్చుకుంటుందన్నారు. ఎదైన ఉంటే మాపై కక్షసాధింపు చేయాలి తప్పా రైతులపై కాదని తెలిపారు.

అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు చేయాలి తప్ప కీడు చేయకూడదన్నారు.నంది మేడారంలో కటక ఒత్తితే రోజుకు రెండు టీఎంసీల నీళ్లు వచ్చి మిడ్ మానేరు లో పడతాయన్నారు. వారం రోజుల క్రితమే ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఉత్తరం రాశానన్నారు. అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లు ఖాళీగా ఉన్నాయి. నీళ్లను ఒడిసి పట్టండి వెంటనే మోటర్లు ఆన్ చేయండి అని ప్రభుత్వానికి విన్నపం చేశాము అయిన ప్రభుత్వం మోటర్లు ఆన్ చేయలేదు. ఇప్పుడు ఎల్లంపల్లి గేట్లెత్తి నీళ్లను సముద్రంలోకి వదులుతున్నారన్నారు.నీళ్ళ విలువ రైతులకు తెలుస్తది కాని ఉత్తంకుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డికి ఏం తెలుసన్నారు.కేసిఆర్ కేంద్ర మంత్రిగా ఉన్నా, ముఖ్యమ ంత్రిగా ఉన్నా వ్యవసాయం చేసే ఒక రైతు ఆయన రైతు గనుకే ప్రతి చుక్కను ఒడిచి పట్టి నీళ్లను రైతులకు అందించారు.

కాంగ్రెస్ నేరపూరిత నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. కాళేశ్వరం కూలిందని చేసిన దుష్ప్రచారాన్ని కప్పిపుచ్చు కోవడానికే మోటర్ల ఆన్ చేయడం లేదు. వరద కాలువ ఒపెన్ చేసి మిడ్ మానేరు ఎల్ఎండి ఎందుకు నింపడం లేదో తెలపాలన్నారు. రిజర్వాయర్లన్ని నింపితే యాసంగిలో లక్షల ఎకరాల్లో పంట పండుతుందన్నారు. ఎరువులు, పంట భీమా,కరెంటు ఇవ్వడానికి ఆఖరికి నీళ్లను ఇచ్చేందుకు కూడా ఈ ప్రభుత్వం రైతులను గోసపెట్టుకుంటుదన్నారు. పదేళ్లలో ఎన్నడు రైతులు ఎరువు బస్తాల కోసం అరుగుల మీద పడుకోలేదని,కాంగ్రెస్ వచ్చింది మార్పు వచ్చింది మళ్ళీ పాత రోజులు వచ్చాయన్నారు.

చెప్పులను లైన్లో పెట్టి ఆరుగుల మీద పడుకునే రోజులోచ్చాయన్నారు.నేను రాజకీయాల కోసం మాట్లాడటం లేదు రైతుల కోసం మాట్లాడుతున్నా రైతుల పక్షాన మాట్లాడుతన్నా మాజీ నీటి పారుదలశాఖ మంత్రిగా అవగాహనతో మాట్లాడుతున్నానని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కాళేశ్వరం మోటర్లను ఆన్ చేయడం చేతకాకపోతే మేమే వేలాది మంది రైతులతో కదిలి వెళ్లి మోటార్లను ఆన్ చేస్తామని హెచ్చరించారు.

# ఆర్ఎస్ఎస్‌పై రాహుల్‌గాంధీ విమర్శలు తగదు

## బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ఆర్ఎస్ఎస్‌పై రాహుల్‌గాంధీ విమర్శలు చేయడం తగదని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అన్నారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ప్రధాని నరేంద్ర మోడీ జాతీయ పతాక ఆవిష్కరణ తర్వాత జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆ ప్రసంగంలో ఆర్ఎస్ఎస్ సేవలను కొనియాడుతూ ప్రస్తావించారు. దీనిపై రాహుల్ గాంధీ రకరకాల విమర్శలు గుప్పించారని, రకరకాల మాటలు కూడా మాట్లాడారన్నారు. రాహుల్‌గాంధీ చరిత్ర తెలిసి మాట్లాడాడా? లేక చరిత్ర తెలియక మాట్లాడాడా? అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో తాను కొత్త పంథాను చూపించుకోవడం కోసం మాట్లాడాడా? అన్నది అర్థం కావడం లేదన్నారు. స్వయంగా ఆయన తాత జవహర్ లాల్ నెహ్రూ, చైనా యుద్ధ సమయంలో ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు చేసిన సేవలను గమనించి, జవాన్లకు అందించిన సహకారాన్ని గుర్తించారన్నారు. ఆ తీరును దృష్టిలో పెట్టుకొని, 1963 జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు స్వయంగా భారత ప్రధాని నెహ్రూ ఆర్ఎస్ఎస్‌ను పాల్గొనాలని కోరుతూ ఆహ్వానించారన్నారు. ఈ విషయం రాహుల్ గాంధీకి తెలియనట్టుందని, దీనికి సంబంధించి దృశ్యాలు చూడవచ్చునని అన్నారు. చైనా భారత్‌పై ఆక్రమణ చేస్తుందని పలు సార్లు హెచ్చరికలు వచ్చాయి. కానీ ప్రభుత్వం, ప్రసార మాధ్యమాలు దానిని సీరియస్‌గా తీసుకోలేదు. చివరికి 1962లో చైనా భారత్‌పై ఆక్రమణ చేసింది. అలాగే భారత్–పాకిస్తాన్ యుద్ధాలలో కూడా స్వయంసేవకులు ప్రభుత్వం, సైన్యానికి అన్ని విధాలా సహకారం అందించారు. కొన్ని సంవత్సరాల తర్వాత గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడానికి పండిట్ నెహ్రూ స్వయంగా సంఘాన్ని ఆహ్వానించారు. సంఘంలోని వారు కూడా దేశభక్తులే అని నెహ్రూ అన్నారన్నారు.

# అలసత్వం వద్దు.. అంతా అప్రమత్తంగా ఉండండి

## పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంతో మంత్రి సీతక్క విడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దానసరి అనసూయ సీతక్క ఆదివారం మధ్యాహ్నం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సమావేశంలో నివిది ఎన్. అశోక్‌తో పాటు చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.వర్షాలు, వరదల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పడిన పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తూ, ఇప్పటివరకు మొత్తం 86.55 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయని మంత్రికి నివేదించారు. ఈ రహదారుల తాత్కాలిక పునరుద్ధరణకు ఆరున్నర కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.143 కోట్ల వరకు వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. మొత్తంగా రహదారులు మరియు ఇతర మౌలిక వసతుల పునరుద్ధరణకు రూ.150 కోట్ల వరకు అవసరమవుతుందని అధికారుల నివేదిక వెల్లడించింది.అలాగే వర్షాలు, వరదల కారణంగా 66 రహదారులు, 83 క్రాస్ డ్రైన్ పనులు, 60 చోట్ల గండ్లు పడినట్లు వివరించారు. అంతేకాకుండా శిధిలావస్థలో ఉన్న 36 భవనాలు గుర్తించామని, వాటిలో నివసిస్తున్న ప్రజలను ఇతర సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నామని మంత్రికి తెలియజేశారు.గత రెండు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా రవాణా సంబంధాలు తెగిపోయిన కొన్ని గ్రామాలకు మళ్లీ కనెక్టివిటీ పునరుద్ధరించినట్లు అశోక్ తెలిపారు. మంచిర్యాల జిల్లా భీమిలి మండలంలోని కర్జిభీంపూర్ గ్రామానికి, అదే మండలంలోని రాజారం గ్రామానికి రవాణా సంబంధాలను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. అసిఫాబాద్ జిల్లా, అసిఫాబాద్ మండలంలోని రాజూర్ గ్రామానికి కూడా కనెక్టివిటీ పునరుద్ధరించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్నవారు పనిప్రదేశాలను వదిలి వెళ్లరాదని సూచించారు. వర్షాలు తగ్గిన వెంటనే తాత్కాలిక మరమ్మతు పనులను తక్షణం పూర్తి చేయాలని ఆదేశిస్తూ, కలెక్టర్ల వద్ద ఇప్పటికే నిధులు అందుబాటులో ఉన్నందున వాటిని వినియోగించి తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

# పేట్‌బషీరాబాద్ సరోగసి కేసు సంచలనం

## ఏజెంట్లుగా నిందితులు .. పలు ప్రైవేట్ ఆస్పత్రులకు నోటీసులు



**హైదరాబాద్ (పేట్‌బషీరాబాద్), ఆగస్టు 17, ప్రభాతవార్త:** రెండు తెలుగు రాష్ట్రాల్లో సరోగసి కేసులు వేల సంఖ్యలో వెలుగులోకి వస్తుండటం, అటూ అధికారులను, ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఈ నేపథ్యంలో పోలీసులు వారి కర్తవ్యాన్ని నిర్వహిస్తూ.. ముందుకు దూసుకెళ్తున్నారు. తాజాగా మేడ్చల్ సరోగసి కేసును సుమోటో కేసుగా తీసుకుని పేట్ బషీరాబాద్ పోలీసులు ఎస్ఐఆర్ నమోదు చేశారు. పేట్ బషీరాబాద్ పరిధిలో వెలుగులోకి వచ్చిన సరోగసి రాకెట్ కేసు దర్యాప్తు వేగం అందుకుంది. ఈ కేసులో నిందితురాలు లక్ష్మి , ఆమె కుమారుడు నరేందర్ రెడ్డి పలు ప్రైవేట్ ఆస్పత్రులకు ఏజెంట్లుగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పేట్ బషీరాబాద్ పోలీసులు పలు ప్రముఖ ఆస్పత్రులు, ఫెర్టిలిటీ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు హెగ్డే హాస్పిటల్, లక్స్ హాస్పిటల్, అను టెస్ట్ ట్యూబ్ సెంటర్, ఈవీఎఫ్ ఐవిఎఫ్ సెంటర్, ఫర్టి కేర్, శ్రీ ఫెర్టిలిటీ, అమూల్య ఫెర్టిలిటీ సెంటర్‌లకు శనివారం నోటీసులు అందజేశారు.

ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సరోగసి ముఠా ఈ ఆస్పత్రుల ద్వారా దందా కొనసాగించిన అవకాశాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై స్పష్టత కోసం ఆయా ఆస్పత్రుల యాజమాన్యానికి నోటీసులు పంపినట్లు సమాచారం.

**ఇంకా వెలుగులోకి రాబోయే అంశాలు..**

దర్యాప్త కొనసాగుతున్న దశలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కొందరి ఆర్థిక అవసరాలు, ఇబ్బందులను, మరొకరి సంతాన సాఫల్యత కలను క్యాష్ చేసుకుంటున్నాయి. ఒకరు భర్తప్రాణాలను రక్షి ంచుకు నేందుకు సరోగసికి ఒప్పుకుంటే.. మరొక యువతి కుటుంబ అవసరాల కోసం అండం డొనేట్ చేసేందుకు ఒప్పుకుంది. ఇలాంటి అనేక విషయాలు సరోగసి అక్రమ దందా కేసులో వెలుగులోకి వస్తున్నాయి.

**కిడ్నీ ఆపరేషన్ కోసం..**

సరోగసి అక్రమ దందా కేసులో గర్భవతిగా ఉన్న ఓ మహిళ తన భర్త ప్రాణాలు కాపాడుకునేందుకు సరోగసికి ఒప్పుకున్నట్లు తెలుస్తుంది. ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన ఈమెకు ఇప్పటికే ఇద్దరు పిల్లలున్నారు. భర్తకు రెండు కిడ్నీలు పాడవడంతో ఆపరేషన్ చేయాల్సి ఉంది. ఎవరూ సహకరించక పోవడంతో ఆమె సరోగసి దందా చేస్తున్న నారెద్దుల లక్ష్మీరెడ్డిని సంప్రదిం చింది. మహిళ అవసరాన్ని తెలుసుకుని అందుకు సహకరిస్తానని చెప్పి అన్నట్టుగానే భర్తకు ఆపరేషన్ చేయించింది. దీనికి రూ.15 లక్షల వరకు చెల్లించినట్లు తెలుస్తుంది. తర్వాత బాధిత మహిళకు సరోగసి చేయించి ఆమెను పద్మానగర్‌లో ఉన్న తన ఇంట్లోనే ఆశ్రయం కల్పించింది.

**అండానికి రూ.10 వేలు..**

సరోగసి అక్రమ దందా చేస్తున్న మహిళ ఒక్కో అండ దానానికి రూ.10 వేలు చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. నెలలో ఓ మహిళ మూడు అండాలను ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి మొత్తంగా రూ.30 వేలు బాధిత మహిళలకు అందిస్తుంది. ఈ క్రమంలోనే ఓ యువతి వద్ద నుంచి అండం సేక రిస్తున్న క్రమంలో విషయం బయటకు వచ్చినట్టు సమాచారం. దీని ఆధారంగానే పోలీసులు ఆకస్మిక తనిఖీలకు వెళ్లి సరోగసి అక్రమ దందా వ్యవహారాన్ని బట్టబయలు చేశారు.



# పేకాట ఆడుతూ దొరికిన ప్రముఖులు

## భారీగా నగదు స్వాధీనం.. 11 మంది అరెస్ట్

## పట్టుబడిన వారిలో ఓ ఎమ్మెల్సీ తండ్రి, కార్పొరేటర్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** పేకాట ఆడుతూ పలువురు ప్రముఖులు పోలీసులకు చిక్కారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం రాత్రి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైష్ణవికాలనీలో ఓ గెస్ట్‌హౌస్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్వోటీ పోలీసులు పేకాట శిబిరంపై దాడిచేసి, 11 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2.52 లక్షల నగదుతో పాటు 11 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితు లను కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పట్టుబడిన వారిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండలరావు(72), అల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్(64), కూకట్‌పల్లికి చెందిన ప్రముఖులు, వ్యాపార వేత్తలు నాయినేని తులసిరావు(58), గన్నమనేని బాలరావు(61), వడ్డేల భాస్కర్(60), కల్వకుంట్ల రంగారావు(57), అవధూత నాగేశ్వరరావు(61), మురళి మోహన్ కృష్ణ కుమార్(79), చింతపట్ల అనిల్‌కుమార్(55), తీగల శ్రీనివాస్ రావు (55), సిహెచ్.భాస్కరరావు(62)లు ఉన్నారని పోలీసులు తెలిపారు.

# నకిలీ సరుకుల కేరాఫ్‌గా మారుతున్న న్యూఢిల్లీ

## ఖరీదైన విదేశీ సిగరెట్ల పేరిట కల్తీ వస్తువుల తయారీ

## నికోటిన్ సహా ప్రమాదకర రసాయనాలతో ఇ-సిగరెట్ల తయారీ

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీ నగరం కల్తీ వస్తువుల తయారీకి కేరాఫ్‌గా మారుతోంది. నిన్నటి వరకు కొన్ని రకాల న కిలీ వస్తువుల తయారీ వరకే పరిమితమైన ఢిల్లీ నగరం నేడు ఖరీదైన విదేశీ సిగరెట్ల పేరిట నాసిరకం పొగాకుతో కల్తీ వస్తువుల తయారీతో పాటు నికోటిన్ సహా ప్రమా దకర రసాయనాలతో ఈ..సిగరెట్ల తయారీ కూడా ఎక్కువగా జరుగుతుండడం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారుతోంది. ఢిల్లీ నగరంలో తయారవుతున్న కల్తీ సరుకు హైదరాబాద్ సహా దేశంలోని అన్ని నగరాలకు సరఫరా అవుతుండగా ఆయా నగరాలలోని చోటా వ్యాపారు లు, నేరగాళ్లు వీటికి ఏజెంట్లుగా వ్యవహరిస్తూ మార్కెట్లను శాసించే స్థాయికి చేరుకోవడం విశేషం. ఢిల్లీ సరుకు అంటే ఒకప్పుడు కచ్చితంగా మంచిదనే పేరుండేది. కానీ నేడు అక్కడ నుంచి వచ్చే సరుకంతా నకిలీదిగా వుంటోందని పోలీసులకు అందుతున్న ఫిర్యాదులు చెబుతున్నాయి. ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల దుస్తుల ఉత్పత్తులు మొదలుకొని విద్యుత్ ఉపకరణాలు, సిగరెట్లు, గృహోపక రణాలు, ఆహార వస్తువులు ఇలా అనేక రకాల ఉత్పత్తుల నకిలీకి ఢిల్లీ కేంద్రంగా మారడం ఇప్పుడు హాట్ టాఫిక్‌గా మారింది. హైదరాబాద్‌లోని కోఠి, బేగంబజార్ సహా అనేక ప్రాంతాలలో నగర పోలీసులతో పాటు ఢిల్లీ పోలీసులు బడా కంపెనీల ప్రతినిధులతో కలిసి నకిలీ ఉత్పత్తులను అమ్మేవారి కోసం తరచూ సోదాలు జరుపుతున్నారంటే వీటి చలామణి మార్కెట్లో ఏ స్థా యిలో వుందో ఊహించుకోవచ్చు. ఒక్క హైదరాబాదే కాదు దేశంలోని అన్ని ప్రముఖ నగరాలలోనూ ఇదే తరహాలో నకిలీలు రాజ్యమేలుతున్నాయంటే అతిశయోక్తి కాదు. ఇటీవల కాలంలో నకిలీ ఉత్పత్తుల వెల్లువలో ఎ క్కువగా పట్టుబడుతున్నవి నకిలీ విద్యుత్ ఉపకరణాలు, దుస్తులు, నూనెలు, సబ్బులు, ఆహార వస్తువులతో పాటు ఖరీదైన విదేశీ సిగరెట్ల పేరిట న కిలీ, నాసిరకం సిగరెట్లు, నికోటిన్ సహా ప్రమాదకర రసాయనాలతో తయారవుతున్న ఈ..సిగరెట్లు వుంటున్నాయి. ఇతర వస్తువుల విషయం ఎలా వున్నా ఆహార వస్తువులతో పాటు నకిలీ సిగరెట్లు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. వీటిని చలామణి చేస్తున్న నేరగాళ్లు ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారు. ముఖ్యంగా గడచిన రెండేళ్ల కాలంలో నకిలీ విదేశీ సిగరెట్లు, నకిలీ ఈ..సిగరెట్ల వరుసగా పట్టుబడుతుండడం గమనార్హం. భారత్‌లో సిగరెట్ ప్రియులకు కొదవలేదన్న సంగతి బహిరంగ రహస్యమే. ఇందులో విదేశీ సిగరెట్లు అంటే మోజుపడే వారు మరింత మంది వుండేది విదితమే. సరిగ్గా ఈ అంశాన్ని సొమ్ము చేసుకుంటున్న స్మగ్లర్లు బీడీల తయారీలో వాడే నాసికరం పొగా కును వాడుతూ అందులో కొంత రంగు, వాసన కలిపి విదేశీ సిగరెట్ల మా దిరిగా చక్కగా ప్యాకింగ్ చేస్తూ వాటిని అనేక నగరాలలోని ఇష్టారాజ్యంగా పంపిణీ చేస్తున్నారు. పట్టుమని అర్థ రూపాయి కూడా ఖరీదు చేయని నకిలీ సిగరెట్లు డీలర్లకు రెండు రూపాయల నుంచి మూడు రూపాయలకు ఇస్తున్నారు. వీటిని కొంటున్న వ్యాపారులు 25 రూపాయల నుంచి 40 రూపాయల వరకు అమ్ముతూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. విదేశీ సి గరెట్ల పేరిట దమ్ము పీలుస్తూ రింగు రింగులుగా పొగ వదులుతున్న పొగరాయుళ్లు తాము తాగేది నకిలీ సిగరెట్ అనేది తెలియక తమ ఆరోగ్యాన్ని తామే పాడు చేసుకుంటున్నారు. సాధారణంగా విదేశీ సిగరెట్లు అంటే ఫారిన్, బ్రిటీష్, జర్మనీ దేశాల సరుకుకు బాగా డిమాండ్ వుంటుంది. ఇదే క్ర మంలో న కిలీ సరుకును తయారుచేస్తున్న స్మగ్లర్లు సిగరెట్ ప్రియుళ్ల ఆరోగ్యాన్ని హరిస్తున్నారు.


**కల్తీ ఆహార వస్తువులు, నకిలీ సిగరెట్లతో ప్రమాదంలో ప్రజల ఆరోగ్యం: వైద్య నిపుణులు**

ఇదిలా వుండగా కల్తీ ఆహార వస్తువులతో పాటు నకిలీ సిగరెట్లతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడిందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆహార వస్తు వుల తయారీ, విక్రయాల విషయంలో సర్కారీ విభాగాలు కఠినంగా వుండాలని వారంటున్నారు. ఇదే సమయంలో నకిలీ సిగరెట్ల క్రయవిక్రయాల లోనూ ఇదేరీతిన వుండాలని వారు చెబుతున్నారు. సిగరెట్ పీల్చడమే ప్రమాదకరం అయినపుడు నకిలీ సిగరెట్ మరింత ప్రమాదకరమని క్యాన్సర్ ఆసత్రి వైద్యులు చెబుతున్నారు. దేశ వ్యాప్తంగా అన్ని నగరాలలో నకిలీ సిగరెట్ల అమ్మకాలపై తమకు సమాచారం వుందని, ఈ విషయంలో ఆయా ప్రాంతాల పోలీసులతోపాటు పౌర విభాగాల అధికారులు కఠినంగా వ్యవహరించాలని వారు కోరుతున్నారు. కల్తీ సిగరెట్ల వాడకం వల్ల నోటి క్యాన సర్, గుండె క్యాన్సర్, రక్త క్యాన్సర్‌వంటి ప్రమాదకర జబ్బులు వచ్చే అవకాశాలున్నాయని వారంటున్నారు. సిగరెట్లు వాడు తున్న వారు క్యాన్సర్ బారినపడుతూ నిత్యం తమ వద్దకు వస్తున్నారని, ఇందులో నకిలీ సిగరెట్ల బారిన పడ్డ వారు కూడా వున్నారని వైద్య నిపుణులు తెలిపారు.

# గర్భిణీ మృతిపై స్పందించిన రాష్ట్ర మెడికల్ కౌన్సిల్

## సుమోటోగా స్వీకరించి దాడులు

హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త: రాష్ట్రంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తమ దాడులను కొనసాగిస్తోంది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో ఆర్ఎంపి గర్భిణీకి చేసిన వైద్య వికటించి మరణించిన ఘటనను టిఎంసి సీరియస్‌గా తీసుకుంది. సుమోటోగా స్వీకరించి టిఎంసి వైస్ ఛైర్మన్ డాక్టర్ జి శ్రీనివాస్ నాయకత్వంలో తనిఖీలు నిర్వహించింది. తుంగతుర్తి లో ఆర్ఎంపి చికిత్స వికటించి 26 సంవత్సరాల గర్భిణీ మృతి పై స్పందించిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం సుమోటో గా స్వీకరించింది. ఆదివారం తుంగతుర్తికి చేరుకున్న విచారణ బృందంలో టిఎంసి వైస్ ఛైర్మన్ డాక్టర్ గుండగాని శ్రీనివాస్, డాక్టర్ విష్ణు ఆర్ఎంపి శ్రీనివాస్ నిర్వహిస్తున్న ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించారు. గర్భిణికి చికిత్స చేసిన నకిలీ వైద్యుడు, ఆర్ఎంపి శ్రీనివాస్ నిర్వహిస్తున్న అక్రమ ఆసుపత్రి తనిఖీలో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. ఆర్ఎంపి శ్రీనివాస్ గత కొన్ని సంవత్సరాలు గా ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా సాయి బాలాజీ ఆసుపత్రి నిర్వహించడంతోపాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలకు, గర్భిణీలకు గుట్టు చప్పుడు కాకుండా తనతోటి ఆర్ఎంపిలు కొందరితో కలిసి ఒక మాఫియాలాగా తయారై లింగ నిర్ధారణ పరీక్షలతోపాటు గర్భ విచ్ఛిత్తిని గత కొన్ని సంవత్సరాల నుండి అక్రమంగా ప్రోత్సహిస్తున్నట్లు స్థానికుల నుండి సమాచారం సేకరించారు. ఆర్ఎంపి శ్రీనివాస్ వెతికే పనిలో పోలీసులు ఉన్నారని తెలిపారు. ఆర్ఎంపి ఎంత మందికి అబార్షన్లు చేశారు... దాంతోపాటు ఎంత మంది ఆర్ఎంపిల పాత్ర ఇందులో వుందనేది విచారణలో తేలనుందని డాక్టర్ జి. శ్రీనివాస్ తెలిపారు. గతంలో కూడా ఈ అక్రమ దందాపై స్థానికులు కొందరు జిల్లా వైద్యాధికారికి సమాచారం ఇచ్చిన కూడా .. ఎటువంటి చర్యలు తీసుకోలేదని,అపుడు సరైన చర్యలు తీసుకొని ఉంటే ఈరోజు ఒక నిండు గర్భిణీ మృతి చెంది ఉండక పోయేదని స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారని శ్రీనివాస్ తెలిపారు. నకిలీ ఆర్ఎంపి శ్రీనివాస్‌పై నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసి) చట్టం ప్రకారం కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.



# సినీ కార్మికుల సమ్మెపై చిరంజీవితో నిర్మాత కల్యాణ్ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త: తెలుగు చలన చిత్ర పరిశ్రమకు చెందిన కార్మికులు వేతనాల పెంపులని గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఫిల్మ్ ఛాంబర్, ఫిల్మ్ ఫెడరేషన్ ప్రతినిధులు, నిర్మాతలు ఇప్పటికే కార్మిక సంఘాలతో పలు మార్లు భేటీ అయినప్పటికీ సమస్య పరిష్కారం అవ్వలేదు. ఈ నేపథ్యంలో సినీ కార్మికుల సమ్మె పంచాయితీ మెగా స్టార్ చిరంజీవి ఇంటికి చేరుకుంది. ఇందులో భాగంగా ఆదివారం చిరంజీవితో నిర్మాత సి. కల్యాణ్ భేటీ అయ్యారు. సమావేశం అనంతరం నిర్మాత మీడియాతో మాట్లాడుతూ టాలీవుడ్ కార్మికుల సమస్య పరిష్కారానికి చిరంజీవి తన వంతు కృషి చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18న ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులు చిరంజీవిని కలుస్తారని వెల్లడించారు. ఫిల్మ్ ఫెడరేషన్ ప్రతినిధులతో మాట్లాడి వారిని చర్చల నిమిత్తం ఫిల్మ్ ఛాంబర్‌కు పంపించేల చూస్తానని స్పష్టం చేసినట్లు తెలిపారు. కార్మికుల సమస్యల విషయంలో ఫిల్మ్ం ఛాంబర్, ఫిల్మ్ ఫెడరేషన్ ఉభయులూ కలిసి చర్చించుకోవాలని సూచించినట్లు చెప్పారు. అంతేకాకుండా ఇరు వర్గాలు కార్మికుల సమస్య పరిష్కారం విషయంలో పట్టు విడుపు ఉండాలని చిరంజీవి చెప్పారని వివరించారు. దీంతో రెండ్రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు ఈ సమస్య పరిష్కారం కోసం ఛాంబర్ ప్రెసిడెంట్ భరత్ కూడా కృషి చేస్తున్నారన్నారు.

## వర్షాలతో సింగరేణి బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త : రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. వివిధ జిల్లాలతో పాటు, మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, గోలేటి, బెల్లంపల్లి ప్రాంతాల ఓపెన్‌కాస్ట్ గనులలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, ఆ తర్వాత నీటి ఎద్దడి కారణంగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. రాత్రుళ్లు కురిసిన వర్షాల తర్వాత ఓపెన్‌కాస్ట్ గనుల్లోకి వర్షపు నీరు ప్రవేశించింది. వరదలు వచ్చిన గనులలో తవ్వకం యంత్రాలు మరియు రవాణా వాహనాలు పనిలేకుండా ఉండటంతో బొగ్గు ఉత్పత్తి తీవ్రంగా ప్రభావితమైంది. అయితే, సింగరేణి భూగర్భ గనులలో బొగ్గు తవ్వకం కార్యకలాపాలు యథావిధిగా కొనసాగాయి. బెల్లంపల్లి మరియు మందమర్రి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం బొగ్గు బెల్ట్ ప్రాంతాన్ని భారీ వర్షాలు ముంచెత్తాయి.

## నిర్మాణాలు పూర్తయినా వాయిదాలకే ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లు పరిమితం

హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:ఎక్సైజ్ స్టేషన్లకు శాశ్వత భవనాల నిర్మాణం ఏళ్లకేళ్లుగా పెండింగ్‌లోనే ఉంది. 2015–16లో రాష్ట్ర వ్యాప్తంగా 56 కొత్త ఎక్సైజ్ స్టేషన్ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.వాటిలో కేవలం 18 మాత్రమే పూర్తి కాగా, అందులోనూ 10 మాత్రమే వినియో గంలోకి వచ్చాయి.ప్రతి ఎక్సైజ్ స్టేషన్ భవన నిర్మాణానికి అప్పట్లోనే రూ.40 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఇందుకుగాను రూ.20 కోట్లకు పైగా నిధులు అవసరం కాగా, అందులో కేవలం రూ.5 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి.ఈ నిధులతో 18 భవనాల నిర్మాణాలు ప్రారంభం కాగా,మిగిలిన చోట్ల స్థలాల సమస్య, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంలాంటి కారణాలు అడ్డంకిగా మారాయి అప్పట్లో నిర్మించిన భవనాలకు సంబంధించిన రూ. 3 కోట్ల పెండింగ్ బిల్లులున్నాయని, వాటిని మంజూరు చేయాలని ఎక్సైజ్ శాఖ ఇటీవల ప్రభు త్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.ఎక్సైజ్ స్టేషన్లకు భవనాల నిర్మాణం మాట అటుంచితే కొత్త ఎక్సైజ్ స్టేషన్ల ప్రారంభం ఎప్పటికప్పుడు వాయిదాపడు తూనే ఉంది. కొన్ని ఎక్సైజ్ స్టేషన్ల పరిధి చాలా ఎక్కువగా ఉండడం,ఈ నేపథ్యంలో కొత్త ఎక్సైజ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా, వాటి పరిధిని తగ్గించాలనే ప్రతిపాదనలు కూడా 2016లోనే వచ్చాయి.ఇందుకు సంబంధించిన జీవో కూడా అప్పుడే వెలువడింది. అప్పటి నుంచి ఎక్సైజ్ అధికారుల అలసత్వం ప్రభుత్వ ఉదాసీనత కారణంగా ఈ స్టేషన్ల ఏర్పాటు ఆగిపోయింది.అయితే, ఇటీవల ఎక్సైజ్ ఎక్సైజ్ శాఖ అధికారులు కొంత చొరవ తీసుకొని వీటి పరిధిని నిర్ణయించడం.ఆయా స్టేషన్లకు హౌస్ ఆఫీసర్లను, సిబ్బందిని నియమించడం లాంటివి జరిగాయి.అద్దె భవనాలు అందుబాటులో ఉంటే కొత్త స్టేషన్లను కొత్త భవనాల్లో ఏర్పాటు చేయాల లేదంటే పాత స్టేషన్‌లోనే కొత్త స్టేషన్‌కు కూడా నడిపించాలని ఎక్సైజ్‌శాఖ ఆదేశాలిచ్చింది. దీంతో అధికారికంగానే బంజారాహిల్స్,,మారేడుపల్లి, చిక్కడపల్లి, గండిపేట, కొండాపూర్, మీర్‌పేట, పెద్దఅంబర్‌పేట,కొంపల్లి, కూకట్ పల్లి,కాప్రా, నాగారం, అత్వాల్, అమీన్ పూర్, హసన్‌పర్తిలలో కొత్త ఎక్సైజ్ స్టేషన్లు ఏర్పాటయ్యాయి. కానీ వాటిని ప్రభుత్వం ప్రారంభించడం ఇప్పటికే పలు మార్లు వాయిదా పడింది. హైదరాబాద్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నిక కారణంతో ఒకసారి, మే. జూన్ నెలల్లో రెండుసార్లు వాయిదా వచ్చాయి.అయితే, ఇటీవల ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ఈ నెలలోనే వాటిని ప్రారంభిస్తామని చెప్పిన నేపథ్యంలో ఇప్పుడైనా అవి అధికారికంగా ప్రారంభమవుతాయని ఎక్సైజ్ వర్గాలు ఆశిస్తున్నాయి.

# యూరియా అమ్మకాలపై నిఘా

### సరఫరాలో కేంద్రం వైఫల్యం
### అవసరానికి మించి రైతులు కొనవద్దు
### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త: రాష్ట్రంలో యూరియా అమ్మకాలపై నిరంతరం నిఘా ఉంచాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు. యూరియాను వ్యవసాయానికి కాకుండా, ఇతర అవసరాల కోసం మళ్లించకుండా టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేసి, ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అవసరాలకు మించి యూరియాను కొనుగోలు చేయడం మానుకోవాలని రైతులకు సూచించారు. రాష్ట్రానికి యూరియాను సరఫరా చేయడంలో కేంద్రం విఫలమైంద న్నారు. కేంద్రం కేటాయించిన 9.80 లక్షల టన్నుల యూరియాలో ఇప్పటి వరకు కేవలం 5.32 లక్షల టన్నుల యూరియాను మాత్రమే సరఫరా చేసిందని, దీంతో 2.69 లక్షల టన్నుల లోటు ఏర్పండిందని చెప్పారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో 78 రోజులు ఉత్పత్తి జరగకపోవడం వలన రాష్ట్రానికి సరఫరా కావాల్సిన యూరియాలో పెద్ద లోటు ఏర్పడిందని అన్నారు. అంతేకాకుండా దిగుమతి ద్వారా సరఫరా కావాల్సిన యూరియాలో, కొన్ని నెలలో కొన్ని కంపెనీలు అసలు సరఫరాలే చేయలేదన్నారు. రాష్ట్రంలోనే కాకుండా మధ్యప్రదేశ్, రాజస్థాన్ లాంటి రాష్ట్రాలతో పాటు, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, బీహార్, హర్యానా, పంజాబ్ లాంటి రాష్ట్రాలలో కూడా యూరియా కొరత ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో సీజన్ ముందుస్తుగా మొక్కజొన్న లాంటి పంటలు అధికంగా సాగు చేయడం వల్ల ఈ సంవత్సరం గత కంటే యూరియా అమ్మకాలు అధికంగా జరిగాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నల్గొండ, గద్వాల, కరీంనగర్, నిజామాబాద్, పెద్దపల్లి లాంటి జిల్లాల్లో గత సంవత్సరంతో పోలిస్తే అధికంగా అమ్మకాలు జరిగినట్లు తెలిపారు. ప్రతి నెల నుండి అదనంగా 20 వేల టన్నుల యూరియాను కేటాయించే విధంగా కేంద్ర ప్రభుత్వ అధికారులకు లేఖలు రాయాల్సిందిగా ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరక్టర్ గోపి గారు, హెచ్ఏసీఏ, మార్క్‌ఫెడ్, ఆగ్రోస్ ఎండీలు చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, రాములు తదితర అధికారులు పాల్గొన్నారు.



# భారీ వర్షాలు.. అప్రమత్తంగా ఉండండి

### ఆదిలాబాద్ జిల్లా వరద ప్రాంతాలపై
### జిల్లా అధికారులతో మంత్రి జూపల్లి సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.రిజర్వాయర్లకు సంబంధించిన ఇన్ ఫ్లో అవుట్ ఫ్లోల గురించి ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టంపై నివేదిక తయారు చేయాలని సూచించారు. చెరువులకు, కాల్వలకు గండ్లు పడినట్లైతే వెంటనే వాటిని పూడ్చివేయాలని,రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని చెప్పారు.ఎగువన కురుస్తున్న భారీ వానల నేపథ్యంలో పెన్ గంగా ఉధృతంగా ప్రవహిస్తున్నందున ముంపు ప్రాంతాల దృష్టి పెట్టాలన్నారు. వరద నీరునిలిచి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాల న్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవా న్నారు.అలానే త్వరితగతిన సహాయక చర్యలు చేపట్టాలని, ప్రభావిత మండలాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.ఆర్ డబ్ల్యూఎస్, హెల్త్ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. ప్రమాదకరంగా పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. రోడ్ల మీద నీరు పూర్తి స్థాయిలో తగ్గే వరకూ ప్రజలు బయటకు రాకూడదని, సహాయక చర్యల్లో ప్రజలు అధికారులకు సహకరించాలని మంత్రి కోరారు.

# భారీ వర్షాలతో దెబ్బతిన్న 4.50 లక్షల ఎకరాలు

### అన్నదాతలు అతలాకుతలం
### వరద ముంపులో పంట పొలాలు

హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త: రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలు రైతన్నలను అతలాకుతలం చేశాయి. రాష్ట్రంలోని మంచిర్యాల, వికారాబాద్, ఖమ్మం, మెదక్, ములుగు, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, సూర్యాపేట్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలకు వివిధ పంటలు దెబ్బతిన్నాయి. వరద ముంపులో పంటలు మునిగాయి. మరికొన్ని చేలల్లో ఇసుక మేటలు వేయడంతో పంటలు ఇసుక, బురదలో కూరుకుపోయాయి. ఈ వర్షాలకు వివిధ జిల్లాల్లోని దాదాపు 4.50 లక్షల ఎకరాల్లోని వరి, పత్తి, మిర్చి, సోయాబీన్, కంది, కూరగాయల తోటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో 2 లక్షల ఎకరాల్లో పత్తి, 1.50 లక్షల ఎకరాల్లో వరి, మిగిలిన వాటిల్లో కంది, మొక్కజొన్న, వేరుశనగ, పెసర, కూరగాయల తోటలు వరద ముంపునకు గురయ్యాయి. వరదలకు అధిక శాతం పైరు కొట్టుకుపోగా, మిగిలిన చోట్ల ఇసుక, బురద మేటలు వేశాయి. ప్రధానంగా ప్రాజెక్టులు, చెరువులు, నదీ పరివాహక ప్రాంతాలు తదితర చోటన పంట చేలు నీట మునిగాయి. మరోవైపు ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకూ అమలు చేయకపోవడంతో పంట నష్టాలకు సంబంధించి పరిహారం వచ్చే అవకాశాలు లేకుండా పోయాయి. ఇటీవలే విత్తిన, మొలక దశలో ఉన్న వివిధ రకాల పంటలు నీటిలో నానుతున్నాయి. ఈ భారీ వర్షాల ప్రభావం ఎక్కువగా పత్తి పంటపైనే పడినట్లు చెబుతున్నారు. పత్తి విత్తనాలు వర్షాలకు మొలకెత్తకుండానే భూమిలోనే మురిగిపోయాయి. ఇక మొలక స్థాయిలో ఉన్న పత్తి పంట పాడైంది. మొలక దశలో ఉన్న సమయంలో కుండపోత వర్షంతో పత్తి పంటలో వరద నీరు నిలిచిపోయింది. పత్తి, సోయా, మొక్కజొన్న వంటి పైర్లు ప్రస్తుతం చిన్న మొక్కల దశలో ఉండటంతో నీటిలో మునిగి ఉన్న కారణంగా తేమను తట్టుకోలేక అవి చనిపోతున్నాయి. అంతేకాకుండా అధిక తేమకు తెగుళ్ల వ్యాపిస్తున్నాయని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



# బిఆర్ఎస్ కార్యకర్త కూతురి పెళ్లి పిలుపుపై కెటిఆర్ భావోద్వేగం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 17: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఒక ప్రత్యేకమైన వివాహ ఆహ్వానంపై భావోద్వేగానికి గురయ్యారు. ఒక ప్రత్యేకమైన ఆహ్వానం అందింది..నాకు ఇదొక ప్రత్యేకమైన అనుభూతి...ప్రతి అమ్మాయి తన వివాహానికి నాన్న ఆశీర్వాదం, అన్నయ్య అండ కావాలని కోరుకుంటుంది.కానీ నా చెల్లి తన నాన్న, అన్నయ్యను కోల్పోయిన తర్వాత ఆ లోటును తీర్చమని నన్ను పిలిచింది. ఆమె ఆహ్వానం నాకు కేవలం ఆహ్వానం కాదు...అది నా మీద ఉంచిన నమ్మకం, ఒక అన్నయ్యపై ఉంచిన ఆశ. ఆ అదబిడ్డ ఆహ్వానం నా మనసును కదిలించింది. ఆమె కోరికను గౌరవించడం నా బాధ్యతగా, కర్తవ్యంగా భావించాను...నిరాశ్రయిన తెలంగాణ బిడ్డలే బీఆర్ఎస్ బలం, బలగం. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన ధ్యానబోయిన నర్సింలు జీవితకాలం బీఆర్ఎస్ పార్టీ అభ్యున్నతి కోసం కృషిచేశారు. కరోనా విపత్తు సమయంలో వారు మరణించారు. ఆ తర్వాత ఆ ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న వారి కుమారుడు ధ్యానబోయిన నరేష్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. తాను చనిపోయిన తన అమరులను జీవిత దాసన్ దానం చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. చెల్లెలు నవిత ఆనందంలో భాగస్వామి కావడం, ఆమెకు అండగా నిలవడం అన్నగా, ఆత్మీయుడిగా నా బాధ్యత అని భావించాను...ప్రజలతో ఉన్న అనుబంధం రాజకీయాలకు మించినది.ఇలాంటి సందర్భాలు నాకు ఎప్పుడూ గుర్తు చేస్తూనే ఉంటాయి.. మనందరికీ ఒకటే కుటుంబం అని. చెల్లెలు నవితసంజయ్ దంపతులు కొత్త జీవితప్రయాణం సంతోషం, ప్రేమ, ఆశీర్వాదాలతో నిండిపోవాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను. మీకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా నిలుస్తుందని హామీ ఇస్తున్నాను అని ట్విట్టర్ ద్వారా తెలిపారు.

# సెప్టెంబరు 1న సిపిఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ

### సిపిఎస్ రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లింగమల్ల దర్శన్

హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త: ఉద్యోగులకు భద్రత లేని సి.పి.ఎస్ విధానాన్ని రద్దుచేసి 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగులు వృద్ధాప్యంలో పదవీవిరమణ అనంతరం ఆత్మగౌరవంతో జీవించాలని కోరుతూ సెప్టెంబర్ 1 న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సి.పి.ఎస్ ఉద్యోగుల ఆత్మ గౌరవసభ నిర్వహిస్తున్నామని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల దర్శన్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లో యూనియన్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సి.పి.ఎస్ రద్దుచేసేవరకు రాజీలేని పోరాటం చేస్తామని, అధిక సంఖ్యలో సి.పి.ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరై సి.పి.ఎస్ ఉద్యోగుల ఆత్మ గౌరవసభ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలను ప్రజలకు చేరుస్తూ ప్రభుత్వాని ప్రజలకు మధ్య వారధిగా సుమారు 30–35 సంవత్సరాలు విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఈ సి.పి.ఎస్ విధానం వల్ల పదవీవిరమణ అనంతరం వృద్ధాప్యంలో పెన్షన్, హెల్త్ కార్డులు లేక ఆర్థిక, అనారోగ్య సమస్యలతో మానసిక ఆందోళన చెందుతున్నారని, ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత కాబట్టి ఉద్యోగులకు, ప్రభుత్వాన్నికి ఆర్థిక భారంగా మారిన సి.పి.ఎస్ విధానాన్ని రద్దుచేసి ఉద్యోగులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.రామకృష్ణ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ న్యాయవ్యవస్థ వీరాభిమన్యుడిలా పోరాడుతోంది

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త: దేశంలోని ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయవ్యవస్థ వీరాభిమన్యుడిలా పోరాడుతోందని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. అంతిమంగా ఈ జ్యుడీషియరీ భారతదేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని విశ్వాసం ఉందన్నారు. ఒకవైపు రాష్ట్రపతిని మరోవైపు ఎన్నికల కమిషన్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన చేతుల్లో పెట్టుకుందన్నారు. ఈసీని, ఈడీని, సిబిఐని గ్రిప్‌లో పెట్టుకొన్నారని.. కానీ జ్యుడీషియరీ ఒకటే న్యాయాన్ని నిలబెట్టేందుకు కృషి చేస్తుందన్నారు నారాయణ. గవర్నర్లుగా నియమించబడిన వారు.. ఎన్నికైన ప్రభుత్వాలను శాసిస్తున్నారని మండిపడ్డారు. తమిళనాడు గవర్నర్ బహిరంగంగానే ప్రతిపక్షానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉన్న రాష్ట్రాల్లో తప్ప మిగిలిన అన్ని చోట్ల పాలక ప్రభుత్వాలపై దాడి చేస్తున్నారని.. ఎన్నికైన ప్రభుత్వాలని గౌరవించాలని జుడీషియరీ కూడా చెబుతున్నప్పటికీ, అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి అనటం విచారకరమన్నారు. దేశంలోని ప్రధాన బాడీలలో రాష్ట్రపతి, ఎన్నికల సంఘం, జ్యుడీషియరీ, నీతి అయోగ్, సిబిఐ ప్రధానమైనవి కాగా .. అందులో నాలుగింటిని మోడీ సర్కార్ మింగేసిందన్నారు. వాటిల్లో జ్యుడీషియరీ మాత్రమే మిగిలిందని తెలిపారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం కింది స్థాయిలో చాలా బలంగా మిగిలి ఉందని.. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన చారిత్రక నేపథ్యం ఇంకా భారతదేశంలో మిగిలి ఉందన్నారు. తప్పనిసరిగా ప్రజాస్వా మ్యాన్ని, జ్యుడీషియరీని కాపాడుకునేందుకు పోరాడుతామని నారాయణ స్పష్టం చేశారు.

# జూరాలకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

### 11 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
### శ్రీశైలం డ్యాంకు పెరుగుతున్న వరద
### 3 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల



మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 17, ప్రభాతవార్త: ఉమ్మడి పాలమూరు వరప్రదాయిని జూరాలకు ఎగువన కర్నాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు భారీ వరద వచ్చి చేరుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు జూరాలకు వరద పోటెత్తుతున్నది. దీంతో 11గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయానికి 1,00,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 5.282టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్‌హౌస్‌కు 38,818క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 77,946క్యూసెక్కులు, కుడి కాలువకు 640,ఎడమ కాలువకు 396 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జూరాల నుంచి 1,17,846క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది.

### 881 అడుగులకు చేరిన శ్రీశైలం

శ్రీశైలం జలాశయానికి వరద క్రమంగా పెరుగుతున్నది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు సుంకేసుల, జూరాల డ్యాంల నుంచి భారీగా వరద వచ్చి చేరుతున్నది. ఆదివారం సాయంత్రం 6గంటల సమాచారం మేరకు శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 38,818 క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 77,946 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 49,632 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం 3గేట్ల ద్వారా 79,269 క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులకు గానూ 881.10అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 195.6605 టీఎంసీలకు చేరింది. డ్యాంకు 1,78,101 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. విద్యుత్ ఉత్పత్తి కోసం 65,807క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

# ఎస్ఆర్ఓ కార్యాలయాల్లో మౌలిక వసతులు కరవు

### ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త: రాష్ట్రఖజానాకు పెద్దఎత్తున ఆదాయాన్ని తీసుకువచ్చే ఎస్ఆర్ఓ (సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలు) ఒకటి.రాష్ట్రవ్యాప్తంగా అవి 144 ఉండగా వాటిలో ఏవో కొన్ని కార్యాలయాల్లో మినహా మరి ఎక్కడా మౌలిక సదుపాయాలు లేక పోవడంతో అక్కడకు వచ్చే వినియోగదారులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు కనీస వసతులైన (తాగేందుకు నీరు,ఇతర సదుపాయాలు(వాష్‌రూమ్ లాంటి) సౌకర్యాలకు లేక పోవడంతో అక్కడకు వచ్చేవారు పడే ఇబ్బందులు అన్ని ఇన్ని కావు. ముఖ్యంగా గ్రామానికి ఎక్కడో దూరంగా విసిరేసినట్లు ఉండే కార్యాలయాలకు వచ్చేవారు ఎన్నో వ్యయప్రయాసలకు కోర్చి తమ పనులు చక్కబెట్టుకుంటున్నారు.ఉదాహరణకు కీసర సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రావాలంటే ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.ఈ కార్యాలయానికి వచ్చే రోడ్డు మార్గం కూడా సరిగా లేక పోవడంతో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.ప్రస్తుత వర్షాలలో అక్కడకు వాహనదారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.రోడ్డంతా పెద్ద పెద్ద గుంటలు ఉండంతో ద్విచక్రవాహనాలు కూడా ఆ దారిగుండా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.కొన్ని సందర్భాల్లో వాహనదారులు వారి వాహనాలను రోడ్డుమీద ఉంచి నడుచుకుంటూ వెళ్లి పనులు చేసుకోవాల్సి వస్తోంది. స్లాట్ బుకింగ్‌తో క్షణాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్న అధికారులు చెబుతున్న మాటలకు చేతలకుఎటువంటి పొంతన లేకుండా పోతోంది.అధికారులు ప్రణాళికా బద్దంగా వ్యవహరించకుండా హడావిడిగా స్లాట్ బుకింగ్ ప్రక్రియను ప్రారంభించడంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.స్లాట్ బుకింగ్ ప్రారంభానికి ముందే సదరుశాఖకు సంబంధించిన సర్వర్ సామర్థ్యాన్ని పెంచక పోవడంతో సదరు వినియోగదారులు అనేక ఇబ్బంది పడుతున్నారు.ఆస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకోవాలంటే ముందుగా సదరు ప్రాపర్టీకి సంబంధించి ఛలానను మందుస్తుగా చెల్లించి స్లాట్‌బుకింగ్ చేసుకోవాల్సి వస్తుంది. ఉదాహరణకు ఒక ప్రాపర్టీ మార్కెట్ వాల్యూ రూ. 24 లక్షలు అనుకుంటే ముందుగానే 6 శాతం ఛలానా చెల్లించాల్సి ఉటుంది. సదరు మొత్తాన్ని చెల్లించిన తర్వాతే స్లాట్‌బుకింగ్ సాధ్యపడుతుంది. అన్ని పూర్తి చేసుకుని స్లాట్ సమయానికి అక్కడకు చేరుకున్నా సంబంధిత సర్వర్ సహకరించక పోతే ఆ రోజు రిజిస్ట్రేషన్ సాధ్యపడదు. మరో సారి స్లాట్‌బుకింగ్ చేసుకోవాల్సిందే.అంతే కాదు తాము చెల్లించిన చలానా మొత్తాన్ని తిరిగి రిఫండ్‌పెట్టుకోవాల్సి వస్తోంది. ఆ మొత్తం తిరిగి వచ్చేందుకు ఎంత లేదన్నా రెండు వారాలకు పైగా సమయం పడుతుందని అది కూడా వారి చెల్లించి ఛలాన మొత్తంలో 15 శాతం కట్ అయ్యిరావడంతో సదరు వినియోగదారులు అవాక్కవుతున్నారు. ఇదేం రకం దోపిడని ప్రశ్నిస్తున్నారు.సర్వర్లు మొరాయించడంతో తమ ఆస్తులకు సంబంధించిన ఈసీలను,సర్టిఫికేట్ కాపీలను తీసుకోవాలంటే ఇటు మీ సేవా కేంద్రాల చుట్టూ లేదా, ఎస్ఆర్ఓ కార్యాలయాల చుట్టు ప్రదక్షణలు చేయాల్సిందే.కొన్ని సందర్భాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జాప్యం కావడంతో నాలుగైదు గంటలు అక్కడే ఉండాల్సి వస్తోంది. అక్కడ తినేందుకు ,తాగేందుకు క్యాంటిన్ వంటి సౌకర్యాలు లేక పోవడంతో వారంతా పస్తులు ఉండాల్సిందే. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకునేందుకు వచ్చినవారిలో షుగర్ పేషంట్లు,ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు పడే బాధలు వర్ణణాతీతం. ఇకనైనా అధికారులు ఎస్ఆర్ఓ కార్యాలయాల్లో మౌలిక వసతులను కల్పించాలని వినియోగదారులు కోరుకుంటున్నారు.

# 'షో టైం' సినిమా తీద్దాం రండి



ప్రముఖ నిర్మాత, ఎకె ఎంటర్ టైన్మెంట్స్ అధినేత అనిల్ సుంకర ఒక కొత్త రియాల్టీ షోకు శ్రీకారం చుట్టారు. సినిమా రంగంలో రాణించాలనుకునే ఔత్సాహికులకు ఒక అద్భుతమైన అవకాశాన్ని ఈ రియాల్టీ షో ద్వారా కల్పించనున్నారు. మొత్తం 16 సినిమా స్క్రిప్ట్స్, ఆ స్క్రిప్ట్సను పరిశీలించడానికి 12 మంది జడ్జీలు, సినిమాకు స్క్రిప్ట్ సెలెక్ట్ చేయడం నుంచి ఆర్టిస్టులు, రచయితలు ఇలా 24 విభాగాల్లో పని చేసే టెక్నీషియన్లను మొత్తం 75 రోజుల్లో ఎన్నుకునే విధానాన్ని రియాల్టీ షో రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.
'షో టైం' సినిమా తీద్దాం రండి అనే ఉపశీర్షికతో ఒక రియాల్టీ షోను తీసుకురాబోతున్నారు. దీనికి సంబంధించి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ.. చాలామంది సినిమా తీయాలన్నా కళతో తమ దగ్గర ఉన్న డబ్బులన్నీ పెట్టి సినిమా నిర్మిస్తారు కానీ దాన్ని విడుదల చేయడానికి చాలా కష్టాలు పడతారు. చాలామంది డబ్బులు పోగొట్టుకున్న సందర్భాలు కూడా చూసానని అనిల్ సుంకర చెప్పారు. అలాగే ఈ రోజుల్లో సినిమా నిర్మాణ వ్యయం కూడా విపరీతంగా పెరిగిందని, ప్రొడక్షన్ లో చాలావరకు అనవసరమైన ఖర్చులను తగ్గించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇలాంటి సవాళ్లు ఎన్నో సినిమా తీసే నిర్మాతకు ఎదురవుతున్నాయని వాటన్నింటినీ ఈ రియాల్టీ షోద్వారా చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. అన్ని రియాల్టీ షోలా మాదిరిగానే ఇది కూడా ఎలాంటి స్క్రిప్ట్ లేని రియాల్టీ షో అని, ఇది ఒక ప్రముఖ ఓటీటీలో ఇంటర్నేషనల్ వైడ్‌గా స్ట్రీమింగ్ అవబోతుందని దానికి సంబంధించిన వివరాలను త్వరలోనే తెలియజేస్తానని తెలిపారు. ఇక ఈ షో కు మొత్తం 16 స్క్రిప్టును ఎంపిక చేసుకొని అందులో 4 బెస్ట్ స్క్రిప్ట్లను 12 మంది జడ్జీలు ఫైనల్ చేస్తారని తెలిపారు. ఆ ఫైనల్ అయిన స్క్రిప్టుకు అన్ని విభాగాల్లో పనిచేసే నిపుణులను ఆర్టిస్టులను షోలోనే ఎన్నుకుంటారని వివరించారు. ఇక ఆ స్క్రిప్ట్స్ నేరుగా ఆసక్తి ఉన్న నిర్మాతలు బెడ్డింగ్ చేసి ఒక కోటి రూపాయలలో కేవలం 30 రోజులలోనే సినిమా పాటలతో సహా షూటింగ్ జరిపేలా ఒక అద్భుతమైన ప్రణాళికను రెడీ చేయబోతున్నట్లు వివరించారు. ఈ రియాల్టీ షో కి సంబంధించి ఆ తర్వాత షో గురించి మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తామని చెప్పారు.


# 'హాలగలి' మూవీ చేయడం నా అదృష్టం

## ప్రెస్ మీట్‌లో హీరో డాలీ ధనంజయ



ట్యాలెంటెడ్ హీరో డాలీ ధనంజయ, సప్తమి గౌడ ప్రధాన పాత్రల్లో సుకేష్ నాయక్ దర్శకత్వంలో యార్లగడ్డ లక్ష్మీ శ్రీనివాస్ సమర్పణలో కళ్యాణ్ చక్రవర్తి ధూళిపల్ల నిర్మిస్తున్న హిస్టారికల్ ప్రాజెక్ట్ 'హాలగలి'. ఈ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీలో చిత్రీకరిస్తున్నారు. గ్రాండ్‌గా జరిగిన ప్రెస్ మీట్‌లో ఈ సినిమా గ్లింప్స్‌ని లాంచ్ చేశారు మేకర్స్. ధనంజయ్‌ను కమాండింగ్ అవతార్ ప్రజెంట్ చేసిన గ్లింప్స్ గ్రేట్ ఇంపాక్ట్ క్రియేట్ చేసింది.
ప్రెస్ మీట్‌లో హీరో డాలీ ధనంజయ మాట్లాడుతూ, తెలుగు ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమకి కృతజ్ఞతలు. హాలగలి అన్ టోల్డ్ స్టోరీ. ఈ సినిమాలో పార్ట్ కావడం గర్వంగా భావిస్తున్నాను. హాలగలి కర్ణాటకలో గ్రేట్ ఎమోషన్. నిర్మాత కళ్యాణ్, డైరెక్టర్ సుకేష్ చాలా ప్యాషన్‌తో ఈ ప్రాజెక్టుని రూపొందిస్తున్నారు. కథ వినగానే ఈ ప్రాజెక్టులో పార్ట్ అవ్వాలి అనిపించింది. ఈ గ్లింప్స్ మీ అందరికీ నచ్చడం ఆనందంగా వుంది. మరిన్ని క్రేజీ అప్డేట్స్ రాబోతున్నాయి. తప్పకుండా సినిమా ఒక మంచి ఎక్స్పీరియన్స్ ఇవ్వబోతుంది. అందరి అంచనాలను అందుకుంటుంది. మీ అందరి సపోర్ట్‌కి థాంక్యూ. తప్పకుండా ఈ సినిమా చాలా మంచి ప్రాజెక్ట్ అవుతుంది.
హీరోయిన్ సప్తమి గౌడ మాట్లాడుతూ, ఈ సినిమా చేయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ఇది చరిత్రలో చాలా ముఖ్యమైన చాప్టర్. త్వరలోనే నా క్యారెక్టర్‌కి సంబంధించిన గ్లింప్స్ కూడా రిలీజ్ కాబోతోంది. చాలా మాస్ క్యారెక్టర్ చేశాను. ఇది మన నేల కథ. డైరెక్టర్ చాలా అద్భుతంగా రాశారు. చాలా బిగ్ స్కేల్‌లో ఈ సినిమా తీస్తున్నారు. ఈ సినిమాలో సెట్స్ చాలా అద్భుతంగా ఉంటాయి. ధనుంజయతో ఇది నా సెకండ్ ఫిల్మ్. ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా తప్పకుండా మీ అందరిని అలరిస్తుంది
ప్రొడ్యూసర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ, ఈ సినిమా హీరో లుక్ కట్ చేసినప్పుడే మాకు ఫుల్ కాన్ఫిడెన్స్ వచ్చేసింది. ఫస్ట్ స్టెప్‌లోనే సక్సెస్ అయిపోయామనే ఫీలింగ్ కలిగింది. డైరెక్టర్ సుఖేష్‌పై నాకు చాలా నమ్మకం ఉంది. చాలా ప్యాషన్‌తో ఈ సినిమాను తీశారు. హాలగలి చరిత్రలో ఒక అధ్యాయం. బ్రిటిష్‌కి వ్యతిరేకంగా వారు చేసిన పోరాటం చిరస్మరణీయం. కన్నడలో పదో తరగతి పాఠ్యాంశంలో కూడా ఇది ఉంది. దీని గురించి చాలామంది రీసెర్చ్‌లు చేశారు. ఈ సినిమా గురించి రీసెర్చ్ చేస్తున్నప్పుడు మాకు గూస్ బంప్స్ వచ్చాయి. ఇది ఒక పార్ట్‌లో చెప్పాల్సింది కాదు. రెండు పాటలుగా చెప్పాల్సిన కథని అప్పుడే నిర్ణయించుకున్నాము. సినిమాలో డాలీ క్యారెక్టర్ చాలా పవర్ఫుల్గా అద్భుతంగా ఉండబోతుంది. సప్తమి గారిది మాస్ క్యారెక్టర్. అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు.
ఈ సినిమా కోసం అందరూ చాలా హార్డ్ వర్క్ చేశారు. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. డైరెక్టర్ సుకేష్ మాట్లాడుతూ,అందరికీ నమస్కారం. 40 పర్సెంట్ షూటింగ్ కంప్లీట్ అయింది. ఇది ఒక పార్ట్ లో చెప్పే కథ కాదు. ఈ కథ వెనుక చాలా గొప్ప చరిత్ర ఉంది. అందుకే రెండు పార్ట్స్ గా తీసుకొస్తున్నాం. ఈ సినిమా ఆడియన్స్ గొప్ప థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది అన్నారు.

# 'అర్జున్ చక్రవర్తి' యాంథమ్ రిలీజ్



విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాని నిర్మాత శ్రీని గుబ్బల నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమాకు 46 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వచ్చాయి. ఇటివలే రీలీజైన టీజర్, సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ అర్జున్ చక్రవర్తి యాంథమ్ రిలీజ్ చేశారు. విఘ్నేష్ బాస్కరన్ ఈ సాంగ్ ని పవర్ ఫుల్ కంపోజ్ చేశారు. విక్రాంత్ రుద్ర రాసిన లిరిక్స్ స్ఫూర్తిదాయకంగా వున్నాయి. దీపక్ బ్లూ, బృథ్వీవ్ సత్యకుమార్, విఘ్నేష్ పాయ్ తమ ఎనర్జిటిక్ వోకల్స్ కట్టిపడేశారు. ఈ సాంగ్‌లో విజయరామరాజు ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవుతున్న విజువల్స్, వండర్ ఫుల్ లోకేషన్స్ అద్భుతంగా వున్నాయి. ఈ సాంగ్ విన్న వెంటనే అందరినీ కనెక్ట్ అవుతుంది. ఈ చిత్రంలో హర్ష రోషన్, అజయ్, అజయ్‌ఘోష్, దయానంద్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జగదీష్ చీకాటి డీవోపీ, ప్రదీప్ నందన్ ఎడిటర్, సుమిత్ పటేల్ ప్రొడక్షన్ డిజైనర్. ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. నటీనటులు: విజయ రామరాజు, సిజా రోజ్, హర్ష రోషన్, అజయ్, అజయ్ ఘోష్, దయానంద్ రెడ్డి, దుర్గేష్.




# జాన్వీ ఫ్యాషన్ సెన్స్



ప్రస్తుతం జాన్వీ కపూర్ యూనిక్ వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా షేర్ అవుతోంది. ముఖ్యంగా జాన్వీ ఫ్యాషన్ సెన్స్ పరంగా రోజురోజుకు కొత్తదనంతో షైన్ అవుతోందని అభిమానులు ప్రశంసిస్తున్నారు. నెలవంకను తలపించే లేగకళ్లు.. అందంగా విరబోసిన శిరోజాలు.. గాలికి ఊగిసలాడే భారీ చెవి లోలాకులు.. వైట్ కలర్ టైట్ టాప్, కాంబినేషన్ ఫ్లోరల్ పరికిణీ,.. ఈ వేషధారణ ఎవరిది? అని అనుకుంటున్నారా? నిస్సందేహంగా అది జాన్వీకపూర్. పబ్లిక్‌లో ఇంత అందంగా తనను తాను ప్రెజెంట్ చేసుకునే స్కిల్ జాన్వీకి మాత్రమే ఉంది. అతిలోక సుందరి నటవారసురాలు అలా నవ్వులు చిందిస్తూ ఫోటోగ్రాఫర్లకు హాయ్ చెబుతూ లేదా శిరోజాలను అందంగా సవరిస్తూ, ఎంత ముచ్చటగా కనిపిస్తోంది. వెండి తెరపై తొలిసారి చూసుకున్నపుడు రజనీ ఏం చేశారో తెలుసా? ప్రస్తుతం జాన్వీ కపూర్ యూనిక్ వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా షేర్ అవుతోంది. ముఖ్యంగా జాన్వీ ఫ్యాషన్ సెన్స్ పరంగా రోజురోజుకు కొత్తదనంతో షైన్ అవుతోందని అభిమానులు ప్రశంసిస్తున్నారు. జెన్ జెడ్ కిడ్స్‌లో జాన్వీఫ్యాషన్ సెన్స్ యూనిక్‌గా ఉంటుందని కొందరు కీర్తించారు. పబ్లిక్ అటెన్షన్ తనవైపు తిప్పేసుకోవడంలో జాన్విని మించిన వారే లేరు! అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. కెరీర్ మ్యాటర్‌కి వస్తే... జాన్వీకపూర్ తదుపరి రామ్‌చరణ్ పెద్దిలో నటిస్తోంది. ఉప్పెన ఫేం బుచ్చిబాబు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా చేస్తున్న సమయంలోనే జాన్వీ బ్యాక్ టు బ్యాక్ సినిమా అవకాశాలు వచ్చినా ప్రస్తుతానికి అడపాదడపా మాత్రమే హిందీలో నటిస్తోంది. ప్రస్తుతం సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి పరమ్ సుందరి రిలీజ్ ప్రమోషన్స్‌లో జాన్వీ బిజీ బిజీగా ఉంది. తన తాజా చిత్రం ప్రమోషన్స్ కోసం లక్నో బయల్దేరుతున్నప్పటి వీడియో ఇది. బాలీవుడ్ మీడియా వెంటపడి మరీ జన్వీని ఇంత అందంగా ప్రెజెంట్ చేసింది. స్టిల్ ఫోటోగ్రాఫర్లు లేదా వీడియో జర్నలిస్టులు వెంబడించి విసిగించినా కానీ, అది సెలబ్రిటీలను హైప్ చేయడం కోసం మాత్రమేననేది ఆలియా లాంటి ప్రముఖులు కాస్తయినా గ్రహించాలి. అప్పుడప్పుడు జరిగే తప్పులను క్షమించాలి.

# కుటుంబ అనుబంధాలతో 'నేను నా లల్లి'



కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలతో పాటు హీరోగా నటిస్తూ.. తనే స్వయంగా 'నేను నా లల్లి' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు ఎన్.ఎన్.ఆర్ చౌదరి. నేడు ఆయన పుట్టినరోజు (ఆగస్టు 18). ఈ సందర్భంగా చిత్రానికి సంబంధించిన పలు విశేషాలను వివరిస్తూ... మా సినిమా షూటింగ్ మొత్తం విజయవంతంగా పూర్తయింది. నిర్మాణానంతర పనులన్నీ చకచకా సాగుతున్నాయి. దీనిలో భాగంగానే ఎడిటింగ్ డబ్బింగ్ కూడా పూర్తయ్యింది. ప్రస్తుతం డిఏకి ఎఫెక్ట్స్‌కి.. అదేవిధంగా ఆర్ఆర్ కి ఇవ్వడం జరిగింది. చాలా పకడ్బందీగా ఎంతో స్పీడ్‌గా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. మా 'నేను నా లల్లి' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది. సినిమా కూడా మేము అనుకున్న పద్ధతిలోనే చాలా బాగా వచ్చింది. మా యూనిట్ సభ్యులంతా సినిమాపై ఎంతో నమ్మకంగా ఉన్నారు. సినిమా బాగా తెరకెక్కడానికి వారంతా ఎంతగానో శ్రమించారు. వారందరి శ్రమ వల్లే సినిమా ఆద్యంతం ప్రేక్షకులను వినోదంలో ముంచెత్తడం ఖాయం. ఆ బలమైన నమ్మకం మాకుంది. ప్రేక్షకులకు ఒక మంచి ఫ్యామిలీ ఎఫెక్షన్స్ ఉండేలా చిత్రాన్ని అందిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలతో పాటు హీరోగా నటిస్తూ.. నేనే స్వయంగా కథపై నమ్మకంతోనే 'నేను నా లల్లి' చిత్రాన్ని నిర్మిస్తున్నాను. ఈ చిత్రానికి సంబంధించిన పాటలు కూడా నేనే రాయడం జరిగింది. థియేటర్ కు వచ్చిన ప్రతీ ఒక్కరూ ఈ చిత్రాన్ని చూసి ఎంతగానో ఎంజాయ్ చేస్తారన్న గట్టి నమ్మకం మాకుంది. మా నమ్మకం నిజమని చిత్రాన్ని చూశాక మీరే మెచ్చుకుంటారు. ఈ సినిమాలో నటించిన ప్రతీ ఒక్కరికీ చక్కటి పేరు వస్తుంది. అందరూ తమతమ పాత్రల్లో ఇమిడిపోయి ప్రతిభను కనబరిచారు అని పేర్కొన్నారు. హీరోయిన్ తస్లీమ్ మాట్లాడుతూ .. సినిమాలో నటిస్తున్నప్పుడు ఎంతగానో ఆనందపడ్డాను. నా పాత్ర ఫ్యామిలీ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందన్న నమ్మకం నాకు కలిగింది. ఒక ఫ్యామిలీలో ఉండే అమ్మ, నాన్న, అక్క, చెల్లి, తమ్ముడు, అన్న ఇలా అందర్నీ సినిమా ఆలోచనలో పడేస్తుంది. ఎంత చక్కటి సినిమా చూశామన్న అనుభూతి ప్రతీ ఒక్కరికీ కలుగుతుంది. మా దర్శకుడు, నిర్మాత, హీరో అయిన ఎన్.ఎన్.ఆర్ చౌదరి గారు ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని అందంగా.. అందరూ మెచ్చేలా తెరకెక్కించారు. వారి శ్రమ తెరపై చూడాల్సిందే అని అన్నారు. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో పద్మ జయంతి, హేమ సుందర్, పద్మా రెడ్డి తదితరులు నటించారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎల్. రాజా, మాటలు: మెండెం శ్రీధర్, డీఓపీ : శ్రీనివాసచారి , మేకప్: సాంబశివరావు, డాన్స్: మాస్టర్ కపిల్, ఆర్ట్ డైరెక్టర్ : నాని పండు, ఫైట్ : మాస్టర్ తుఫాన్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ : డ్రీమ్ స్టూడియో , బ్యానర్ : పవన్ తేజ ఫిలిం, కథస్క్రీన్ ప్లేపాటలుదర్శకత్వం నిర్మాత : ఎన్.ఎన్.ఆర్ చౌదరి.

# త్వరలో '1990' మూవీ!



ఎమ్.ఎమ్.సి బ్యానర్‌పై అరుణ్, రాణి వరద్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కుతున్న చిత్రం 1990. కర్ణాటకలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిన ప్రేమ కథా చిత్రం. అద్భుతమైన లొకేషన్స్ లో పాటలు చిత్రికరించిన ఈ చిత్రం. సినిమా షూటింగ్ పూర్తి చేసుకొని త్వరలో తెలుగు, కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో విడుదల కాబోతోంది. నందకుమార్ సి.ఎమ్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాకు నిర్మాత చంద్ర శేఖర్ బిఎస్. ఇటీవల విడుదలైన ఈ చిత్ర టీజర్‌కు మంచి రెస్పాన్స్ లభించింది. త్వరలో ఈ మూవీ సాంగ్స్ ట్రైలర్ విడుదల కానున్నాయి. ఇసి. మహారాజ్ సంగీతం అందించిన ఈ సినిమాకు హోలేస్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎడిటర్ : కృష్ణ, కొరియోగ్రాఫర్: సాధిక్ సర్దార్, నిర్మాత: చంద్ర శేఖర్ బిఎస్, సహనిర్మాత : అరుణ్ కుమార్, పిఆర్ఓ: లక్ష్మీ నివాస్.

# అమెరికాలో '43వ ది వరల్డ్ లార్జెస్ట్ ఇండియా డే' పెరేడ్‌లో విజయ్ దేవరకొండ



ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన ది వరల్డ్ లార్జెస్ట్ ఇండియా డే పెరేడ్‌లో గ్రాండ్ మార్షల్‌గా పాల్గొని సందడి చేశారు హీరో విజయ్ దేవరకొండ. మాడిసన్ అవెన్యూలో సర్వే భవంతు సుఖినః అనే థీమ్‌తో జరిగిన పరేడ్ వేడుకలకు గ్రాండ్ మార్షల్‌గా విజయ్ దేవరకొండ వ్యవహరించారు. ఈ వేడుకల్లో స్థానిక అమెరికన్స్‌తో పాటు భారీ సంఖ్యలో అమెరికాలోని ప్రవాస భారతీయులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ప్రఖ్యాత ఎంపైర్ బిల్డింగ్ మన జాతీయ జెండాలోని మూడు రంగుల విద్యుత్ కాంతులతో వెలిగిపోయింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ మువ్వన్నెల లైటింగ్ ను విజయ్ దేవరకొండ స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. ప్రవాస భారతీయ సోదరులు మన దేశ గొప్పదనాన్ని ప్రపంచానికి చాటుతున్నారు. ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ పై మన మూడు రంగులు చూడటం సంతోషాన్ని కలిగిస్తోంది. దేశం కోసం వీళ్ల చేస్తున్న కాంట్రిబ్యూషన్ చూస్తుంటే గర్వంగా ఉంది. మన పెద్దలు ఎంతోమంది చేసిన త్యాగాలు, వారి కృషివల్లే మనం ఈ రోజు ఇంత ఆనందంగా స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోగలుగుతున్నాం, జీవించగలుగుతున్నాం అన్నారు.

# ముంబయిలో ఏకైక మహిళా శిల్పి



**నాన్న అందమైన విగ్రహాలను తీర్చిదిద్దుతారు. ఆమెకేమో వాటిపై ఆసక్తే లేదు. అలాంటి రేష్మాకాతు ఆయనకు వారసురాలిగా.. ముంబయిలో గణపతి విగ్రహాలను తయారుచేసే ఏకైక మహిళగా ఎలా మారారంటే..**

ఎందుకు నాన్నా.. నా సన్మాన కార్యక్రమాలకు ఎప్పుడూ రావు అని రేష్మని అడిగేవారట తండ్రి విజయ్‌ఖాతు. దానికామె నాకు సినిమాలంటే ఆసక్తి. ఈ విగ్రహాల తయారీ నావల్ల కాదు అనేదట. ఆయనా నవ్వి ఊరుకునేవారు. వీళ్లది ముంబయి. అది 2017 వినాయక చవితికి సరిగ్గా నెలరోజుల సమయమే ఉంది. అకస్మాత్తుగా విజయ్ చనిపోయారు. ఇంకా విగ్రహాలను తీర్చిదిద్దాలి. ఆ పనంతా ఆయనే స్వయంగా చూసుకునే వారు. ఆర్డర్లు ఇచ్చినవారంతా గొడవ చేస్తారని అనుకుందట రేష్మ. కానీ వచ్చినవారిలో విగ్రహాలు సకాలంలో అందవేమోనన్న కంగారు ఉన్నప్పటికీ.. ఆయన చనిపోవడమే పెద్ద లోటుగా భావించడం రేష్మను కదిలించింది. అందుకే మూడోరోజునే తండ్రి వర్క్‌షాప్ బాధ్యతలు తీసుకుంది. రేయింబవళ్లు దగ్గరుండి చకాచకా ఆర్డర్లు పూర్తిచేయించి, అందించింది. మా తాత తరంలో 1947లో వర్క్‌షాప్ ప్రారంభమైంది. చవితి సమయంలోనే వినాయక విగ్రహాలకు డిమాండ్ అనుకుంటారు. కానీ మా ఇంట్లో ఏడాది పొడవునా ఆ సందడి ఉంటుంది. కాబట్టి నాకూ ఆ కళ అబ్బింది. కాకపోతే దానిలోకి వెళ్లడానికే సంకోచించా. కొంతమంది కొన్నేళ్లుగా మా వద్దే విగ్రహాలు తీసుకుంటున్నామని చెప్పినప్పుడు నాన్నకున్న గౌరవ మర్యాదలు అర్థమయ్యాయి. అతి పెద్ద విగ్రహాలు చేయడంలో ఆయనకి మంచి పేరుంది. అందుకే నాన్న వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలనుకున్నా. నాన్న చనిపోయినా మా వర్క్‌షాప్‌లో పనిచేసే కళాకారులు ఆయన మీద గౌరవంతో కొనసాగుతున్నారు. వాళ్లని నేను నడిపిస్తున్నా. ఇది చాలా పెద్ద బాధ్యత. నాన్న నేర్పిన పాఠాలే ముందుకు నడుపుతున్నాయి. అంటోంది 39 ఏళ్ల రేష్మ. తండ్రి చనిపోయినా సకాలంలో ఆర్డర్లు పూర్తిచేయడంతో పాతవాళ్లు కొనసాగడమే కాదు కొత్తవాళ్లూ అవకాశమిచ్చారు. తగ్గట్టే ఈమె తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ముంబయి వ్యాప్తంగా విగ్రహాలను తయారుచేసే ఏకైక మహిళా శిల్పిగా నిలవడమే కాదు.. మంచి పేరు సంపాదించుకుంది రేష్మ.

# దేశ రక్షణలో సహస మహిళలు

**దేశ రక్షణలో సహస మహిళలు నాటి చరిత్రక మహిళల స్ఫూర్తినీ, ఆశయాల్నీ నేటి మహిళలూ అందిపుచ్చుకున్నారు. రణ భూమిలోకి అడుగు పెతున్నారు. శత్రుదేశాలమీద నిప్పులు కురిపిస్తున్నారు. అత్యాధునిక యుద్ధ విమానాల్నీ, నౌకాదళాలనీ నడిపిస్తున్నారు. నేటికీ సమాజంలో పాతుకుపోయిన వివక్షల్ని రూపుమాపేందుకూ అణిచివేతలకు నిరసనగానూ తమ గళాన్ని వినిపిస్తున్నారు. మన ధీరవనితలు.**

**రఫేల్ రాణి:** ఫైట్‌లెఫ్టినెంట్ శివాంగి సింగ్




మహిళల త్యాగం, సహకారం అందించకుండా స్వాతంత్ర్యోద్యాన్ని పోరాట చరిత్ర అసంపూర్ణం. అలాగే స్త్రీ శక్తి లేని ఆపరేషన్ సిందూర్‌నీ ఊహించలేం. అందులో కీలకపాత్ర పోషించిన వాళ్లలో ఫ్లైట్ లెఫ్ట్ నెంట్ శివంగి సింగ్ ఒకరు. ఈమె రఫేల్ స్క్వాడ్రన్‌లో తొలి ఏకైక మహిళా ఫైటర్ పైలట్, గగనతలంలోనేకాదు, నేలమీద ఎలక్ట్రానిక్, న్యూక్లియర్ దాడులు చేయగలిగిన రఫేల్ నడపడానికి ధైర్యం, తెగువ మాత్రమే కాదు, మరెన్నో నైపుణ్యాలూ కావాలి. అవన్నీ సొంతం చేసుకున్న శివంగిది ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి, ఏడెనిమిదేళ్ల వయసులో న్యూఢిల్లీలోని ఎయిర్‌ఫోర్స్ మ్యూజియం సందర్శనకు వెళ్లినప్పుడు తొలిసారిగా విమానాన్ని తాకి, పైలట్ కావాలని నిర్ణయించుకున్నారట. అందుకోసం చిన్ననాటి నుంచీ ఎంతో కష్టపడ్డారీమె. కాలేజీలో ఎన్‌సిసి ఎయిర్‌వింగ్‌సభ్యురాలు, బనారస్ హిందూ యూనివర్సిటీలో డిగ్రీ చేశాక హైదరాబాద్‌లోని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో చేరారు. మొదట మిగ్21 బైసన్ మీద కఠిన శిక్షణ తీసుకున్నాక, 2020లో రఫేల్ శిక్షణకు ఎంపికయ్యారీమె. ఫ్రాన్స్‌లో ఐఏఎఫ్ విన్యాసాల్లోనూ పాల్గొన్నారు. నాకు ప్రేరణ మా అమ్మ. ఆమె నేను చదువుకే పరిమితం కావాలనుకోలేదు. దేశరక్షణ దిశగా ప్రోత్సహించింది. మొదటిసారి మిగ్21 బైసన్ ఫైటర్ జెట్ మీద శిక్షణ తీసుకున్నప్పుడే అర్థమైంది. యుద్ధ విమానాలను నియంత్రించడానికి బహుముఖ నైపుణ్యాలు కావాలని. ఆ తరవాత మరెంతో కఠినమైన శిక్షణ తీసుకుని, ఫ్రెంచ్ ఇన్‌స్ట్రక్టర్ల ఆధ్వర్యంలో రఫేల్ సిమ్యులేటర్‌లోని కాక్‌పెట్‌లో కూర్చున్నా. అప్పుడు నాలో భయాందోళనలేమీ లేవు. స్వేచ్ఛగా అనిపించింది. అయితే నేను ఇకనకడితోనే ఆగిపోవాలి అనుకోవడం లేదు. మనదేశం త్వరలోనే మానవ సహిత అంతరిక్ష యాత్రకు ప్రణాళిక రచిస్తోంది. వ్యోమగామిగా నేను అందులో ఉండాలి. ధైర్యసాహసాలు అవసరమైన ఈ రంగంలో ఓ మహిళ విజయవంతమైతే, మరికొందరు మహిళలు ముందుకొస్తారు' అంటారీ రఫేల్‌రాణి. భారత రక్షణ దళాల్లో మహిళల్ని ఫ్రంట్‌లైన్ పోరాటంలోకి వచ్చేలా చేయడంలో శివాంగి మైలురాయిగా నిలిచిపోతారు.

**సాహసాల ప్రేరణ : -కమాండర్ ప్రేరణ దేవస్థలి.**



చిన్నప్పుడు విమానాలు, హెలికాప్టర్ల విన్యాసాలు చూసి.. ఆ రంగంపై ఇష్టం పెంచుకున్నారు. ఎప్పటికైనా యుద్ధ విమానాలు నడపాలన్నది ఆమె కోరిక. ప్రేరణ స్వస్థలం ముంబయి. అక్కడే సెయింట్ జేవియర్స్ కాలేజీ నుంచి సైకాలజీలో పిజి చేశారామె. ఆపై తన లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు ఎంతో శ్రమించి 2009లో భారత నౌకాదళంలోకి అడుగుపెట్టారామె. మనస్తత్వ శాస్త్రం చదివిన నేపథ్యం... మనుషుల ప్రవర్తనను సులువుగా చేసుకునే తత్వం, నిర్ణయాలు తీసుకునే సామర్థం, సంక్షోభ సమయంలో చాకచక్యంగా వ్యవహరించే నేర్పు ఆమె నావికాదళంలో తనదైన శైలిలో వేయడానికి సహకరిస్తుంది. అతిపెద్ద సముద్ర విమానాల్లో ఒకటైన మహిళా టుపోలెవ్ టీయూ142లో మొదటి అబ్జర్వర్గా పనిచేశారు. తర్వాత పి8ఐ సముద్రగస్తీ విమానంలో నావల్ ఎయిర్ అబ్జర్వర్గా పనిచేశారు. ఆపై ఐఎన్ఎస్ చెన్నైలోనూ, కోల్కతా క్లాస్ డిస్ట్రార్ ఐఎన్ఎస్ చెన్నై (డి65)లో మొదటి లెఫ్టినెంట్‌గా పనిచేశారు. 2023 డిసెంబరులో భారత యుద్ధ నౌక ఐఎన్ఎస్ త్రింకటు కమాండింగ్ ఆఫీసర్‌గా నియమితుల య్యారు. ఆ ఘనత సాధించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు. అన్న ఇషాన్ దేవస్థలి కూడా నావికాదళ అధికారే. ఐఎన్ఎస్ త్రింకట్ కమాండింగ్ ఆఫీసర్‌గా ప్రేరణ, ఐఎన్ఎస్ విభూతి కమాండింగ్ ఆఫీసర్‌గా ఇషాన్... ఒకేసారి నియమితులవ్వడం మరో విశేషం. సాహసాలు చేయడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. ఆమె ప్రతిభ ప్రతి ఒక్కరికీ ప్రేరణ కలిగించింది. కెరియర్ ఆరంభంలోనే మన వ్యాపారనౌకపై సోమాలియా సముద్ర దొంగలు చేసిన దాడిని తిప్పికొట్టారు. ఆమె కుటుంబంలో అన్నతో పాటు భర్త కూడా నేవీ అధికారే.

# ఫేస్‌వాష్ ఏది వాడుతున్నారు?



ఏ ఫేస్‌వాష్ వాడుతున్నారు? స్కిన్‌కేర్ రొటీన్‌లో మొదట గుర్తొచ్చే ఉత్పత్తి ఏది? ఫేస్‌వాష్ కదూ! అత్యంత ప్రధాన మైనది కూడా. కానీ దాన్ని ఎంచుకోవడంలోనే సమస్య. ఎవరినో గుడ్డిగా అనుసరించక.. మీకు అనువైనదేదో మీరే ఎంచుకోండిలా.. ముఖం శుభ్రం చేసుకోవడానికేగా..ఏదైతేనేం చాలామంది ఇలాగే అనుకుని అశ్రద్ధ చేస్తారు. క్రీములపై పెట్టన శ్రద్ధ దీనిపై పెట్టరు. కానీ అదే తగదు. మీది జిడ్డుచర్మం, యాక్నే కూడా ఉంటే జెల్, క్లే రకాలను ఎంచుకోండి. ఇవి నూనెల విడుదలనుతగ్గించడమే కాదు..యాక్నేకి కారణ మయ్యే బ్యాక్టీ రియానూ దూరం చేస్తాయి. పొడి, సెన్సిటివ్ చర్మాల వాళ్లకి క్రీమ్ తరహావి నప్పుతాయి. ఫోమ్ క్లెన్సర్లు కాంబి నేషన్ చర్మం ఉన్నవారికి సరిపోతాయి. అదే మిసెల్లర్ రకాలనుకోండి.. ఏచర్మరకమైనా ఎంచుకోవచ్చు. ఇక యాక్నే, బ్లాక్, వైట్ హెడ్స్ ఇబ్బంది పెడుతోంటే సాల్సిలిక్ యాసిడ్, బెంజైల్ పెరాక్సైడ్ ఉండేలా చూసుకోవాలి. టీట్రీ ఆయిల్ రకాల్లోని యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలూ యాక్నేకి చెక్ పెడతాయి. చర్మం పొడిబారి ముడతలు, గీతలు వస్తోంటే హైలురోనిక్ యాసిడ్, సెరమైడ్ రకాలు కావాలి. ఇవైతే కావాల్సిన తేమను అందించి, స్కిన్ నిగనిగలాడేలా చేస్తాయి. చరనమం నునుపుగా కనిపించాలి. పిగ్మెంటేషన్ పోవాలంటే నియాసినమైడ్ చక్కని పరిష్కారం.. మీ ఫేస్‌వాష్‌లో దీనికి చోటివ్వాల్సిందే. చర్మం తీరేదైనా.. ఎంచుకున్నా క్లెన్సర్‌లో సల్ఫేట్స్, కృత్రిమ, సింథటిక్ సువాసనలు, ఆల్కహాల్, థాలేట్స్, పారాబెన్స్ వంటివి ఉండకుండా చూసుకోండి. ఇవి చర్మానికి హాని కలిగించడమే కాదు.. అప్పటికే ఉన్న సమస్యలనీ తీవ్రతరం చేయగలవు. కాబట్టి.. ఎంచుకునేప్పుడే సరిచూసుకోండి. మీకు తగినదే వాడండి.

# పిల్లలతో స్నేహం ..



**కొంత మంది పిల్లలు ఇంట్లో చలాకీగా ఉండి, స్కూల్లో, బయట ఎవ్వరితోనూ కలవకుండా ముభావంగా** ఉంటారు. మీ చిన్నారుల్లో కూడా ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయా? అయితే వారికి బయటి ప్రపంచాన్ని తప్పక పరిచయం చేయాల్సిందే. లేదంటే సామాజిక నైపుణ్యాలు కొరవడతాయి. కాబట్టి.. వీటిని అలవాటు చేయండి. తోటివారితో, తోబుట్టువులతో మాట కలిపేలా ప్రోత్సహించండి. అప్పుడే చిన్న బుర్రలకి బయటి ప్రపంచం పరిచయం అవుతుంది. ఇతరులతో ఎలా మెలగాలి, ఏం మాట్లాడాలన్నదీ వారికి తెలుస్తుంది. క్రీడల్లో వారిని భాగస్వాములను చేయాలి. అందుకోసం స్పోర్ట్స్ అకాడెమీలో వారిని చేర్పించండి. క్రీడలు మానసిక ఎదుగుదలకి దోహదపడతాయి. కొత్త స్నేహితులు పరిచయం అవు తుంటారు. దాంతో కొత్తవారితో మాట్లాడాలంటే బిడియం పోతుంది. తల్లితో తప్ప ఎవ్వరితోనూ పెద్దగా మాట్లాడని చిన్నారులు ఒకేసారి బయట ప్రపంచంలో కలవడం కాస్త కష్టం. ఆ ఇబ్బందిని మీతో పంచుకున్నప్పుడు మీరు దానికి సానుకూలంగా స్పందించాలి. లేదంటే ఆత్మన్యూనతకు లోనయ్యే అవకాశం ఉంది. వారు చెప్పే కారణాలకి మీ అనుభవాలను జోడించి స్నేహాన్ని ప్రయతిననంచమని చెప్పాలి. . చిన్నపిల్లలకు ఇప్పుడు మనం ఏం చెబితే అదే వారి మనసులో బలంగా నాటుకుపోతుంది. అందువల్ల స్నేహాల్లో ఎటువంటి తారతమ్యం ఉండకూడదని వివరించండి. అప్పుడే

## బఫే ల్యాడర్



కొన్నిసార్లు బంధు మిత్రులను పిలిచి విందు ఇస్తుంటాం. అలాంటప్పుడు..కూర, చారు, పచ్చడి, రసం..ఇలా ఒక్కో పాత్రనూ విడివిడిగా తెచ్చే బదులు..అన్నీ ఒక స్టాండ్‌లో ఉన్నాయను కోండి.. వీలుగా ఉంటుంది కదూ! ఈ ఆలోచనతో రూపొందిందే 'బ ఫే ల్యాడర్' ఇందులో అన్న, కూరలే కాదండోయ్. పండ్లు, స్వీట్లు, డ్రైఫ్రూట్స్. ఇలా వేటినైనా అమర్చవచ్చు. అదివ్వు, ఇదివ్వు అంటూ ఎవరూ, ఎవర్నీ అడగాల్సిన అవసరం లేకుండా. ఈ స్టాండ్‌లో ఉంచామంటే ఎంచక్కా అందరూ కలిసి ఆనందంగా ఆరగించవచ్చు.

# వన్నె తెచ్చే వెదురు బుట్టలు !





సహజంగా ప్రకృతిలో దొరికేవి ఏవైనా ఒంటికి ఆరోగ్యాన్నీ, ఇంటికి అందాన్నీ తెచ్చి పెడతాయనడంలో సందేహమే లేదు. అలాంటివే ఈ వెదురు, గడ్డితో చేసిన బుట్టలు కూడా. ఇప్పుడివి గృహాలంకరణలో భాగమై అలరిస్తున్నాయి. ఆధునిక సౌకర్యాలు ఎన్ని ఉన్నా.. వంటగది, మాడ్యులర్ మోడల్ అంటూ ఏం చెప్పినా సరే.. వెదురు ఉండాల్సిందే. ముఖ్యంగా అల్మారాల్లో వికర్ బుట్టల్ని తప్పక చేరుస్తున్నారు. ఉల్లి, వెల్లుల్లి, పండ్లు కూరగాయలు.. వంటివి తాజాగా ఉండేందుకు తగినంత గాలి తగిలేలా ఈ బుట్టల్ని ఎంచుకుంటున్నారు. వినియోగదారుల అభిరుచిని బట్టి ఎన్నెన్నో ఆకృతుల్లో సందడి చేస్తున్నాయివి. వాటిని మీరు చూస్తే మెచ్చకుండా ఉండలేరు. ఓసారి ఇటు లుక్కేయండి!



















# పంచమవేదం



పైకి అన్నదమ్ముల కథగానే కనిపించినా..మన అభ్యుదయానికి అవసరమైన సర్వధర్మాలకూ ఆధారం మహాభారతం.

అందుకే భారతంలో లేనిది లోకంలో ఉండదని, లోకంలో ఉన్నదంతా ఆ ఇతిహాసంలో ఉందని పండితులు తేల్చి చెప్పారు. సుమారు 300 పాత్రలతో ఉత్కంఠభరితంగా సాగిన భారతాన్ని మించిన కథ ప్రపంచంలోనే లేదు. సకల ధర్మాలకూ ఆధారం వేదం. ఇందులో కర్మకాండ, ఉపాసనాకాండ, జ్ఞానకాండ భాగాలున్నాయి. వేదాలు ప్రబోధించిన అంశాలన్నీ భారతంలో కనిపిస్తాయి. కౌరవ, పాండవ గాథను ఆధారంగా చేసుకొని వేద ధర్మాన్ని, వేదాంత విజ్ఞానాన్ని అందించాడు వ్యాసమహర్షి. కొన్ని ప్రత్యక్షంగా, మరికొన్ని పరోక్షంగా ఉండటం ఇందులోని విశిష్టత. ఇలా నాలుగు వేదాల్లోని ధర్మసారాన్ని సామాన్యులకు అందించటం వల్ల మహాభారతం పంచమవేదంగా ప్రసిద్ధమైంది. వైదికయజ్ఞ విశేషాలు, భగవద్గీత, విదురనీతి, యక్షప్రశ్నలు.. ఇలా అనేక విశేషాలనుగుదిగుచ్చిన గజమాల ఆ గ్రంథం. మహాభారతాన్ని అర్థం చేసుకోలేనివారు వేదాలను గ్రహించలేరని ఆదిపర్వంలో స్పష్టం చేశారు. ధర్మార్థకామమోక్షాలనే నాలుగు పురుషార్థాల్లోని అంశాలన్నీ అందులోనే ఉన్నాయి అన్నాడు వ్యాసుడు. ఇక ఆదికవి నన్నయ్య వేదవ్యాసుడి మహాభారతం ధర్మతత్త్వజ్ఞులకు ధర్మశాస్త్రం, ఆధ్యాత్మవేత్తలకు వేదాంతం, న్యాయ కోవిదులకు నీతిశాస్త్రం, కవులకు మహాకావ్యం అని పిండితులంతా వేనోళ్ల మెచ్చుకుంటున్నారు అంటూ మహాభారతం గొప్పతనాన్ని ప్రశంసించాడు.

ఆధ్యాత్మికం

# ఇడ్లీ దోశ.. ఎంతో మేలు!

అమ్మో! బరువు పెరుగుతాం. ఆ ఇడ్లీ, దోశలు మేం తినం బాబోయ్..అనేఅమ్మాయిల సంఖ్యా ఇప్పుడు పెరిగింది. దాంతో రకరకరాల పాశ్చాత్య అల్పాహారాలకే వారు ఓటేస్తున్నారు. మీరూ అంతేనా? అయితే, ఆ అభిప్రాయాన్ని మార్చుకోవాల్సిన సమయం వచ్చింది. ఎందుకంటే, రుచిలో రాజీ పడకుండా, బరువు పెరగకుండా ఉండే ఆరోగ్యకరమైన అల్పాహారాలు మన దక్షిణాదికే సొంతమని చెబుతున్నారు పోషకాహార నిపుణులు. అదెలా అంటే..



◆. దక్షిణాది రుచుల్లో ఇడ్లీ, దోశ, ఉప్మా, పొంగల్, బిసిబిళె బాత్, ఊతప్పం, అప్పం.. వంటివి కొన్ని ఇక వాటికి సాంబార్, చట్నీ కలిస్తే రుచి అమోఘం. సాధారణంగా మన టిఫిన్లలో పులియబెట్టే ప్రక్రియ ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థకు ఎంతోన మేలు. వీటిల్లో ప్రధానంగా వాడే బియ్యం, పప్పుల్లో శరీరానికి అవసరమైన కార్బోహైడ్రేట్లూ, ప్రొటీన్లూ పుష్కలంగా ఉంటాయి. కండరాల మరమ్మతు, పెరుగుదలలో వీటి పాత్ర కీలకం.

◆ ఇక, దాదాపు మన వంటలనింట్లోనూ పసుపు, జీలకర్ర, ఆవాల్లాంటివి ఉండాల్సిందే. పసుపులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణదాలు..రుతుక్రమ సమస్యలను రానీయవు. జీలకర్ర, ఆవాలు జీర్ణ ప్రక్రియను సులభ తరం చేస్తాయి.


◆ కిచిడీ, బిసిబిలె బాత్ లాంటి అల్పాహారాల్లో చిక్కుళ్ల సహా పలు కూరగాయలు వాడటంవల్ల పీచు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి బరువు పెరగకుండా చూస్తాయి.

◆. ఇడ్లీ, ఉప్మా.. ఆవిరి పట్టడం, ఉడకబెట్టడం వంటి పద్ధతుల్లో తయారుచేయడం వల్ల ఆ పదార్థాలు పోషక సమగ్రతను కలిగి ఉంటాయి. దాంతో కొవ్వులు, కెలోరీలు తక్కువ పాళ్లలో ఉంటాయి. ◆.సాంబారు, చట్నీల్లో వాడే చింతపండు, కరివేపాకు, కొబ్బరిలోని యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లను అందించి, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ◆. రాగి దోశ లాంటి తక్కువ గ్లైసమిక్ ఇండెక్స్ ఉన్న ఆహారం రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సాయపడుతుంది. ఆకలినీ నియంత్రిస్తుంది. కాబట్టి, మన అల్పాహారాలు రుచికి రుచీ, ఆరోగ్యానికి ఆరోగ్యాన్నీ ఇస్తాయన్నమాట.

# మటర్ బర్ఫీ

**కావలసినవి:** పచ్చి బఠాణీలు-పావుకిలో, పాలపొడి, జీడిపప్పు పొడి, ఎండుకొబ్బరి పొఇ-కప్పు చొప్పున, పంచదార-2 కప్పులు, నెయ్యి-అరకప్పు, బాదడం పలుకులు-చెంచా

**తయరీ:** పచ్చి బఠాణీలను ఉడికించి..చల్లారాక నీళ్లు తీసేసి గ్రైండ్ చేయాలి. ఒక పాత్రలో నెయ్యి వేసి బఠాణీ గుజ్జును వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే పాత్రలో పంచదార తీగ పాకం తయారుచేసి.. అందులో వేయించిన బఠాణీ పేస్టు వేసి, సన్న సెగ మీద ఉడికిస్తూ తర్వాత పాలపొడి వేయాలి. ఉండకట్టకుండా కలియ తిప్పుతుండాలి. దగ్గరపడిన తర్వాత ఎండుకొబ్బరి పొడి, జీడిపప్పు పొడి వేయాలి. పాత్రకు అంటుకోకుండా ఉన్నప్పుడు దించేయాలి. పళ్లెంలో నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని సమంగా సర్ది, పైన బాదం పలుకులు వేయాలి. చల్లారాక ముక్కలుగా చేసుకోవడమే.



# ఆసియా కప్ అత్యధికసార్లు భారత్‌కే



## 16 ఎడిషన్లలో 8 సార్లు విజయం

## శ్రీలంక 6, పాక్2 సార్లు విన్

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025 సందడి మొదలైంది. క్రికెట్ అభిమానుల ఆసక్తి అంతా ఇప్పుడు ఏషియా కప్‌పైనే ఉంది. ఈ మెగా టోర్నమెంట్ సెప్టెంబర్ 9 నుంచి అదే నెల 28 వరకు యూఏఈలోని దుబాయ్, అబుదాబి నగరాల్లో జరగనుంది. ఈసారి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ టోర్నీని నిర్వహిస్తోంది. ఇది ఆసియా కప్ 17వ ఎడిషన్ కావడం విశేషం. ఈసారి ఈ టోర్నీని టీ20 ఫార్మాట్‌లో నిర్వహిస్తున్నారు. వాస్తవానికి, ఆసియా కప్ టీ20 ఫార్మాట్‌లో జరగడం ఇది మూడోసారి మాత్రమే. మిగిలిన 14 సార్లు వన్డే ఫార్మాట్‌లో జరిగింది. ఇప్పటి వరకూ జరిగిన ఏషియాకప్‌లో టీమిండియాదే అత్యధిపత్యం. ఆసియాలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నమెంట్ అయిన ఆసియా కప్‌ను 1984లో ఆసియా క్రికెట్ కౌన్సిల్ ప్రారంభించింది. 2016 నుంచి ఈ టోర్నమెంట్ ఐసీసీ ప్రధాన టోర్నమెంట్ల ఫార్మాట్‌కు అనుగుణంగా వన్డే లేదా టీ20 ఫార్మాట్‌లో జరుగుతోంది. ఈ టోర్నమెంట్‌ను టీ20 ఫార్మాట్‌లో నిర్వహించడంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. ఆసియా కప్ చరిత్రలో భారత్, శ్రీలంక, పాకిస్తాన్ జట్లు ఆధిపత్యం చెలాయించాయి. ముఖ్యంగా భారత్, పాకిస్తాన్, శ్రీలంక మధ్య జరిగే మ్యాచ్‌లు ఎప్పుడూ థ్రిల్లింగ్‌గా ఉంటాయి. ఈ టోర్నీలో అత్యధికంగా విజయం సాధించిన జట్టుగా భారత్ నిలిచింది. ఇప్పటివరకు టీమిండియా ఏకంగా 8 సార్లు (1984, 1988, 1991, 1995, 2010, 2016, 2018, 2023) విజేతగా నిలిచింది. ఆ తర్వాత శ్రీలంక 6 సార్లు (1986, 1997, 2004, 2008, 2014, 2022) ట్రోఫీని గెలుచుకుంది. పాకిస్తాన్ కూడా 2 సార్లు (2000, 2012) విజేతగా నిలిచింది. బంగ్లాదేశ్ మూడు సార్లు ఫైనల్‌కు చేరినా, ఇప్పటివరకు ఒక్కసారి కూడా టైటిల్ సాధించలేకపోయింది. ఈసారి ఆసియా కప్‌లో మొత్తం 8 జట్లు పాల్గొంటున్నాయి. వీటిని ఒక్కో గ్రూప్‌లో నాలుగు జట్ల చొప్పున రెండు గ్రూప్‌లుగా విభజించారు. భారత్ తన మొదటి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న యూఏఈతో ఆడనుంది. ఈ టోర్నీలో అత్యంత ఆసక్తికరమైన విషయం భారత్‌పాకిస్తాన్ మ్యాచ్‌లు. ప్రస్తుతం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, రెండు జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. అంటే కనీసం లీగ్ దశలో ఒక మ్యాచ్ ఆడతాయి. ఒకవేళ ఇరు జట్లు సూపర్ ఫోర్ రౌండ్‌లోకి వెళ్తే, అక్కడ మరోసారి తలపడతాయి. ఇక ఫైనల్‌కు కూడా చేరితే, టైటిల్ కోసం మరోసారి పోరాడతాయి. ఈసారి భారత్, పాకిస్తాన్ మధ్య మూడు హైఓల్టేజ్ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది.

# డ్యూరాండ్ కప్‌లో ఇండియన్ నేవీ ఎఫ్‌టి ఓటమి

## సెమీఫైనల్స్‌కు షిల్లాంగ్



**న్యూఢిల్లీ:** డ్యూరాండ్ కప్ తొలి క్వార్టర్ ఫైనల్‌లో షిల్లాంగ్ లాజోంగ్ ఎఫ్‌సి 2-1 తేడాతో ఇండియన్ నేవీ ఎఫ్‌టిని ఓడించి వరుసగా రెండో సెమీఫైనల్‌కు చేరుకుంది. విజయ్ మరాండి తొలి అర్ధభాగంలో భారత నేవీకి ఆధిక్యాన్ని అందించిన తర్వాత, దమైట్‌ఫాంగ్ లింగ్డో, ఎవర్‌బ్రైట్‌సన్ సనా మైలియంప్డా రెండవ అర్ధభాగంలో చేసిన గోల్స్ ఆతిథ్య జట్టుకు విజయాన్ని అందించాయి. షిల్లాంగ్ లాజోంగ్ 4-3-3 ఫార్మేషన్‌లో ప్రారంభమైంది. ప్రధాన కోచ్ బీరేంద్ర థాపా ఫ్రాంగ్కి బువామ్, ఎవర్‌బ్రైట్‌సన్ సనా, షీన్ స్టీవెన్‌సన్‌లను మిడ్‌ఫీల్డ్‌లో డమైట్‌ఫాంగ్ లింగ్డో, ట్రెయిమికి లాముర్‌రోంగ్, గ్లాడీ ఖర్బులితోను, భారత నేవీ హెడ్ కోచ్ రామన్ రాయ్ తన జట్టును సాంప్రదాయ 4-4-2 ఫార్మేషన్‌లో రంగంలోకి దించారు. కెప్టెన్ భాస్కర్ రాయ్ గోల్‌ను కాపాడుతుండగా, శ్రేయాస్ వీజీ, విజయ్ మరాండి బరిలోకి దిగారు. మొదటి అర్ధభాగంలో 35వ నిమిషం వరకు చాలా తక్కువ అవకాశాలు మాత్రమే వచ్చాయి. రెండు నిమిషాల ముగింపులో భారత నేవీ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రెండు ఎండ్లలో గోల్ కీపర్లు అద్భుతమైన సేవ్‌లు చేసేలోపు గోల్ వచ్చింది. రెండవ అర్ధభాగంలో షిల్లాంగ్ లాజోంగ్ సమం చేసే క్రమంలో 69వ నిమిషంలో లక్కీ బ్రేక్‌తో చివరికి దమైట్‌ఫాంగ్ లింగ్‌డో ఇచ్చిన క్రాస్ బంతి గోల్ చేసింది. 79వ నిమిషంలో యువ ఆటగాడు ఎవర్‌బ్రైట్‌సన్ సనా గెలిచి పెనాల్టీని గోల్‌గా మార్చడంతో షిల్లాంగ్ లాజోంగ్ ఆధిక్యంలోకి వెళ్లి పెనాల్టీని గోల్‌గా మార్చాడు. దీంతో షిల్లాంగ్ లాజోంగ్ సెమీ ఫైనల్‌కు చేరుకుంది.




# స్క్వాష్ బేగా ఓపెన్‌లో..

# అనహాత్ నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** ఎన్ఎస్‌డబ్ల్యూ స్క్వాష్ బేగా ఓపెన్‌లో తొలి పిఎస్ఎ కాపర్ ఫైనల్‌లో అనాహాత్ సింగ్ నిష్క్రమించింది. నాల్గవ గేమ్‌లో గాయంతో వాకోవర్ ఇచ్చింది. ఆదివారం ఆస్ట్రేలియాలోని బేగాలో జరిగిన పిఎస్ఎ వరల్డ్ టూర్ ఈవెంట్-2025 ఎన్ఎస్‌డబ్ల్యూ స్క్వాష్ బేగా ఓపెన్‌లో భారత టీనేజ్ సంచలనం అనహాత్ తన తొలి ఫైనల్‌లో రన్నరప్‌గా నిలిచింది. సెమీఫైనల్ సమయంలో చీలమండ గాయం కారణంగా ఆ యువతి తన విజయ పరంపరను కొనసాగించలేకపోయింది, దీంతో ఆమె ఈజిప్టుకు చెందిన హబీబా హానితో జరిగిన నాల్గవ గేమ్‌లో 11-9, 5-11, 8-11, 4-10 తేడాతో ఫైనల్ మ్యాచ్ నుండి వైదొలగాల్సి వచ్చింది. ప్రపంచ 53వ ర్యాంకర్ అనాహత్ ఈ టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి వరల్డ్ టూర్‌లో తన తొలి ఫైనల్‌కు చేరుకుంది. ఇది ఆమె మొదటిసారిగా ప్రపంచంలోని టాప్ 50 ర్యాంక్ క్రీడాకారిణుల జాబితాలోకి ప్రవేశించడానికి కూడా సహాయపడుతుంది. ఫైనల్లో, అనాహత్ మెరుగైన ఆరంభాన్ని ఇచ్చి ప్రారంభ గేమ్‌ను 11-9 తేడాతో గెలుచుకుంది. కానీ తర్వాత ఆమె గాయం తీవ్రం కావడంతో ఆమె యువ ఈజిప్షియన్ క్రీడాకారిణి వేగాన్ని అందుకోలేకపోయింది. దీంతో రెండవ గేమ్‌ను కోల్పోయింది. 17 ఏళ్ల ఆమె మూడవ గేమ్‌లో పోరాటం కొనసాగించినా కానీ 8-11తో దగ్గరగా ఓడిపోయింది.

## ఆసియా కరాటే ఛాంపియన్‌షిప్‌లో

# హృదాన్‌కు స్వర్ణం

## 7 పతకాలతో ముగిసిన భారత్ పోరు




**న్యూఢిల్లీ:** ఆసియా కరాటే యూత్ ఛాంపియన్‌షిప్-2025ను భారత్ 7 పతకాలతో ముగించింది. హ్రిడాన్ జట్టు గతంలో మూడు పతకాలు సాధించిన ప్రదర్శనను మెరుగుపరుచుకోవడంతో ఈ సారి స్వర్ణంతో మెరిసింది. చివరి రోజు ఆదివారం హృదాన్ స్వర్ణంతో టోర్నమెంట్‌ను ముగించాడు. ఈ నెల 12 నుండి చైనాలోని లిన్పింగ్‌లో జరిగిన 2వ ఆసియా యూత్ ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ కరాటే జట్టు స్వర్ణంతో సహా మొత్తం ఏడు పతకాలను గెలుచుకుంది. కుమితేలో 4 మరియు కటాలో 3 పతకాలు గెలుచుకున్న యువ భారత బృందం. అండర్ 14 విభాగంలో హృదాన్ (50 కిలోల కుమితే) స్వర్ణం సాధించగా, కుష్ (40 కిలోల కుమితే) రజతంతో సరిపెట్టుకున్నాడు. క్యాడెట్‌లో లోహిత్ (63 కేజీల కుమితే). రైనా ( అండర్ 10 కటా) కాంస్య పతక విజేతల్లో ఉన్నారు. అండర్ 12 (45 కిలోల కుమితే) విభాగంలో విభు భారత్ పతకాల జాబితాలో మరో కాంస్యం సాధించాడు. హృదాన్, అర్మాన్, కుష్‌లతో కూడిన అండర్ 14 కటా జట్టు, శ్రేయాన్ష్, తుషార్, వశిష్ట్‌లతో కూడిన క్యాడెట్, జూనియర్ కటా టీమ్ ఒక్కో కాంస్యం గెలుచుకుంది. కాగా గత ఎడిషన్‌లో భారత బృందం కేవలం మూడు పతకాలు మాత్రమే గెలుచుకుంది.

# మహిళల వన్డేలో భారత్ ఓటమి

## 9 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే మూడో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమి చెందింది. 9 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. అయితే ఇప్పటికే జరిగిన రెండు వన్డే మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొంది 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇక బ్రిస్బేన్‌లో ఆదివారం జరిగిన మూడో వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ తడబడింది. ఆస్ట్రేలియా బౌలర్లు తహ్లియా మెక్‌గ్రాత్ (8-0-40-3), అనిక లియారాయ్డ్ (3-0-16-2), ఎల్లా హేవర్డ్ (10-0-40-2), సియన్నా జింజర్ (8.4-0-50-2), లూసీ హ్యామిల్టన్ (10-2-34-1) సత్తా చాటడంతో 47.4 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌట్ అయింది. షెఫాలీ వర్మ (52), యస్తికా భాటియా (42) పోరాటపటిమ కనబర్చి భారత్‌కు ఈ మాత్రం స్కోరైనా అందించారు. వీరు మినహా టీమిండియాలో ఎవరూ రాణించ లేదు. నందిని కశ్యప్ (28), రఘవి బిస్త్ (18) తనుశ్రీ సర్కార్ (17), కెప్టెన్ రాధా యాదవ్ (18), తనుజా కన్వర్ (15) రెండంకెల స్కోర్లు చేయగా, తేజల్ హసబ్నిస (1), మిన్నూ మణి (5), సైమా ఠాకోర్ (0), షబ్నమ్ షకీల్ (7 నాటౌట్) సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా సునాయాసంగా ఛేదించింది. ఓపెనరల్ అలిస్సా హీలీ (84 బంతుల్లో 137 నాటౌట్, 23 ఫోర్లు, 3 సిక్సర్లు) సుడిగాలి శతకంతో ఆస్ట్రేలియాను విజయతీరాలకు చేర్చింది. ఆమెకు మరో ఓపెనర్ తహ్లియా విల్సన్ (59), రేచల్ ట్రెనామన్ (21 నాటౌట్) సహకరించారు. కాగా ఇరు జట్ల మధ్య ఏకైక టెస్ట్ మ్యాచ్ ఈ నెల 21 నుండి ప్రారంభం కానుంది. ఈ మల్టీ ఫార్మాట్ సిరీస్ కోసం టీమిండియా ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది.




## వాణిజ్యం



# ఇకపై గూగుల్‌లో వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహిస్తాం

## గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** వర్చువల్ విధానంలో ఉద్యోగనియామకాలు జరుపుతుంటే నమ్మకం కలిగిన వ్యక్తులు రావడంలేదని గూగుల్‌సిఇఒ సుందర్‌ఫిచాయ్ అన్నారు. అందుకే గూగుల్‌లో మళ్లీ వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధంచేస్తున్నట్లు వెల్లడించారు. మంచి నైపుణ్యం కలిగిన వ్యక్తులను నిర్ధారించుకోడానికి అభ్యరునతలను కనీసం ఒకవిడత వ్యక్తిగ్ ఇంటర్వ్యూలతో పరీక్షించాలని గూగుల్ యోచిస్తోందని పిచాయ్ తెలిపారు. కృత్రిమ మేథ అంటే ఎఐ విస్త1తంగా వ్యాప్తిచెందిందని, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు రిమోట్ జాబ్ ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించవద్దని గూగుల్ ఉదోనయగులు కంపెనీ మేనేజ్‌మెంట్‌ను డిమాండ్‌చేస్తున్నారు. ఉదోనయగంలోకి వచ్చాక అభ్యర్థులు రియల్‌టైమ్ కోడింగ్ సవాళ్లను పరిష్కారించాల్సి ఉంటుందని ఆన్‌లైన్ ఇంటర్వ్యూల సమయంలో కెమేరా బయట ఎఐ సాధనాలను ఉపయోగించడంవల్ల అభ్యర్థుల వాస్తవిక సత్తా తెలియడంలేదన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థుల్లో 50శాతం కంటే ఎక్కువమంది ఎఐ సాధ నాలసాయంతోవెూన ంచే స్తున్నారని నియామక నిర్వాహకులు పేర్కొంటున్నట్లు తెలిపారు. మనమంతా హైబ్రిడ్‌గా పనిచేస్తున్నందున ఇంటర్వ్యూలలో కొంతభాగాన్ని వ్యక్తిగతంగా నిర్వహించడంపై ఆలోచించడం మంచిదని చెపుతున్నారు. గూగుల్ సంస్కృతిని అభ్యర్థులు అర్థంచేస ుకోడానికి ఇది సాయపడుతుందని పిచాయ్ అన్నారు. ఈ సమస్య కేవలం గూగుల్‌కే పరిమితం కాలేదని ఐటిపరిశ్రమ వ్యాప్తం సంక్షోభంగా మారిందన్నారు. ఈ సమస్య సత్వరపరిష్కారానికి కృషిచ ేస్తున్నామని గూగుల్ వైస్‌ప్రెసిడెంట్ బ్రియాన్ ఓంగ్ అన్నారు.



# జిఎస్టీ సంస్కరణలకు రాష్ట్రాలు సహకరించాలి

## ప్రధాని నరేంద్ర మోడీ సూచనలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** జిఎస్టీ భావితరం సంస్కరణలకు సంబంధించిన ముసాయిదాను ఇప్పటికే రాష్ట్రాలకు పంపించామని, వాటి అమలుకు సహకరించాలని ప్రధానిమోడీ విజ్ఞప్తిచేసారు. ఈముసాయిదాలో మార్పులు పేద మధ్యతరగతి ప్రజలతోపాటు వ్యాపారులకు ఎంతోప్రయోజనకరంగా ఉంటాయన్నారు. ఢిల్లీలో రెండు హైవే ప్రాజెక్టుల ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడిన ప్రధానిమోడీ జీఎస్టీ చట్టాన్ని సరళీకృతంచేసి పనున రేట్లను సవరించాలని కేంద్రం భావిస్తోందన్నారు.
ఎన్డీయే దృష్టిలో సంస్కరణలు అనేవి సుపరిపాలన పురోగతిని సూచిస్తాయని సమీప భవిష్యత్తులో వ్యాపార కార్యకలాపాలు మరింత సులువుగా మార్చే లక్ష్యంతోనే సంస్కరణలు అమలుచేసేందుకు నెక్స్ట్‌జెన్ జీఎస్టీతో సిద్ధం అయ్యామని మోడీ అన్నారు. దీపావళినాటికి ఈసంస్కరణలు రెట్టింపు బోనస్ ఇస్తాయన్నారు. జీఎస్టీ సంస్కరణలకు సంబంధించిన ముసాయిదాను రాష్ట్రాలకు కేంద్రం పంపించింది. వీటికి అన్ని రాష్ట్రాలు సహకరిస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. సాధ్యమైనంత త్వరగా ఈప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తిచేసారు.
ఈసంస్కరణలప్రతిపాదనలపై చర్చించేందుకు వచ్చేనెలలో జీఎస్టీ కౌన్సిల్‌భేటీ అవుతోందన్నారు. ప్రతిపాదిత రెండు శ్లాబుల విధానాన్ని జీఎస్టీ మండలి ఆమోదిస్తే ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబుల్లో 12,28 శాతం శ్లాబులు తొలగిపోనున్నాయని 5, 18శాతం శ్లాబులు మాత్రమే ఉంటాయన్నారు. ఇది గేమ్‌ఛేంజర్ సంస్కరణగా మిగిలిపోతుందని నిపుణులు చెపుతున్నారు.
ఆరునెలలపాటు సాగిన చర్చలు డజన్ల సమావేశాల తర్వాత ప్రతిపాది జీఎస్టీ విధానం తెరమీదకు వచ్చిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.



## మార్కెట్‌లోకి స్మార్ట్

# యమాహా హైబ్రిడ్ స్కూటర్

**చెన్నై, ఆగస్టు 17:** యమాహా దేశీయ మార్కెట్‌లోకి హైబ్రిడ్ స్కూటర్‌ను పరిచయం చేసింది. 125సిసి ఇంజిన్‌తో తయారైన ఈ స్కూటర్ ఐదు రకాల్లో లభిస్తోంది. ఫాసినో 125 ఎఫ్ఐ హైబ్రిడ్, రేజెడ్ఆర్ 125 ఎఫ్ఐ హైబ్రిడ్‌లు అడ్వాన్స్ స్మార్ట్‌ఫీచర్స్, స్టైలిష్ లుక్‌తో తయారుచేసింది. ఈ స్కూటర్‌ప్రారంభ ధర రూ.79, 340నుంచి రూ.1,02,790ధరల్లో లభిస్తున్నాయి. స్మార్ట్‌మోటార్ టెక్నాలజీ, సైలంట్ స్టార్ట్ అండ్ స్టాప్ సిస్టమ్, నావిగేషన్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తయారుచేసింది.

# ఐటి పరిధిలో లేకున్నా రిటర్నులు దాఖలు చేయాల్సిందే!

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** ఆదాయ పన్ను (ఐటీ) రిటర్నుల ఫైలింగ్ గడువు దగ్గర పడుతోంది. ఏటా జూలై ఆఖరు వరకు ఉండే గడువును ఈ సంవత్సరం ప్రభుత్వం సెప్టెంబరు 15 వరకు పొడిగించింది. చాలామంది తాము ఐటిపరిధిలోలేమని రిటర్న్ ఫైల్ చేయాల్సిన అవసరం ఏముందని అనుకుంటారు. అయితే ఆదాయం, పన్ను మినహాయింపు పరిధికి లోబడి ఉన్నా కొన్ని సందర్భాల్లో రిటర్న్ ఫైల్ చేయక తప్పదు. ఆదాయం తక్కువగా ఉన్నా చాలా మంది విదేశీ పర్యటనల్లో జోరుగా ఖర్చు చేస్తుంటారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఈ ఖర్చులు రూ.2 లక్షలు లేదా అంతకు మించి ఉంటే వారి ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా వారు తప్పనిసరిగా ఐటీ రిటర్న్ దాఖలు చేయాలి. ప్రపంచీకరణ పుణ్యమానీ భారతీయులూ పెద్దఎత్తున విదేశాల్లో ఆస్తులు కూడబెడుతున్నారు లేదా విదేశీ కంపెనీల షేర్లు, రుణ పత్రాల్లో మదుపు చేసి వాటిపై వచ్చే డివిడెండ్, వడ్డీ ఆదాయం పొందుతున్నారు. ఇలాంటి వ్యక్తుల ఆదాయం మన దేశంలో పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా.. తప్పనిసరిగా తమ విదేశీ ఆస్తులు, పెట్టుబడులు, ఆదాయ వివరాలతో ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి. గత ఆర్థిక సంవత్సరం (2024-25) లో మీ ఆదాయం నుంచి టీడీఎస్ లేదా టీసీఎస్ రూ.25,000 లేదా అంతకు మించి ఉన్నా ఐటీ రిటర్న్ చేయడం తప్పనిసరి. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక వ్యక్తి వ్యాపార అమ్మకాలు, టర్నోవర్, ఆదాయం రూ.60 లక్షలు మించితే ఆ వ్యక్తి తప్పనిసరిగా రిటర్న్ ఫైల్ చేయాలి. అదే వృత్తి నిపుణులైతే వార్షిక ఆదాయం రూ.10 లక్షలు మించితే తప్పనిసరిగా రిటర్న్ దాఖలు చేయాలి. ఆర్థిక సంవత్సరంలో మీ వార్షిక కరెంటు బిల్లు రూ.2 లక్షలు లేదా అంతకు మించి ఉంటే తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి. మీ వార్షిక ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా, ట్యాక్స్ రిఫండ్ ఏమైనా ఉంటే, ఐటీ రిటర్న్ ఫైల్ చేయడం తప్పనిసరి. ఈ రిటర్న్‌లోని సమాచారాన్ని సరిచూసుకునే ఆదాయ పన్ను శాఖ రిఫండ్ జారీ చేస్తుంది. ఏ వ్యక్తికైనా ఒక ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు కరెంట్ ఖాతాలో అయితే రూ.కోటి లేదా అంతకు మించి, సేవింగ్స్ బ్యాంకు ఖాతాలో అయితే రూ.50 లక్షలు లేదా అంతకు మించి డిపాజిట్లు ఉంటే వారు తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి. వార్షిక ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా పెట్టుబడి లాభాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) మినహాయింపు కోరుకునే వ్యక్తులూ తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి.







# ట్యారిఫ్ భయాలను అధిగమించే కొత్త జిఎస్టీ!

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** ప్రతిపాదిత జిఎస్టీ సంస్కరణలను నెక్స్ట్ జెన్‌జీఎస్టీగా అధికారులు చెపుతున్నారు. సింగిల్ ట్యాక్స్ శ్లాబ్‌గా మారే అవకాశం ఉందని చెపుతున్నారు. కొత్త జిఎస్టీ విధానంలో ఐదుశాతం, 18శాతం శ్లాబులు మాత్రమే ఉండటంతో ఆర్థికవ్యవస్థ ఉత్తేజితం చేస్తుందని సదరు అధికారి తెలిపారు. టారిఫ్ భయాలను అధిగమించేలాచేస్తుందన్నారు జిఎస్టీ మండలి ఆమోదిస్తే ఇకపై 5,18 శ్లాబులు మాత్రమే ఉంటాయని అంటున్నారు. ఇదొక గేమ్‌ఛేంజర్ సంస్కరణ అని చెపుతున్నారు నిత్యావసరాలన్నింటిపైనా ఇక ఐదుశాతం జీఎస్టీ ఉంటుంది. జీఎస్టీ మండలి సమావేశంలో ఆమోదం పొందితేపన్నురేట్ల ఆధిక్యం ముగుస్తుందని, స్థిరత్వాన్ని తెస్తుందని అంచనా. ఇదే కొనసాగితే బహుశా 2047 నాటికి ఒకే శ్లాబ్ జీఎస్టీ స్థాయికి చేరతామనిజీఎస్టీ అధికారులే చెపుతున్నారు. ఇదే విధానం అమలులోకి వస్తే దేశం అభివృద్ధిచెందిన దేశాల జాబితాలోకి మారిపోతుందన్నారు. అప్పుడు ఇక దేశవ్యాప్తంగా ఒకే శ్లాబులో జీఎస్టీ కొనసాగుతుందని అధికారులు చెపుతున్నారు. ప్రతిపాదిత జిఎస్టీ విధానంలో సామాన్యుడి అవసరాలన్నీ కూడా ఐదుశాతం శ్లాబ్‌లోనే ఉంటాయి. ధరలు తగ్గడంతో వినియోగం కూడా పెరిగే అవకాశం ఉంది. తక్కువ పన్నులు విదించడం అంటే ప్రజల జేబుల్లో మరింతగా ఆదాచేయడమేని ప్రభుత్వం చెపుతోంది. ఆరునెలలపాటు జరిగిన సుదీర్ఘ తర్జనబర్జనల తర్వాత ఈ కొత్త నెక్స్ట్‌జెన్ జిఎస్టీ అమలుకువచ్చిందన్నారు.

# ఈవారం ఏడు పబ్లిక్ ఇష్యూలు!




**ముంబయి, ఆగస్టు 17:** మార్కెట్లలోకి ఈవారం ఏడు పబ్లిక్ ఇష్యూలు వస్తున్నాయి. మెయిన్‌బోర్డులో విక్రమ్‌సోలార్, శ్రీజీ షిప్పింగ్, జెమ్ ఏరోమాటిక్స్, పటేల్ రిటైల్ మంగళ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్‌లు ఇష్యూకు వచ్చాయి. వీటిలో మంగళ్ ఎలక్ట్రికల్ 28న స్టాక్ ఎక్ఛేంజిల్లో నమోదు అవుతుండగా మిగిలి నాలుగు కూడా 26న నమోదవుతున్నాయి. ఎస్ఎంఇ విభాగంలో రెండు కొత్త పబ్లిక్ ఇష్యూలు ఉన్నాయి. స్టూడియో ఎల్ఎస్‌డి, ఎల్జీటీ బిజినెస్ కనెక్షన్‌లు ఉన్నాయి. ప్రధాన ఇష్యూల్లో ఈవారం బ్లూస్టోన్ జ్యూయెలరీ 19వ తేదీ రెగాల్ రీసోర్సెస్ 20న నమోదవుతున్నాయి. ఎస్ఎంఇ విభాగంలో 18న ఎఎన్‌బీ మెటల్‌క్యాస్ట్, స్టార్ ఇమేజింగ్; మెడిస్టెప్ హెల్త్‌కేర్, 19న ఇకోడెక్స్ పబ్లిషింగ్, 20న మహీంద్ర రియాల్టర్స్ ఎన్ఎస్ఇ ఎస్ఎంఇ ప్లాట్‌ఫామ్‌పై నమోదవుతూన్నయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.